

ఒంగోలులోని మెప్మా కార్యాలయం

మెప్మాలో కలకలం..!

'ఆంధ్రజ్యోతి' కథనంతో కదులుతున్న డొంక

పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా)లో రుణాల పేరుతో జరిగిన గోల్‌మాల్ వ్యవహారం ప్రకంపనలు సృష్టిస్తోంది. ఈ విషయమై 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనం ఆ సంస్థలో కలకలం రేపింది. నకిలీ గ్రూపులతో బ్యాంకులను బురిడీ కొట్టించి రూ.కోట్ల మేర రుణాలు దోచుకున్న వారి గుండెల్లో గుబులు మొదలైంది. అదేసమయంలో ఈ వ్యవహారంపై ఇంటెలిజెన్స్ అధికారులు దృష్టి సారించారు. అసలేం జరిగిందన్న విషయమై ఆరా తీయడం ప్రారంభించారు. మరోవైపు రుణాలు బొక్కేసిన వైసీపీ మహిళా నాయకులు, ఆర్పీలు తప్పులు కప్పిపుచ్చుకునేందుకు దారులు వెతుకుతున్నారు. ఎలాగైనా ఈ గండం నుంచి గట్టెక్కించాలని, బ్యాంకులకు తామే నెలనెలా వాయిదాలు చెల్లిస్తామని పొదుపు మహిళల చుట్టూ తిరుగుతున్నారు. బోగస్ పేర్లతో రుణాల స్వాహాపై సిట్‌తో విచారణ చేయించాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా మెప్మా అధికారులు నోరు మెదపకపోవడం అనుమానాలకు తావిస్తోంది.



- నకిలీ గ్రూపులతో కోట్ల స్వాహాపై ఇంటెలిజెన్స్ ఆరా
- బోగస్ పేర్లతో రుణాలు పొందిన
- వైసీపీ నాయకులు, ఆర్పీల గుండెల్లో గుబులు
- నోరు మెదపని మెప్మా అధికారులు
- సిట్ వేయాలని టీడీపీ డిమాండ్

ఒంగోలు (కార్పొరేషన్), ఫిబ్రవరి 6 : మహిళల ఆర్థిక స్వావలంబన కోసం ఏర్పాటు చేసిన పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా)లో కొంతకాలంగా బోగస్ రుణాల బాగోతం నడిచింది. అధికారపార్టీ నాయకురాళ్లు, ఆర్పీలు కుమ్మక్కై పెద్ద దందాను నడిపారు. లేని పొదుపు సంఘాలు ఉన్నట్లు చూపించి, గ్రూపు సభ్యులకు తెలియకుండానే వారిపేర్లు చేర్చి, నకిలీ ఆధార్ కార్డులను సృష్టించి ఒంగోలులోని వివిధ బ్యాంకుల్లో రూ.50కోట్ల మేరకు రుణాలు తీసుకొని స్వాహా చేశారు. దీనిపై 'ఆంధ్రజ్యోతి' ఆదివారం సంచికలో 'మెప్మాలో మెక్కేశారు' శీర్షికన సమగ్ర కథనం ప్రచురితమైంది. ఇది ప్రస్తుతం ఆ సంస్థతోపాటు, అధికార పార్టీ నేతల్లో కలకలం సృష్టిస్తోంది.

తప్పించుకునేందుకు అడ్డదారులు



పట్టణ పొదుపు మహిళలకు ఇటీవల ప్రభుత్వం విరివిగా రుణాలు మంజూరు చేయడంతోపాటు, ఆయా బ్యాంకర్లు కూడా రూ.లక్షల్లో రుణాలు ఇచ్చేందుకు వెనుకాడడం లేదు. దీంతో కొందరు ఆర్పీలు తమ చేతివాటం చూపారు. పలువురు పొదుపు సభ్యుల ఆధార్ కార్డులను ఆధారంగా చేసుకుని నకిలీ గ్రూపులు తయారు చేసి రూ.కోట్లు దండుకున్నారు. ఈ వ్యవహారంలో కొందరు వైసీపీ శ్రేణుల భాగస్వామ్యం కూడా ఉండటంతో వారిలో వణుకు మొదలైంది. ఎవరికి వారే భుజాలు తడుముకుంటూ కుంభకోణం నుంచి తప్పించుకునే మార్గాలను అన్వేషిస్తున్నారు. కొందరు అవినీతిని కప్పిపుచ్చుకునేందుకు ఇప్పటికే అడ్డదార్లు వెతుకుతున్నారు. మరి కొందరు రాజకీయ నాయకుల వద్దకు పరుగులు పెట్టి గండం నుంచి తమను గట్టెక్కించాలని వేడుకుంటున్నారు.

రంగంలోకి ఇంటెలిజెన్స్

రుణాల పేరుతో రూ.50కోట్ల గోల్‌మాల్ వ్యవహారంపై ఇంటెలిజెన్స్ అధికారులు ఆరా తీస్తున్నారు. వారు మంగళవారం ఒంగోలులోని మెప్మా జిల్లా కార్యాలయంలో పీడీ రవికుమార్‌ను కలిసి పొదుపు రుణాల మంజూరు, రికవరీలు, ఇతరత్రా రుణాల విషయంలో విధివిధానాలను అడిగి తెలుసుకున్నట్లు సమాచారం. అంతేకాకుండా రూ.కోట్ల రుణాలు బ్యాంకుల నుంచి ఎలా పొందారు? అందుకు బాధ్యులు ఎవరు? వారి విధులు ఏమిటి? అధికారుల భాగస్వామ్యం తదితర అంశాలను క్షుణ్ణంగా అడిగినట్లు సమాచారం. దీంతో మెప్మా పీడీ పలువురు పీవోలను పిలిచి ఇంటెలిజెన్స్ అధికారులు అడిగిన సమాచారం ఇవ్వాలని ఆదేశించినట్లు తెలిసింది. ఇదిలా ఉండగా పొదుపు రుణాలకు సంబంధించి కీలక బాధ్యత వహించే లీడ్ బ్యాంకు మేనేజరు మెప్మా కార్యాలయానికి వెళ్లి ఇప్పటి వరకూ డివిజన్ల వారీ ఎన్ని గ్రూపులకు రుణాలు ఇచ్చారు? సభ్యులు ఎంతమంది? అన్న వివరాలను సేకరించినట్లు తెలిసింది. మెప్మా కార్యాలయ ఉద్యోగుల్లో ఆందోళన మొదలైంది. మరోవైపు ఆర్పీలు, సీవోలు కలవరపడుతున్నారు.

మెప్మా అధికారుల మౌనం

మెప్మాలో నకిలీ పొదుపు సంఘాల పేరుతో భారీగా రుణాలు పొందడం గత కొద్ది నెలలుగా సాగింది. ఇదేమీ అధికారులకు తెలియకుండా జరగలేదన్న అనుమానాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికీ దీనిపై ఎలాంటి విచారణ కానీ, సిబ్బందికి హెచ్చరికలు కానీ చేయకపోవడం వెనుక అంతర్యం ఏమిటి? అని పలువురు ప్రశ్నిస్తున్నారు. మెప్మా జిల్లా స్థాయి అధికారుల నుంచి క్షేత్రస్థాయి ఉద్యోగుల వరకు అక్రమార్కుల నుంచి భారీగా ముడుపులు ముట్టాయని పలువురు ఆరోపిస్తున్నారు. అధికారులకు కూడా ఇందులో భాగస్వామ్యం ఉంది అనడానికి వారి మౌనమే సమాధానమని అంటున్నారు.

బాలినేనికి చిత్తశుద్ధి ఉంటే సిట్‌తో విచారణ చేయించాలి

టీడీపీ నాయకుల డిమాండ్

మెప్మాలో జరిగిన రూ.కోట్ల కుంభకోణంపై ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డికి చిత్తశుద్ధి ఉంటే సిట్‌తో విచారణ చేయించాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గతంలో ఒంగోలులో జరిగిన భూకబ్జాలపై తానే సిట్ వేయించానని, తాను ఎలాంటి అవినీతికి పాల్పడలేదని పదేపదే చెప్పుకొంటున్న బాలినేని.. ఇప్పుడు జరిగిన రుణాల స్వాహాపై తన నీతిని నిరూపించుకోవాలన్నారు. బోగస్ గ్రూపుల పేరుతో రూ.కోట్లు బొక్కేసిన వ్యవహారంలో వైసీపీ నేతల భాగస్వామ్యంపై ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. విలేకరుల సమావేశంలో పార్టీ నాయకులు ఎద్దుశశికాంత్ భూషణ్, కామేపల్లి శ్రీనివాసరావు, షేక్ కపిల్ బాషా, పి.వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.


మీడియాతో మాట్లాడుతూ ఆంధ్రజ్యోతి కథనాన్ని చూపిస్తున్న టీడీపీ నేతలు

పోలీస్ బాస్ ఎవరు?

- తాత్కాలికంగా నిలిచిన మలికగర్గ్ బదిలీ
- రిలీవ్ కావొద్దని ఉన్నతాధికారుల మౌఖిక ఆదేశాలు
- కొత్తగా నియమితులైన పరమేశ్వరరెడ్డిపై వైసీపీ నేతల అయిష్టతే కారణం
- పరిశీలనలో పల్నాడు జిల్లా ఎస్పీ



ఒంగోలు (క్రైం), ఫిబ్రవరి 6 : జిల్లా ఎస్పీగా ఎవరు వస్తారు అన్న విషయంలో సందిగ్ధం నెలకొంది. మలికగర్గ్ బదిలీ తాత్కాలికంగా నిలిచిపోయింది. ఆమెకు మంగళవారం జరగాల్సిన వీడ్కోలు సభ కూడా రద్దయ్యింది. ఇక్కడికి ఎస్పీగా రావాల్సిన పరమేశ్వరరెడ్డి పట్ల జిల్లాకు చెందిన వైసీపీ నేతలు తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేయడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. అయితే మలికగర్గ్‌ను కొనసాగిస్తారా? లేక కొత్తవారిని నియమిస్తారా? అన్నది కొద్దిరోజుల్లో తేలనుంది. ఎస్పీ మలికగర్గ్‌ను తిరుపతి బదిలీ చేసి అక్కడ పనిచేస్తున్న పరమేశ్వరరెడ్డిని ఇక్కడ ఎస్పీగా నియమిస్తూ ఈనెల 1న ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. దీంతో మంగళవారం మలికగర్గ్‌కు వీడ్కోలు సభ ఏర్పాటు చేశారు. అయితే రిలీవ్ కావొద్దని ఆమెకు ఉన్నతాధికారుల నుంచి సోమవారం రాత్రి మౌఖిక ఆదేశాలు అందాయి. దీంతో వీడ్కోలు సభను రద్దు చేశారు. దీని వెనుక ఏమి జరుగుతోంది? జిల్లా ఎస్పీగా ఎవరు వస్తారు? అన్నది చర్చనీయాంశమైంది. పరమేశ్వరరెడ్డి నియమాకంపై అధికార పార్టీ నేతలు సానుకూలంగా లేరు. ఆదేసమయంలో తిరుపతి లోక్‌సభ ఉపఎన్నిక సందర్భంగా జరిగిన పరిణామాలను దృష్టిలో ఉంచుకొని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చన్నాయుడు పరమేశ్వరరెడ్డి ప్రకాశం జిల్లా ఎస్పీగా నియామకంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఈక్రమంలోనే సోమవారం విజయవాడలోని ఓ హోటల్‌లో వైసీపీ జిల్లా కోఆర్డినేటర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశానికి హాజరైన వైసీపీ నాయకులు పరమేశ్వరరెడ్డి నియమాకంపై అభ్యంతరాలు వ్యక్తం చేశారు. ఈనేపథ్యంలో తాత్కాలికంగా ఎస్పీ మలికగర్గ్‌ను రిలీవ్ కావొద్దని ఉన్నతాధికారులు మౌఖిక ఆదేశాలు ఇచ్చారు.

8వ తేదీ తర్వాత నిర్ణయం

వాస్తవానికి గత నెలలో రాష్ట్రంలోని 30 మంది ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ ఉత్తర్వులు వచ్చాయి. ఆ జాబితాలో మలికగర్గ్ పేరు లేదు. కానీ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి వైసీపీ జిల్లా కోఆర్డినేటర్‌గా వచ్చిన తరువాత ఆగమేఘాలపై ఈనెల 1న మలికగర్గ్‌ను తిరుపతికి బదిలీ చేసి అక్కడ పనిచేస్తున్న పరమేశ్వరరెడ్డిని ఇక్కడ ఎస్పీగా నియమిస్తూ ఉత్తర్వులు వచ్చాయి. దీంతో ఆమె ఇక్కడి నుంచి రిలీవ్ అయ్యేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. అయితే పరమేశ్వరరెడ్డి పట్ల జిల్లాలోని వైసీపీ నేతలు సానుకూలత వ్యక్తం చేయకపోగా ఆయన వద్దు అంటూ భీష్మించారు. దీంతో ఎస్పీ బదిలీ తాత్కాలికంగా నిలిచిపోయింది. పల్నాడు ఎస్పీగా పనిచేస్తున్న రవిశంకర్ రెడ్డిని ఎస్పీగా నియమించాలని వైసీపీ నాయకులు ప్రతిపాదిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో ఈ నెల 8 తర్వాత ఎస్పీ విషయంలో తుది నిర్ణయం తీసుకునే అవకాశముంది.

పర్చూరుపై మల్లగుల్లాలు

మద్దిశెట్టి, రవిశంకర్‌లతో సీఎంవో అధికారుల చర్చలు





ఆంధ్రజ్యోతి, ఒంగోలు

ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని పర్చూరు అసెంబ్లీ వైసీపీ ఇన్‌చార్జి వ్యవహారంపై ఆ పార్టీ అధిష్ఠానం మల్లగుల్లాలు పడుతోంది. ప్రస్తుత ఇన్‌చార్జి ఆమంచి కృష్ణమోహన్‌తో సోమవారం మంతనాలు జరిపిన ముఖ్యనేతలు మంగళవారం దర్శి ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్, ఒంగోలుకు చెందిన వ్యాపారవేత్త రవిశంకర్‌లను పిలిచి మాట్లాడారు. పర్చూరు ఇన్‌చార్జిగా ఉన్న ఆమంచి అక్కడి నుంచి పోటీకి సిద్ధంగా లేరన్న సమాచారానికి తోడు, ఆయన్ను ఆపార్టీ శ్రేణులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్న నేపథ్యంలో ప్రత్యామ్నాయం కోసం అధిష్ఠానం పావులు కదుపుతోంది. సోమవారం ఆమంచితో అధిష్ఠానంలోని ముఖ్యనేతలతోపాటు సీఎం కూడా మాట్లాడారు. అయినా ప్రత్యామ్నాయ అభ్యర్థి కోసం మంగళవారం కూడా ప్రయత్నాలు కొనసాగించడంతో ఆమంచిని పర్చూరు నుంచి తప్పించటం కానీ, ఆయన పోటీచేయనని చెప్పడం కానీ జరిగిందన్న నమ్మకం ఆపార్టీ శ్రేణుల్లో బలపడిపోయింది.

కాపులనే రంగంలోకి దించాలని..

కమ్మ సామాజికవర్గం ఓటర్లు అధికంగా ఉన్న పర్చూరు నియోజకవర్గం నుంచి కాపు సామాజికవర్గానికి చెందిన వ్యక్తిని రంగంలోకి దింపాలనేది వైసీపీ వ్యూహం. అందుకే సీఎంతో తాను పోటీచేస్తానని చెప్పిన గొట్టిపాటి భరత్‌ను, పోటీకి సిద్ధంగా ఉన్న మరో మాజీ ఇన్‌చార్జి రామనాథం బాబును పక్కనపెట్టి కాపు సామాజికవర్గం వారికోసం అన్వేషిస్తున్నారు. దర్శి ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్‌ను సిటింగ్ స్థానం నుంచి తప్పించి మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డికి అవకాశం ఇచ్చారు. దీంతో అసంతృప్తితో ఉన్న మద్దిశెట్టిని పర్చూరు నుంచి పోటీచేయమని గతంలో కోరగా ఆయన తిరస్కరించారు. తిరిగి మంగళవారం సజ్జలతోపాటు సీఎంవో ముఖ్య కార్యదర్శి ధనుంజయరెడ్డి కూడా ఆయనతో మాట్లాడినట్లు తెలిసింది. మరోసారి ఆలోచించండి పర్చూరు నుంచి మీరు పోటీచేస్తే బాగుంటుందని చెప్పినట్లు సమాచారం. ఒంగోలు నుంచి కంది రవిశంకర్ కూడా సీఎంవో నుంచి పిలుపు రావడంతో వెళ్లారు. ఆయన ఆలస్యంగా అక్కడికి చేరుకోవడంతో అప్పటికే బుధవారం నాటి అసెంబ్లీ సమావేశాలు, కేబినెట్ సమావేశానికి సంబంధించిన పనుల్లో నిమగ్నమైన అధిష్ఠానంలోని నాయకులు, సీఎంవో అధికారులు బుధవారం సాయంత్రం కానీ, గురువారం కానీ మీరు రావాల్సి ఉంటుంది చెప్పినట్లు తెలిసింది. గతంలో చెప్పిన విధంగా పర్చూరు నుంచి పోటీచేసే అంశంపై మరోసారి ఆలోచించాలని సూచించినట్లు సమాచారం. అయితే సోమవారం సీఎంను కలిసిన ఆమంచి కృష్ణమోహన్... చీరాల నుంచి ఎమ్మెల్యే బలరాం లేక ఆయన కుమారుడు వెంకటేష్‌లు కాకుండా వేరేవారికి అవకాశం ఇవ్వాలన్న తన డిమాండ్‌ను మరోసారి ప్రస్తావించేందుకే పరిమితమైనట్లు భావిస్తున్నారు. అందువల్లనే పర్చూరు విషయంలో కూడా ఆయన కోసం వెంపర్లాడకుండా ప్రత్యామ్నాయ అభ్యర్థికోసం పరిశీలించాలని సీఎం చెప్పిన ఆదేశాలతోనే మంగళవారం ఈ ప్రయత్నాలు జరిగాయని భావిస్తున్నారు.

Sl.No	Name of the Tahsildar	Earlier order issued on 03.02.2024 as	Posted as
(1)	(2)	(3)	(4)
1	Srikanth Kedaranadh	-	Superintendent (Admin) Collector's Office, Ongole
2	V.Lavanya	Bestavaripeta	Superintendent (Magi) Collector's Office, Ongole
3	D.Mallikharjuna Rao	-	Superintendent (Coordination) Collector's Office, Ongole
4	M.Nagi Reddy	-	Superintendent (Land-1) Collector's Office, Ongole
5	M.Sujan Kumar	N.G.Padu	Tahsildar, Giddalur
6	K.Ravi Kumar	-	Ongole (Urban)
7	B.Somala Naik	Yerragondapalem	Markapur
8	G.Siddaradh	Ongole (Urban)	Yerragondapalem
9	G.Ramesh Kumar	Markapur	Chimakurthy
10	G.Sujatha	Chimakurthy	Darsi
11	S.Ramaiah	Singarayakonda	Cumbum
[illegible]	[illegible]vara Rao	C.S.Puram	Ponnalur
[illegible]	[illegible]	[illegible]	Special Tahsildar, KRRC, [illegible] Ongole

14 మంది తహసీల్దార్‌లకు స్థానచలనం

ఆరుగురికి పోస్టింగ్

ఒంగోలు (కలెక్టరేట్), ఫిబ్రవరి 6 : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నెల్లూరు, గుంటూరు జిల్లాల నుంచి వచ్చిన 14 మంది తహసీల్దార్‌లకు ఇటీవల ఇచ్చిన పోస్టింగ్ స్థానాలను మారుస్తూ కలెక్టర్ దినేష్‌కుమార్ మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఆరుగురికి కొత్తగా పోస్టింగ్‌లు ఇచ్చారు. కలెక్టరేట్ సూపరింటెండెంట్లుగా బేస్తవారపేటలో పనిచేస్తున్న వి.లావణ్య, శ్రీకాంత్ కేధార్‌నాథ్, డి.మల్లికార్జునరావు, ఎం.నాగిరెడ్డిని నియమించారు. కె.రవికుమార్‌కు ఒంగోలు అర్బన్, ఎస్‌కే నాగూర్‌మీరాకు సీఎస్‌పురం, ఎం.డానియేల్‌కు ఒంగోలు రూరల్ తహసీల్దార్‌గా పోస్టింగ్ ఇచ్చారు. నాగులుప్పలపాడులో పనిచేస్తున్న ఎం.సృజన్‌కుమార్‌ను గిద్దలూరు, ఎర్రగొండపాలెంలో పనిచేస్తున్న బి.సోమ్లానాయక్‌ను మార్కాపురం, ఒంగోలు అర్బన్‌లో పనిచేస్తున్న జి.సిద్ధార్థ్‌ను ఎర్రగొండపాలెం, మార్కాపురంలో పనిచేస్తున్న జి.రమేష్‌కుమార్‌ను చీమకుర్తి, సింగరాయకొండలో పనిచేస్తున్న ఎస్. రమణయ్యను కంభం తహసీల్దార్‌గా నియమించారు. సీఎస్‌పురంలో పనిచేస్తున్న ఎంవీకే సుధాకర్‌రావును పొన్నలూరు, దోర్నాలలో పనిచేస్తున్న పి.అనురాధను కేఆర్‌సీసీ ఒంగోలు ఆర్డీవో ఆఫీసు, అర్ధవీడులో పనిచేస్తున్న జె.ప్రసాదరావును సింగరాయకొండ, గిద్దలూరులో పనిచేస్తున్న పద్మనాభుడును బేస్తవారపేట, కంభంలో పనిచేస్తున్న వైవీబీ కుటుంబరావును టంగుటూరు, దర్శిలో పనిచేస్తున్న బి.పద్మావతిని నాగులుప్పలపాడు తహసీల్దార్‌గా స్థానచలనం కల్పించారు.

పదో తరగతి పరీక్షలకు 70 కేంద్రాలు

ఒంగోలు (విద్య), ఫిబ్రవరి 6 : జిల్లాలో మార్చిలో జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణకు జిల్లా విద్యాశాఖ ప్రతిపాదించిన 70 కేంద్రాలకు ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ ఆమోదం తెలిపారు. గత ఏడాది జిల్లాలో 80 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. ఈ ఏడాది కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లోని పది కేంద్రాలను రద్దు చేశారు. వీటిలో కురిచేడు, దొనకొండ, ముండ్లమూరు, పీసీపల్లి, వెలిగండ్ల, మర్రిపూడి, పెద్దారవీడు, దోర్నాల, పుల్లలచెరువు, త్రిపురాంతకంలోని కేజీబీవీలు ఉన్నాయి. కస్తూర్బా గాంధీ విద్యాలయాల్లో విద్యార్థినులకు తరగతి గదులు, వసతి గృహం ఒకే భవనంలో నడుస్తున్నాయి. అక్కడ పరీక్షలు జరిగే సమయంలో 6నుంచి9 తరగతుల విద్యార్థులు ఆ భవనంలోని వసతి గృహ గదుల్లోనే ఉండాల్సి వస్తోంది. ఇది పరీక్షలు రాసే విద్యార్థులకు అసౌకర్యంగా ఉంటోంది. దీంతో ఆ కేంద్రాలను రద్దు చేసి విద్యార్థులను ఇతర కేంద్రాల్లోకి సర్దుబాటు చేశారు.

29,449 మంది విద్యార్థులు

జిల్లాలోని 602 ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో చదువుతున్న 29,449 మంది విద్యార్థులు పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరుకానున్నారు. వీరిలో బాలురు 14,800 మంది, బాలికలు 14,649 మంది ఉన్నారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు విద్యాశాఖ అధికారులు తీవ్ర కసరత్తు చేస్తున్నారు.

అడుగడుగునా సర్పంచ్‌లకు అడ్డంకులు

- చలో అసెంబ్లీకి వెళ్లకుండా కట్టడి
- 60 మందికిపైగా గృహ నిర్బంధం
- మార్టూరు టోల్‌గేట్ వద్ద అదుపులోకి పలువురు
- జిల్లావ్యాప్తంగా సంఘ బాధ్యులపై నిఘా

ఒంగోలు (కలెక్టరేట్), ఫిబ్రవరి 6 : సమస్యల పరిష్కారం కోసం సర్పంచ్‌లు చేపట్టిన చలో అసెంబ్లీకి వారు వెళ్లకుండా అడుగడుగునా పోలీసులు అడ్డుకున్నారు. ఎక్కడికక్కడ కట్టడి చేశారు. ముందస్తుగా సోమవారమే 60 మందికిపైగా సర్పంచ్‌లకు నోటీసులిచ్చి గృహనిర్బంధంలో ఉంచారు. బస్టాండ్‌లు, రైల్వేస్టేషన్‌లలో నిఘా ఉంచారు. ఆర్టీసీ బస్సుల్లో విజయవాడ వెళ్తున్న కొందరిని మార్టూరు సమీపంలోని టోల్‌గేట్ వద్ద అదుపులోకి తీసుకుని వివిధ స్టేషన్‌లకు తరలించారు.

వైసీపీ ప్రభుత్వంలో పంచాయతీలు నిర్వీర్యం

రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామ సచివాయాలను ఏర్పాటు చేసి పంచాయతీలను నిర్వీర్యం చేసింది. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే ఆర్థిక సంఘం నిధులను కూడా రాష్ట్ర ప్రభుత్వం స్వాహా చేస్తోంది. పంచాయతీల్లో చిల్లిగవ్వ కూడా లేక చేసిన పనులకు బిల్లులు కూడా చెల్లించలేని దుస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో గత కొంతకాలం నుంచి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను నిరసిస్తూ ఏపీ పంచాయతీరాజ్ చాంబర్, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘంతోపాటు టీడీపీ, జనసేన, బీజేపీల ఆధ్వర్యంలో వివిధ రూపాల్లో ఆందోళనలు చేపట్టారు. అయినా ప్రభుత్వం స్పందించకపోగా ఉన్న అధికారాలను హరించేవిధంగా వ్యవహరిస్తోంది.

సర్పంచ్‌ల గృహ నిర్బంధం

కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన రూ.8,629 కోట్ల ఆర్థిక సంఘం నిధులను పంచాయతీల ఖాతాల్లో జమ చేయాలని, గ్రామ సచివాలయాలు, వలంటీర్లు పంచాయతీల ఆధీనంలోనే పనిచేయాలని, ఉపాధి హామీ నిధులను పంచాయతీలకు ఇచ్చి సర్పంచ్‌ల ద్వారానే ఖర్చు చేయాలని, విద్యుత్ బిల్లులను ప్రభుత్వమే చెల్లించాలని తదితర మొత్తం 15 డిమాండ్లతో పంచాయతీరాజ్ చాంబర్, సర్పంచ్‌ల సంఘం సంయుక్తంగా మంగళవారం చలో అసెంబ్లీకి పిలుపునిచ్చాయి. ఆ కార్యక్రమానికి జిల్లా నుంచి సర్పంచ్‌లు తరలివెళ్లకుండా పోలీసుల ద్వారా ప్రభుత్వం అడుగడుగునా అడ్డంకులను సృష్టించింది. జిల్లావ్యాప్తంగా సోమవారమే 60 మందికి పైగా సర్పంచ్‌లకు పోలీసులు నోటీసులు ఇచ్చారు. వారిని గృహ నిర్బంధంలో ఉంచారు. ఇంకోవైపు సోమవారం అర్ధరాత్రి నుంచి జిల్లా సరిహద్దుతోపాటు బస్టాండ్లు, రైల్వేస్టేషన్‌లలో తనిఖీలు చేపట్టారు. సర్పంచ్‌ల సంఘ ప్రతినిధులపై నిఘా ఉంచారు. ఆర్టీసీ బస్సుల్లో విజయవాడకు వెళ్తున్న కొందరు సర్పంచ్‌లను మార్టూరు సమీపంలోని టోల్‌గేట్ వద్ద అదుపులోకి తీసుకొని వారిని సంబంధిత మండలాల పోలీసు స్టేషన్లకు తరలించినట్లు సమాచారం.


మద్దిపాడు స్టేషన్‌లో ఉంచిన సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీరామమూర్తి, సర్పంచ్‌లు

సతాయిస్తున్న సర్వర్!

- రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో పనులకు ఆటంకం
- క్రయవిక్రయదారుల పడిగాపులు
- వారం రోజులుగా ఇదే పరిస్థితి

ఒంగోలు (క్రైం), ఫిబ్రవరి 6 : రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో సర్వర్ సతాయిస్తోంది. పదేపదే డౌన్ అవుతుండటంతో పనులకు ఆటంకం ఏర్పడుతోంది. వారం నుంచి ఇదే పరిస్థితి నెలకొన్నప్పటికీ చక్కదిద్దేందుకు అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ఆస్తుల రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన క్రయవిక్రయదారులు కార్యాలయాల వద్ద పడిగాపులు కాస్తున్నారు. ప్రస్తుతం గ్రామ, వార్డు సచివాలయాల్లో జగనన్న గృహాల రిజిస్ట్రేషన్ జరుగుతోంది. దీంతో సర్వర్‌పై ఒత్తిడి పెరిగి నెమ్మదిస్తోంది. భూముల క్రయవిక్రయదారులు, ఈసీలు, ఇతరత్రా రిజిస్ట్రేషన్ సేవలు అవసరమైన వారు ఇక్కట్లు పడుతున్నారు. రిజిస్ట్రేషన్లు రాత్రి పొద్దుపోయే వరకూ చేస్తున్నారు. సర్వర్ బాగా పనిచేస్తే ఒక్కో డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్‌కు 15 నిమిషాలు పడుతుంది. ఒంగోలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ రోజుకు సగటున 40 నుంచి 50 దస్తావేజులు రిజిస్ట్రేషన్ చేస్తుంటారు. కానీ సర్వర్ వచ్చిపోతుండటంతో ఒక్కో డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ గంటల సమయం పడుతోంది.


ఒంగోలులోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ల పరిశీలన


వివరాలను అడుగుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

టంగుటూరు, ఫిబ్రవరి 6 : మండలంలోని ఎం.నిడమలూరులో జరుగుతున్న ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్లను కలెక్టర్ దినేష్‌కుమార్ పరిశీలించారు. మంగళవారం ఎం.నిడమలూరు గ్రామ సచివాలయాన్ని సందర్శించిన కలెక్టర్ ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన హౌస్‌సైట్స్ రిజిస్ట్రేషన్ల ప్రక్రియను కంప్యూటర్ నుంచి పరిశీలించి జరుగుతున్న విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. ఇళ్ల స్థలాల లబ్ధిదారులను ఏ విధంగా సమీకరిస్తున్నారని కలెక్టర్ పంచాయతీ కార్యదర్శి సుబ్బాయమ్మను అడిగారు. తామే నేరుగా ఫోన్ చేసి రావాలని కోరుతున్నట్లు తెలిపారు. గ్రామ సచివాలయ నూతన భవనం పరిస్థితి ఏమిటని కలెక్టర్ ప్రశ్నించగా నిర్మాణం చివరి దశలో ఉందని, వచ్చే నెలలో ప్రారంభిస్తారని వెల్లడించారు. సర్వర్ సక్రమంగా పనిచేస్తుందా అని డిజిటల్ అసిస్టెంట్ రేవతిని కలెక్టర్ ప్రశ్నించారు. గ్రామంలో రెండు ఇళ్ల లేఅవుట్స్ ఉన్నాయని, అందులో 150 ఇళ్ల స్థలాల పంపిణీ జరిగిందని వివరించారు. ఈ మూడు రోజుల్లో 60 వరకు రిజిస్ట్రేషన్లు పూర్తి చేసినట్లు తెలిపారు. కలెక్టర్ వెంట ఆర్డీవో విశ్వేశ్వరరావు, తహసీల్దార్ శ్రీనాథ్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

కుటుంబంలోని ఓట్లన్నీ ఒకే చోట ఉంచాలి


మాట్లాడుతున్న ఆర్వో ఝాన్సీలక్ష్మి

కొండపి, ఫిబ్రవరి 6 : కొత్తగా అందజేసిన ఓటరు లిస్టులో ఒక ఇంటిలోని ఓట్లన్నీ ఒకే చోట లేవని, వేరువేరుగా ఉండటంతో ఇబ్బందిగా ఉందని, ఒకేచోట ఉండేలా సరిచేయాలని సీపీఎం మండల కార్యదర్శి కేజీ.మస్తాన్ కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గ ఈఆర్వో కె. ఝాన్సీలక్ష్మి ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం తహసీల్దార్లు, ఎన్నికల సిబ్బంది, రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం జరిగింది. అందిన సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఈఆర్వో ఝాన్సీలక్ష్మి చెప్పారు. సమావేశంలో వైసీపీ నాయకులు గొట్టిపాటి మురళి, కల్లూరి హరిబాబు, కొండపి, జరుగుమల్లి తహసీల్దార్లు బి. కిరణ్‌కుమార్, కె.ఎస్. చక్రవర్తి, డీటీలు స్రవంతి, శ్రీనాథ్, ఆరైలు, ఎన్నికల సిబ్బంది నాగరాజు, హనుమంతరావు పాల్గొన్నారు.

ధర్మప్రచార వారోత్సవాలు ప్రారంభం


వారోత్సవాలను ప్రారంభిస్తున్న శ్రీనివాసులరెడ్డి

వల్లూరు(టంగుటూరు), ఫిబ్రవరి 6 : మండలంలోని వల్లూరులో వేంచేసి ఉన్న వల్లూరమ్మ దేవస్థానంలో మంగళవారం నుంచి ధర్మప్రచార వారోత్సవాలను జిల్లా దేవదాయ ధర్మాదాయశాఖాధికారి శ్రీనివాసులరెడ్డి ప్రారంభించారు. తొలిరోజున దేవస్థానంలో ఉదయం 10గంటలకు వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ శాస్త్రోక్తంగా అష్టోత్తర పూజ చేశారు. గ్రామంలో ధర్మప్రచార రథోత్సవం అత్యంత వైభవంగా సాగింది. గ్రామస్థులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా దేవస్థానమందు గోపూజ, కుంకుమార్చనలు, భజన సంకీర్తనలు కొనసాగాయి. కార్యక్రమంలో ట్రస్ట్ బోర్డు చైర్మన్ కాలే శ్రీనివాసరావు, దేవదాయ శాఖ పరిశీలకుడు సిహెచ్. వేణుగోపాల్, దేవస్థానం కార్యనిర్వహణాధికారి రమేష్ పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి


కలెక్టరేట్ ఎదుట రిలే దీక్షలు చేస్తున్న రిటైర్డ్ ఉద్యోగులు

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 6: రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని గౌరవాధ్యక్షుడు ఏవీ.పుల్లారావు డిమాండ్ చేశారు. ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండో రోజైన మంగళవారం కలెక్టరేట్ వద్ద చేపట్టిన రిలే దీక్షలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. రిటైర్డ్ ఉద్యోగులకు ప్రతినెలా 1ఒకటో తేదీన పింఛన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పీఆర్సీ డీఏ బకాయిలను మంజూరు చేయాలని, ఈపీఎఫ్ పెన్షనర్లకు రూ.10వేలు కనీస పెన్షన్ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షుడు పేరయ్య, ప్రధాన కార్యదర్శి రాంబాబు, సింగరాజు శ్రీనివాసరావు, సూదులు నరసింహారావు, జి.నరసయ్య, కోటేశ్వరరావు, కె.దేవదానం, ఎం.శ్రీనివాసరావు, ఐవీ.ఆంజనేయులు, ఆర్.ఆదిశేషారావు, గురువారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బాలరాముని ఉత్సవం


పూజ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

ఒంగోలు (కల్చరల్),ఫిబ్రవరి 6: అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రతిష్ఠ జరిగి 16 రోజులు పూర్తయిన సందర్భంగా మంగళవారం 16 రోజుల ఉత్సవాన్ని భక్తులు ఘనంగా నిర్వహించారు. ఒంగోలు నగరం గడియారంవారివీధిలోని శ్రీ అనంత కోదండ రామస్వామి దేవస్థానంలో ఈ సందర్భంగా విశేష తోరణ పూజ, శ్రీ భక్తఆంజనేయ స్వామికి సహస్ర నాగవల్లీ దళార్చన జరిగాయి. అనంతరం భక్తులు రామభజన సంకీర్తనలో పాల్గొన్నారు. దేవస్థాన వంశపారంపర్య ధర్మకర్త గడియారం సుబ్బయ్య శర్మ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం తీర్థప్రసాద వితరణ జరిగింది.

టీడీపీ హయాంలోనే ఒంగోలు అభివృద్ధి

రాబోయే ఎన్నికల్లో ఆశీర్వదించండి.. ● పార్టీ ఉపాధ్యక్షుడు దామచర్ల జనార్దన్ ● పలుకాలనీల్లో ప్రచారం

ఒంగోలు(కార్పొరేషన్), ఫిబ్రవరి 6: ఒంగోలు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ హయాంలోనే జరిగిందని, రాబోయే ఎన్నికల్లో ఆశీర్వదించి అండగా ఉండి గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల జనార్దన్ కోరారు. ఈ మేరకు మంగళవారం 23 డివిజన్ పరిధిలోని పాపాకాలనీ, బిలాల్‌నగర్‌లో బాబూ ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ, జనం కోసం జనార్ధన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దామచర్ల మాట్లాడుతూ వైసీపీ పాలనలో ఏ ఒక్కరూ సంతోషంగా లేరన్నారు. పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా తెలుగుదేశం పార్టీ అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందని చెప్పారు. దుల్హాన్, రంజాన్ తోఫా, మైనార్టీలు హజ్‌యాత్రకు వెళ్ళేందుకు రాయితీతో నిధులు కేటాయించిన ఘనత టీడీపీదే అన్నారు. చంద్రబాబు పాలనలో ముస్లింలతో పాటు అన్ని వర్గాల ప్రజల సంక్షేమం సాధ్యపడిందన్నారు. ఒక్క ఛాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన సైకో జగన్ అబద్దాలు చెబుతూ, ప్రజల నెత్తిన ఆర్థిక భారాలు మోపారన్నారు. సైకో జగన్‌ను సాగనంపి, టీడీపీని గెలిపించాలని కోరారు. ఒంగోలు నగరం మరింత అభివృద్ధి సాధించాలంటే తనను మరోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో జనార్దన్‌కు హారతులిచ్చి, పూలతో ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో నగర అధ్యక్షులు కొఠారి నాగేశ్వరరావు, మాజీ మునిసిపల్ చైర్మన్ మంత్రి శ్రీనివాసరావు, పఠాన్ హనీఫ్‌ఖాన్, రాయపాటి బాబూరావు, షేక్ కరిముల్లా, కొక్కిలిగడ్డ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


స్థానికులతో మాట్లాడుతున్న దామచర్ల జనార్దన్

వైసీపీ నేతల అవినీతి నిరూపణకు సిద్ధం !

సింగరాయకొండలో అధికారాన్ని అడ్డుపెట్టుకొని కోట్లు కొల్లగొట్టారు ● మంత్రి సురేష్ స్పందించాలని జనసేన నేతల డిమాండ్

సింగరాయకొండ, ఫిబ్రవరి 6 : మంత్రి గారు.. కొండపి నియోజకవర్గంలో మీ నాయకులు చేసిన అవినీతిని సాక్ష్యాధారాలతో నిరూపించటానికి మేము సిద్ధం.. ఎటువంటి అవినీతికి పాల్పడలేదని నిరూపించుకోవడానికి మీ పార్టీ సిద్ధమా అంటూ జనసేన నియోజకవర్గ సమన్వయకర్త కనపర్తి మనోజ్‌కుమార్ ప్రశ్నించారు. సింగరాయకొండ పంచాయతీలో జరిగిన అవినీతిపై స్థానిక కందుకూరు రోడ్డులోని జనసేన పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ పాలనలో అధికారపార్టీ నేతలు నియోజకవర్గాన్ని నిలువు దోపిడీ చేశారని విమర్శించారు. టంగుటూరు జగనన్న కాలనీలో వైసీపీ నేతలు రూ.4 కోట్ల మేర అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. అలాగే సింగరాయకొండ పంచాయతీలోనూ కోట్లు గోల్‌మాల్ చేశారని చెప్పారు. మండల జనసేన పార్టీ అధ్యక్షుడు ఐనాబత్తిన రాజేష్ మాట్లాడుతూ సింగరాయకొండ సర్పంచ్ తాటిపర్తి వనజ పంచాయతీలో రూ. కోటి వరకూ నిధులను దుర్వినియోగం చేశారని ఆరోపించారు. ఎటువంటి పనులు చేయకుండా పంచాయతీ నిధులను అక్రమంగా తన సొంతఖాతాకు మళ్లించుకున్నారని దుయ్యబట్టారు. ఈ అవినీతిని సాక్ష్యాధారాలతో కలెక్టర్ దినేష్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. ఆయన కూడా వైసీపీ నేతల ఒత్తిళ్లకు తలొగ్గి చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. నియోజవర్గంలో ఆగిపోయిన అభివృద్ధి మళ్లీ జరగాలంటే టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థిని రాబోయే ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన జరుగుమల్లి మండల అధ్యక్షుడు శశిభూషణ్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జనసేన నేతలు

కుటుంబ సారథులను నియమించుకోండి

● టీడీపీ ఇన్‌చార్జ్ బీఎన్

సంతనూతలపాడు, ఫిబ్రవరి 6: ప్రతి బూత్‌లో 60 ఓట్లకు కుటుంబ సాధికారక సారథులను నియమించుకోవాలని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బీఎన్.విజయ్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఒంగోలులోని బీఎన్ నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. అదే విధంగా భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని త్వరగా పూర్తిచేయాలన్నారు. భవిష్యత్తు గ్యారంటీ బాట్ రిజిస్ట్రేషన్ తక్కువగా జరిగిన బూత్‌లను త్వరగా పూర్తి చేయాలని చెప్పారు. ఓటర్ వెరిఫికేషన్ విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. లోలెవల్ బూత్ పరిశీలకులుగా నియమితులైన మన్నెం త్రిమూర్తులు మాట్లాడుతూ గడిచిన ఎన్నికల్లో తక్కువగా ఓట్లు నమోదైన బూత్‌లను గుర్తించి వాటిమీద ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు చౌటశ్రీనివాసరావు, రాష్ట్ర సెక్రటరీ అడకా స్వాములు, చీమకుర్తి మండల అధ్యక్షులు గొట్టిపాటి రాఘవరావు, సంతనూతలపాడు మండల అధ్యక్షుడు మద్దినేని హరిబాబు, మద్దిపాడు మండల అధ్యక్షులు మండవ జయంత్‌బాబు, చీమకుర్తి పట్టణ అధ్యక్షుడు గొల్లపూడి సుబ్బారావు, ఎన్‌జీపాడు మండల అధ్యక్షుడు తేళ్ల మనోజ్, మండల ప్రధానకార్యదర్శులు, క్లస్టర్ ఇన్‌చార్జులు పాల్గొన్నారు.


నాయకులతో మాట్లాడుతున్న విజయ్‌కుమార్

ప్రజావ్యతిరేక పాలన చేస్తున్న బీజేపీ

16న పారిశ్రామిక సమ్మె, గ్రామీణ బంద్ విజయవంతానికి కార్మిక సంఘాల పిలుపు

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 6 : వ్యవసాయ కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న మోసకారి బీజేపీ ప్రభుత్వాన్ని రానున్న ఎన్నికల్లో తరిమికొట్టాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో మంగళవారం ఒంగోలులోని రంగాభవన్‌లో జరిగిన సదస్సులో మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన వాగ్దాలను అమలు చేయకుండా మోసగిస్తుందని ఆరోపించారు. అన్ని రంగాలను కార్పొరేట్ కంపెనీలకు అప్పగిస్తుందని ఆయన విమర్శించారు. ఏడాది పాటు దేశవ్యాప్తంగా రైతులు ఢిల్లీ పరిసర ప్రాంతాల్లో చేపట్టిన ఉద్యమానికి తలొగ్గిన ప్రధాని మోదీ లిఖితపూర్వకంగా ఇచ్చిన హామీలను కూడా అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. ఈనెల 16న జరిగే పారిశ్రామిక సమ్మె, గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు. కిసాన్ సంస్థ జిల్లా ప్రధానకార్యదర్శి చుంచు శేషయ్య మాట్లాడుతూ రైతుల రుణమాఫీ రుణ ఉపశమన చట్టం తీసుకరావాలని డిమాండ్ చేశారు. ఏపీ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వడ్డే హనుమారెడ్డి మాట్లాడుతూ భూ హక్కుల చట్టం వెంటనే రద్దు చేయాలన్నారు. జిల్లాలోని పాడి రైతును ఆదుకోవడంతో పాటు అమూల్‌కు కట్టబెట్టిన ప్రకాశం జిల్లా డెయిరీని ప్రభుత్వ నియంత్రణలోకి తీసుకోవాలని కోరారు. సీఐటీయూ జిల్లా ప్రధానకార్యదర్శి కాలం సుబ్బారావు మాట్లాడుతూ నాలుగు లేబర్ కోడ్‌లను వెంటన రద్దు చేసి 44 కార్మిక చట్టాలను అమలులోకి తేవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు నాయకుల కె.వీరారెడ్డి, పమిడి వెంకట్రావు, చిట్టిపాటి వెంకటేశ్వర్లు, కంకణాల రమాదేవి, బి.సుబ్బారావు, కొత్తకోట వెంకటేశ్వర్లు, ఎస్‌డీ.మౌలాలి, కంకణాల ఆంజనేయులు, కరుణానిధి, పీవీఆర్.చౌదరి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రంగారావు

పొగాకు గ్రేడింగ్ సక్రమంగా చేయాలి

● వేలంకేంద్రం-2 నిర్వహణాధికారి రామకృష్ణ

ఒంగోలు(రూరల్), ఫిబ్రవరి 6: పొగాకును సక్రమంగా గ్రేడింగ్ చేస్తే మంచి ధరలు వస్తాయని ఒంగోలు పొగాకు వేలంకేంద్రం-2 నిర్వహణాధికారి కె.రామకృష్ణ పేర్కొన్నారు. మంగళవారం పొగాకు వేలంకేంద్రం పరిధిలోని టి.అగ్రహారం, మద్దిరాలపాడు, పోతవరం, నాగులుప్పలపాడు, అనుమ్రోలువారిపాలెం, చీర్వానుప్పలపాడులోని పొగతోటలను, బ్యారన్లలోని క్యూరింగ్‌ను, గ్రేడింగ్‌లను రైతుమిత్ర బృందం సభ్యులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ రెలుపునకు వచ్చిన పొగాకును రెలిచి క్యూరింగ్ చేయాలన్నారు. అల్లిక చేయటానికి ముందుగా పచ్చాకును టార్పాలిన్ పట్టలపై ఉంచాలని, పొగాకును తగిన ఉష్ణోగ్రతలో క్యూరింగ్ చేయాలని తెలిపారు. ఇక గ్రేడింగ్ సమయంలో గడ్డిముక్కలు, బ్లేడ్‌లు, పుల్లలు, ప్లాస్టిక్ ముక్కలు, మట్టి లాంటివి లేకుండా బేళ్లు కట్టాలని, దీనివల్ల మంచి ధరలు వస్తాయని పేర్కొన్నారు. పొగతోటలు బెట్టకు రాకుండా అంతరసేద్యం చేయాలని, మల్లె ఉన్నట్లు గుర్తిస్తే దానిని తొలిగించి తగలపెట్టాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఎస్‌జీవో జె.తులసి, ఎస్ఎస్‌హెచ్ మేనేజర్ రామాంజనేయులు, ఐటీసీ ప్రతినిధి యస్వంత్‌కుమార్, బోర్డు క్షేత్ర అధికారి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


గ్రేడింగ్‌ను పరిశీలిస్తున్న పొగాకు రైతుమిత్ర బృందం

అవీ..ఇవీ..

14న ఒంగోలు జాతి పశువుల వేలం

నాగులుప్పలపాడు(ఒంగోలురూరల్), ఫిబ్రవరి6: చదలవాడ పశుక్షేత్రంలో ఈనెల 14వతేదీఉదయం 11గంటల నుంచి ఒంగోలు జాతిపశువులు వేలం నిర్వహిస్తున్నట్లు పశుక్షేత్ర ఏడీ డాక్టర్ బి.రవికుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొను రైతులు ఒకరోజు ముందుగా సంబంధిత పశువును పరిశీలించుకోవచ్చని చెప్పారు. పాడిఆవులు 9, ఒట్టి ఆవులు19, పెయ్యదూడలు 8, కోడెదూడలు 6 ఉన్నాయని, వాటికి వేలం నిర్వహిస్తున్నామని వేలం నిబంధనలు పాటిస్తూ కొనుగోలు చేసుకోవచ్చని తెలిపారు.

సివిల్ సప్లయిస్ డీఎంగా సత్యనారాయణ


సత్యనారాయణకు మొక్కను అందజేస్తున్న డీటీలు

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 6: సివిల్ సప్లయిస్ డీఎంగా ఎంవీ.సత్యనారాయణ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. కృష్ణా జిల్లా బంటుమల్లి తహసీల్దార్‌గా పనిచేస్తున్న సత్యనారాయణ డిప్యూటీ కలెక్టర్‌గా ఉద్యోగోన్నతి పొందారు. అనంతరం ఆయనను జిల్లా సివిల్ సప్లయిస్ డీఎంగా ప్రభుత్వం నియమించడంతో ఒంగోలులోని కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సత్యనారాయణను సివిల్ సప్లయిస్ కార్యాలయ అధికారులు, ఉద్యోగులు కలిసి అభినందించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీలు కృష్ణమోహన్, రామనారాయణరెడ్డి, కాశయ్య, నాయక్ తదితరులు మొక్కను అందజేసి శుభాకాంక్షలు చెప్పారు.

నాగులుప్పలపాడు పోలీస్‌స్టేషన్ పరిశీలన

నాగులుప్పలపాడు(ఒంగోలురూరల్), ఫిబ్రవరి6: నాగులుప్పలపాడు పోలీస్‌స్టేషన్‌ను డీఎస్పీ ఎం.కిషోర్‌బాబు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్నేహపూర్వ పోలీసింగ్ విధానం నిర్వహిస్తామని తెలిపారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఐ బ్రహ్మనాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

జగన్ పాలనలో ప్రగతి శూన్యం : టీడీపీ

మద్దిపాడు, ఫిబ్రవరి 6: ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలో ఎలాంటి ప్రగతి జరగలేదని టీడీపీ మండల అధ్యక్షుడు మండవ జయంత్‌బాబు విమర్శించారు. మంగళవారం అన్నంగి గ్రామంలో మన ఊరు-మన తెలుగుదేశం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జయంత్‌బాబు మాట్లాడుతూ గ్రామాల్లో టీడీపీ నాయకులు గ్రూపులుగా లేకుండా అందరూ సమన్వయంతో వచ్చే ఎన్నికల్లో విజయానికి కృషిచేయలన్నారు. వైసీపీ నాయకులు కొండ గ్రావెల్, ఇసుక, అక్రమ మైనింగ్ చేస్తూ జేబులు నింపుకుంటున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో మండవ గోపీనాథ్, కొమ్మాలపాటి సుబ్బారావు, దేవబత్తిన ప్రసాద్, ముల్లూరి మురళి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన


ఎగ్జిబిట్లను ప్రదర్శిస్తున్న విద్యార్థినులు

ఒంగోలు(విద్య), ఫిబ్రవరి 6: ఒంగోలు నగరం సంతపేటలోని వీఎస్‌జీ హైస్కూలులో మంగళవారం నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శన ఆకట్టుకుంది. పాఠశాల విద్యార్థులు మొత్తం 70 ఎగ్జిబిట్లను ప్రదర్శించారు. విద్యార్థులు తయారు చేసిన ప్రదర్శనలు విద్యార్థుల తల్లిదండ్రులను అబ్బురపర్చాయి. ఉప విద్యాధికారి అనితా రోజ్‌రాణి ఈ ప్రదర్శనను ప్రారంభించి విద్యార్థులను అభినందించారు. పాఠశాల కరస్పాండెంట్ కొల్లా మాధవరావు మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మతను వెలికితీసేందుకు ఇలాంటి వైజ్ఞానిక ప్రదర్శనలు దోహదపడతాయన్నారు. ఎగ్జిబిట్ల తయారీలో విద్యార్థులకు సహకరించిన టీచర్లను అభినందించారు. కార్యక్రమంలో రాధాకృష్ణ స్కూలు కరస్పాండెంట్ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

సర్పంచ్‌ల మనోభావాలను దెబ్బతీయడం తగదు

మద్దిపాడు, ఫిబ్రవరి 6: గ్రామానికి ప్రథమ పౌరులైన సర్పంచ్‌లను ప్రభుత్వం పోలీసులను అడ్డుపెట్టుకొని నోటీసులు జారీ చేసి వారి మనోభావాలను దెబ్బతీయం తగదని సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు బెజవాడ శ్రీరామమూర్తి పేర్కొన్నారు. మంగళవారం విజయవాడలో సర్పంచ్‌లు నిర్వహిస్తున్న ఆందోళన కార్యక్రమాలకు సర్పంచ్‌లను వెళ్లనీయకుండా అడ్డుకున్నారని విమర్శించారు. ఎస్ఐ శ్రీకాంత్ సర్పంచ్‌లను అదుపులోకి తీసుకుని మద్దిపాడు పోలీస్‌స్టేషన్‌లో ఉంచారు. ఈ విషయం తెలుసుకున్న మల్లవరం సర్పంచ్ నారా సుబ్బారెడ్డి, ఘడియపూడి సర్పంచ్ బొమ్మల రామాంజనేయులు, పలువురు సర్పంచ్‌లు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఎస్ఐతో మాట్లాడారు. సర్పంచ్‌లను అడ్డుకోవడం ప్రభుత్వానికి మంచి పద్ధతి కాదన్నారు. తమకు రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని బెజవాడ శ్రీరామమూర్తి డిమాండ్ చేశారు.

పొగాకు బ్యారన్ దగ్ధం

మద్దిపాడు, ఫిబ్రవరి 6: ఇనమనమెళ్లూరులో మంగళవారం వాకా వెంకటేశ్వరరెడ్డికి చెందిన పొగాకు బ్యారెన్ దగ్ధమైంది. బ్యారెన్‌లో పొగ గొట్టంపై పొగాకు కర్రపడి ఒక్కసారిగా మంటలు రేగి మొత్తం అగ్నికి ఆహుతి అయ్యింది. సమాచారం అందుకున్న ఒంగోలు అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో రూ.5 లక్షల మేర నష్టం వాటిల్లిందని బాధితుడు వెంకటేశ్వరరెడ్డి వాపోయారు.

రైజ్‌లో రేపు అవగాహన సదస్సు

ఒంగోలు(విద్య), ఫిబ్రవరి 6 : ఒంగోలులోని రైజ్ కృష్ణసాయి విద్యాసంస్థలో గురువారం ఏపీ రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో రాష్ట్రంలో అమలు చేస్తున్న విద్యావిధానాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు కళాశాల సెక్రటరీ శిద్దా హనుమంతరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సులో ప్రధానవక్తగా మండలి ఉపాధ్యక్షుడు కె.రామమోహనరావు ముఖ్య అతిథిగా హాజరవుతారని ఆయన పేర్కొన్నారు.

సహిత టీచర్లకు జిల్లా స్థాయి శిక్షణ రేపు

ఒంగోలు(విద్య); ఫిబ్రవరి 6: జిల్లాలోని భవిత, నాన్ భవిత కేంద్రాల్లో పనిచేస్తున్న సహిత విద్యారిసోర్స్ పర్సన్లు, హైస్కూళ్లలో పనిచేస్తున్న అసిస్టెంట్ స్పెషల్ ఎడ్యుకేషన్ వారికి గురువారం ఒంగోలులోని సాయిబాబా సెంట్రల్ స్కూలులో జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు కో ఆర్డినేటర్ వీఎస్.సుబ్బారావు మంగళవారం తెలిపారు. వీరికి ఇటీవల పంపిణీ చేసిన ట్యాబ్‌ల వినియోగంపై శిక్షణ ఇస్తారన్నారు. ఈ శిక్షణకు ఎవరికీ మినహాయింపు లేదని, బుధవారం ఉదయం 9 గంటలకు శిక్షణా కేంద్రానికి చేరుకోవాలని ఆయన ఆదేశించారు.

9న డివార్మింగ్


మాట్లాడుతున్న అధికారులు

ఒంగోలు(రూరల్), ఫిబ్రవరి6: జిల్లాలో ఈనెల 9వ తేదీన జరిగే డివార్మింగ్ కార్యక్రమాన్ని బాధ్యతగా నిర్వహించాలని వైద్యాధికారి ఎస్.వాణి సూచించారు. కరవది పీహెచ్‌సీలో మంగళవారం ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వాణి మాట్లాడుతూ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లి ప్రభుత్వం అందజేసే నులిపురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేయాలన్నారు. నులిపురుగుల నివారణతో విద్యార్థులు ఆరోగ్యంగా ఎదుగుతారని తెలిపారు. మార్చి నెలలో జరిగే పల్స్‌పోలియోను విజయవంతం చేసేందుకు సిద్ధంగా ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో కృష్ణారెడ్డి, హెచ్‌ఎస్ మాధవి, ఏఎన్ఎంలు జయకుమారి, రజనీకుమారి, మస్తానమ్మ, సుమతి, సుబ్బమ్మ, శ్రీలక్ష్మి, అంజని, విజయలక్ష్మి తదతరులు పాల్గొన్నారు.

నాగులుప్పలపాడు-కనపర్తి రోడ్డు మరమ్మతుకు కృషి

● మంత్రి నాగార్జున

నాగులుప్పలపాడు(ఒంగోలురూరల్), ఫిబ్రవరి 6: మండలంలోని నాగులుప్పలపాడు-కనపర్తి మధ్య గల ఆర్అండ్‌బీ రోడ్డు మరమ్మతుకు కృషి చేస్తానని మంత్రి నాగార్జున హామీ ఇచ్చారు. ఈ రోడ్డులో గుంతలు ఏర్పడి తరచూ వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. దీంతో పలు గ్రామాల ప్రజలు ఆర్అండ్‌బీ రోడ్డును మరమ్మతులు చేయాలని మంత్రిని కోరారు. దీంతో మంగళవారం మంత్రి నాగార్జున పరిశీలించి బాగు చేయించేందుకు చర్యలు తీసుకుంటానని తెలిపారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు నలమలపు కృష్ణారెడ్డి, కంచర్ల సుధాకర్, ఇనగంటి పిచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విజిలెన్స్-1 డిప్యూటీ కలెక్టర్‌గా రాజకుమారి

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 6 : జిల్లా విజిలెన్స్-1డిప్యూటీ కలెక్టర్‌గా రాజకుమారిని నియమిస్తూ ప్రభుత్వ ప్రధానకార్యదర్శి డాక్టర్ కేఎస్.జవహర్‌రెడ్డి మంగళవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. ఎఫ్అండ్‌సీఎస్ శాఖలో డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న ఆమెను జిల్లా విజిలెన్స్ డిప్యూటీ కలెక్టర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.

రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 6: కేంద్రంలోని ప్రధానమంత్రి నరేంద్రమోదీ కారణంగా రాజ్యాంగానికి ప్రమాదం వచ్చిందని, దీనిని పరిరక్షించుకునేందుకు పాటుపడాల్సిన సమయం వచ్చిందని బహుజన పార్టీ సమాఖ్య రాష్ట్ర కన్వీనర్ జై భీమ్ నాగేశ్వరరావు పేర్కొన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం సమాఖ్య ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో చంద్రబాబు ఇటు జగన్‌లు మోదీకి వంతపాడుతున్నారని ఆరోపించారు. కోర్టు తీర్పులు మతవిద్వేషాలను రెచ్చగొట్టే విధంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అంబేడ్కర్ కల్పించిన ఓటు హక్కు ద్వారానే ఉన్మాద శక్తులను ఓడించాలని పిలుపునిచ్చారు. ప్రభుద్ద రిపబ్లిక్ పార్టీ అధ్యక్షుడు చెన్నకేశవులు మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం ఎస్సీఎస్టీలకు ఉన్న పథకాలను రద్దు చేయడమే కాకుండా దళితులపై దాడులు చేయిస్తుందని ఆరోపించారు. వీటన్నింటిని అడ్డుకోవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు కార్యక్రమంలో నాయకులు దాసరి సుందరం, రామలింగం, ధర్నాసి పెద్దన్న, కరుణాకర్, పాలేటి కోటేశ్వరరావు, విజయ్‌కుమార్, షేక్ అజీజ్, రఫీ తదితరులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా కన్వీనర్‌గా ఎల్.రామలింగం, సభ్యులుగా దాసరి సుందరం, పెద్దన్న, షేక్ సత్తార్, వెంకటేశన్, బాబురావు, విజయకుమార్, నాగభూషణంలను ఎన్నుకున్నారు.

కార్మికుల ఒప్పంద జీవోలను విడుదల చేయాలి



ధర్నా నిర్వహిస్తున్న మునిసిపల్ కార్మికులు

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 6: మునిసిపల్ కార్మికుల 16 రోజుల సమ్మె సమయంలో ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలపై వెంటనే జీవోలను విడుదల చేయాలని యూనియన్ జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఏపీ మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ గత ఏడాది డిసెంబరు 26నుంచి జనవరి 10వ తేదీ వరకు మునిసిపల్ కార్మికులు సమ్మె చేశారని, యూనియన్ నాయకులతో చర్చలు జరిపి ఒప్పందాలు చేసుకొని నెల రోజులు గడుస్తున్నా ప్రభుత్వం ఇంతవరకు జీవోలు ఇవ్వకపోవడం దారుణంగా ఉందని విమర్శించారు. వెంటనే ఒప్పంద జీవోలను విడుదల చేయాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని చేపట్టాల్సి వస్తోందని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు తంబి శ్రీనివాసులు, విజయమ్మ, ఎం.శ్రీలక్ష్మి, వై.రవికుమార్, బి.చిన్నబ్బాయి, శేఖర్, లక్ష్మి, గిరిజ తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన ధరలతో
భారంగా ప్రజల జీవనం : జనసేన

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 6: రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్ని రకాల ధరలు పెరగడంతో సామాన్య ప్రజానీకం జీవనం సాగించలేక ఇబ్బందులు పడుతున్నారని జనసేన పార్టీ నాయకులు ఆరోపించారు. జనచైతన్య యాత్ర కార్యక్రమంలో భాగంగా మంగళవారం సాయంత్రం ఒంగోలు నగరం అన్నవరప్పాడులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ముందుగా ఆ ప్రాంత ప్రజలను సమస్యలను అడిగి తెలుసుకోవడంతో పాటు జనసేన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సామాన్య ప్రజానీకం ఆదాయం పెరగలేదని, వస్తువుల ధరలు మాత్రం అమాంతంగా పెరిగిపోయాయన్నారు. ప్రభుత్వం ధరల నియంత్రణకు ఎలాంటి చర్యలుతీసుకోకపోవడం దారుణంగా ఉందని విమర్శించారు. ప్రజలకు మేలు జరగాలంటే జనసేన నేతృత్వంలో ఏర్పడే కూటమి అభ్యర్థుల విజయానికి ప్రజలు మద్దతు తెలపాలని కోరారు. డివిజన్ అధ్యక్షుడు మర్రిపూడి ఉదయ్, ఉంగరాలసాయి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముత్యాల కళ్యాణ్, పల్ల ప్రమీల, ఆకుపాటి ఉష, మాదాసు సాయి, ఉంగరాల వాసు, అనూష, కోట సుధీర్, నరేష్, కిరణ్, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

ఆశాలకు కనీస వేతనం ఇవ్వాలి



డాక్టర్ వాణికి వినతిపత్రం ఇస్తున్న ఆశాకార్యకర్తలు

ఒంగోలు(రూరల్), ఫిబ్రవరి6: ఆశాకార్యకర్తలకు కనీస వేతనాలు ఇవ్వాలని సీఐటీయూ నాయకులు కల్పన కోరారు. ఈ సందర్భంగా మంగళవారం కరవది పీహెచ్‌సీలో డాక్టర్ ఎస్.వాణిని ఆశాకార్యకర్తలతో కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం కల్పన మాట్లాడుతూ ఆశాలకార్యకర్తలకు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో పలువురు ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

హాకీ జట్టుకు శిక్షణ క్యాంపు ప్రారంభం



శిక్షణను ప్రారంభిస్తున్న డీఈవో సుబ్బారావు

సంతనూతలపాడు, ఫిబ్రవరి 6: జిల్లా సబ్ జూనియర్ బాలురు హాకీ జట్టు క్యాంపును మైనంపాడు జడ్పీహైస్కూల్లో మంగళవారం జిల్లా విద్యాశాఖాధికారి వీఎస్.సుబ్బారావు ప్రారంభించారు. ఇటీవల స్కూల్‌గేమ్స్‌లో ఆడిన క్రీడాకారులను అభినందించారు. వీరంతా ఈనెల 10 నుంచి 12వ తేదీ వరకు కర్నూలులో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పీఈటీ రవికుమార్ తెలిపారు. ఈ సందర్భంగా పీఈటీని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హెచ్ఎమ్ ఓబుల్, గొడుగుమస్తాన్, ఆకులబ్రహ్మయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలి

• కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు(రూరల్), ఫిబ్రవరి6: గృహ నిర్మాణాలు చేసుకొనే లబ్ధిదారులు త్వరగా ఇళ్లు నిర్మించుకోవాలని కలెక్టర్ దినేష్‌కుమార్ పేర్కొన్నారు. స్థానిక కలెక్టరేట్‌లో మంగళవారం వీడియోకాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం గృహనిర్మాణాలను వేగంగా పూర్తి చేసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో ఇంకా అసంపూర్తిగా ఉన్న భవనాలను పూర్తి చేయాలన్నారు. అలాగే పూర్తి అయిన భవనాలలో ప్రవేశాలు చేయాలని ఆదేశించారు. గ్రామాల్లో ఉపాధి పనులు వేగం పెంచాలన్నారు. ఉపాధి కూలీలలకు వందరోజులు పని దినాలను కల్పించాలని చెప్పారు. అలాగే పంచాయతీల్లో మిగిలి ఉన్న ఆర్‌బీకేలు, హెల్త్‌క్లీనిక్‌లు, పలు రకాల భవనాలు అసంపూర్తిగా ఉంటే త్వరగా పూర్తి చేయించాలన్నారు. కార్యక్రమంలో జడ్పీసీఈవో జాలిరెడ్డి, పీడీ పేరయ్య డ్వామా పీడీ శీనారెడ్డి, ఎస్ఈ కొండయ్య, సీపీవో కొండయ్య, డీఎంఅండ్‌హెచ్‌వో రాజ్యలక్ష్మి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎలక్ట్రికల్ దుకాణాల్లో తనిఖీలు

కంభం, ఫిబ్రవరి 6 : కంభం, కందులాపురం కూడలిలోని మహాలక్ష్మి ఎలక్ట్రికల్ షాపు, రాజస్థాన్ ఎలక్ట్రికల్ షాపులను మంగళవారం తూనికలు, కొలతలశాఖ ఇన్‌స్పెక్టర్ రియాజ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విక్రయిస్తున్న వస్తువులు, వాటి బిల్లులను పరిశీలించారు. ఎటువంటి బిల్లులు లేకుండా విక్రయిస్తున్న వస్తువులను నమోదు చేశారు. కంపెనీవి కాకుండా డూప్లికేట్ వస్తువులు విక్రయించడాన్ని గుర్తించారు. తద్వారా కొనుగోలుదారులు మోసపోతున్నా రన్నారు. పలువురు ఫిర్యాదు చేయడంతో ఆమేరకు రియాజ్ ఎలక్ట్రికల్ షాపులను తనిఖీ చేసి రెండు షాపులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అలాగే ఉదయం పాలసేకరణ కేంద్రాలను, రేషన్‌షాపు వాహనాల మిషన్లను తనిఖీ చేశారు. వీటి తూనికలో తేడా ఉండడంతో కేసు నమోదు చేశారు.

గురుకులాల్లో ప్రవేశానికి దరఖాస్తులు

త్రిపురాంతకం, ఫిబ్రవరి 6: డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ గురుకులాల్లో 2024-25 విద్యా సంవత్సరానికి ఐదోతరగతి, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం (సీఈసీ, హెచ్ఈసీ) గ్రూపులలో ప్రవేశానికి అర్హులు దరఖాస్తు చేసుకోవాలని దూపాడు గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ కే.మధురవాణి పేర్కొన్నారు. అభ్యర్థులు ఈ నెల 23లోగా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ప్రవేశపరీక్ష మార్చి 10న నిర్వహించ నున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు ఐదో తరగతి చేరే విద్యార్థులకు, మధ్యాహ్నం 2 గంటలకు ఇంటర్మీడియట్ చేరే విద్యార్థులకు నిర్వహించనున్నట్లు తెలిపారు.

విచారించి న్యాయం చేయాలి

గిద్దలూరు, ఫిబ్రవరి 6 : తాను కొనుగోలు చేసిన పొలం ఆన్‌లైన్ కాకుండా వైసీపీ నాయకుడు, ఎంపీటీసీ సభ్యుడు గర్రె శ్రీనాథ్ అడ్డుపడుతున్నారని రైతు కొత్త సాంబశివరావు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. పాత తేక పాస్‌పుస్తకాలను ఫేక్ ఎంట్రీలు నమోదు చేయించుకొని తమ భూములు ఆన్‌లైన్ కాకుండా అడ్డుకుంటున్నాడన్నారు. ఈ విషయంపై పూర్తిస్థాయిలో విచారించాలని కోరారు. తాను 18 ఏళ్ల క్రితం అంబవరం రెవెన్యూ పరిధిలో, తన బంధువులు 65 ఎకరాల పొలం కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఆ భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకొని సాగు చేసుకుంటున్నామన్నారు. అయితే వెల్లుపల్లి ఎంపీటీసీ సభ్యుడు గర్రె శ్రీనాథ్ తమ పొలాన్ని కబ్జా చేయాలనే తలంపుతో పాత తేక పాస్‌పుస్తకాలతో, 1బీ లలో ఫేక్ ఎంట్రీలు నమోదు చేయించుకున్నాడన్నారు. ఆ భూములు తమ పూర్వికులవంటూ ఆన్‌లైన్ కాకుండా అడ్డుకుంటున్నాడని ఆరోపించారు. ఈ విషయంపై గతంలో సర్వే కూడా చేశారని, పూర్తిస్థాయిలో విచారించి ఇంకా ఆన్‌లైన్ కాని 16.62 ఎకరాలు ఆన్‌లైన్ చేయించి పాస్‌బుక్‌లు ఇప్పించాలని రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందజేశారు. అనంతరం విలేకర్లకు వివరాలు వెల్లడించారు.

మద్యం తాగుదామని తీసుకెళ్లి
అంతమొందించారు..!



వివరాలు వెల్లడిస్తున్న సీఐ వెంకటేశ్వర్లు

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 6: మద్యం తాగుదామని తీసుకెళ్లి ఒక వ్యక్తిని ఇద్దరు వ్యక్తులు అంతమొందించారు. ఘటనకు సంబంధించిన వివరాలను సీఐ ఆవుల వెంకటేశ్వర్లు, ఎస్ఐ రెహమాన్‌లు మంగళవారం విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. స్థానిక ఆర్టీసీ డిపో ఎదురు బోడపాడు రోడ్డులో ఈ నెల 3న అనుమానస్పదస్థితిలో ఒక వ్యక్తి గాయాలతో రోడ్డుపై మృతి చెందాడు. ఈ మేరకు వీఆర్‌వో బడేసాహెబ్ ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మరణించిన వ్యక్తి పట్టణానికి చెందిన తోట శీనుగా గుర్తించారు. ఆయన మద్యానికి బానిసై తిరుగుతుండేవాడు. ఈ నేపథ్యంలో 3వ తేదీ రాత్రి పట్టణానికి చెందిన పల్లబోతుల రవిశేఖర్, మోతుకూరి పవన్‌కుమార్‌లు ఆటోలో శ్రీనును ఎక్కించుకొని తీసుకెళ్లి మద్యం తాపించి కొట్టి పడేశారు. దీంతో శ్రీను మృతిచెందారు. పోలీసులు ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. కోర్టులో హాజరుపర్చారు.

బాలికపై యువకుడి లైంగికదాడి

• ఇన్‌స్టాగ్రాంలో పరిచయం
• ప్రేమిస్తున్నానని నమ్మించి మోసం
• పోలీసుల అదుపులో నిందితుడు

ఒంగోలు (క్రైం), ఫిబ్రవరి 6 : ఓ యువకుడు ఇన్‌స్టాగ్రాంలో మైనర్ బాలికతో పరిచయం పెంచుకున్నాడు. ప్రేమ పేరుతో ఆమెను నమ్మించి లైంగిదాడి చేశాడు. ఈ సంఘటన ఒంగోలులో మంగళవారం వెలుగు చూసింది. అందిన సమాచారం మేరకు.. ఒంగోలు నగర పరిధిలోని పేర్నమిట్టకు చెందిన 14 ఏళ్ల బాలికకు సంతనూతలపాడు మండలం చలప్పాలెంనకు చెందిన కల్యాణ్ అనే యువకుడు ఇన్‌స్టాగ్రాంలో పరిచయమయ్యాడు. ఆమెను ప్రేమిస్తున్నట్లు నటించాడు. వారి మధ్య నిత్యం ఫోన్ సంభాషణలు జరుగుతున్నాయి. దీన్ని గుర్తించిన తల్లిదండ్రులు సోమవారం రాత్రి బాలికను మందలించారు. దీంతో మంగళవారం ఉదయం ఆమె కల్యాణ్‌కు ఫోన్ చేసి ఇంటి నుంచి బయటకు వచ్చింది. ఒంగోలు ఆర్టీసీ బస్టాండ్‌కు చేరుకున్న ఆ బాలికను కల్యాణ్ బైక్‌పై నగర శివారుప్రాంతానికి తీసుకెళ్లి లైంగికదాడి చేశాడు. అనంతరం బాధితురాలిని సమతానగర్ వద్ద వదిలి వెళ్లిపోయాడు. అక్కడ ఓ బడ్డీకొట్టు వద్ద బాలిక విలపిస్తూ ఉండగా గుర్తించిన స్థానిక మహిళలు తాలూకా పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో వారు స్టేషన్‌కు తీసుకెళ్లి విచారించారు. ఆ బాలిక జరిగిన విషయం చెప్పడంతో నిందితుడిని అదుపులోకి తీసుకొని దిశ పోలీసు స్టేషన్‌కు తరలించారు.

బాలినేనితో వైసీపీ ముఖ్య నేతల వరుస భేటీలు

మేయర్, కార్పొరేటర్ల సుదీర్ఘ చర్చలు
మధ్యలో కలిసిన చెవిరెడ్డి

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

అసెంబ్లీ సమావేశాల్లో పాల్గొనేందుకు విజయవాడలో ఉన్న ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డితో నియోజకవర్గంలోని వైసీపీ ముఖ్యనాయకులు, ప్రజాప్రతినిధులు వరుసగా భేటీ అయి మంతనాలు జరుపుతున్నారు. మంగళవారం ఒంగోలు మేయర్‌తోపాటు డిప్యూటీ మేయర్, వైసీపీ కార్పొరేటర్లు ఆయనతో సుదీర్ఘ మంతనాలు జరిపారు. బాలినేని వారితో భేటీ అయ్యారని తెలిసి పార్టీ రీజనల్ కోఆర్డినేటర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కూడా మధ్యలో అక్కడికెళ్లారు. అయితే భాస్కర్‌రెడ్డి బాలినేనిని కలిసి వెళ్లిపోయారే తప్ప మేయర్, ఇతర కార్పొరేటర్ల సమావేశంలో పాల్గొనలేదు. ఒంగోలు లోక్‌సభ పార్టీ బాధ్యతలను ఇటీవల చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి ఇచ్చిన విషయం విదితమే. రానున్న ఎన్నికల్లో ఆయన ఒంగోలు వైసీపీ ఎంపీ అభ్యర్థిగా పోటీచేయనున్నారు. ఈ విషయంలో తీవ్ర అసంతృప్తితో ఉన్న బాలినేని ఆతర్వాత వైసీపీ అధిష్ఠానంలోని నాయకులను కూడా కలవకుండా కొంతకాలం హైదరాబాద్‌లో ఉన్నారు. తాజాగా అసెంబ్లీ సమావేశాల కోసం విజయవాడ వచ్చిన ఆయన తాను ప్రాతినిథ్యం వహిస్తున్న ఒంగోలు నియోజకవర్గంలోని పార్టీ ముఖ్యనాయకులు, ప్రజాప్రతినిధులను పిలుచుకుని మాట్లాడుతున్నారు. సోమవారం రాత్రి నియోజకవర్గంలోని పలువురు ముఖ్య నాయకులు ఆయన్ను కలిసి వచ్చారు. మంగళవారం మధ్యాహ్నం మేయర్ గంగాడ సుజాత, డిప్యూటీ మేయర్ వేమూరి బుజ్జితోపాటు వైసీపీ కార్పొరేటర్లలో అత్యధికులు బాలినేనిని కలిశారు. సుమారు 3 గంటలపాటు ఆయనతో సమావేశమయ్యారు. ఈ విషయం తెలిసి కాబోలు చెవిరెడ్డి ఈ సమావేశం జరుగుతున్న హోటల్‌కు వెళ్లారు. ఆయన్ను వేరే గదిలోకి తీసుకెళ్లిన బాలినేని ప్రత్యేకంగా మాట్లాడి పంపించారు. మేయర్, కార్పొరేటర్లతో జరిగిన సమావేశంలో చెవిరెడ్డి కూర్చోకపోవడం గమనార్హం.

ప్రధానంగా బాలినేని 'జరుగు తున్న పరిణామాలన్నీ మీకు తెలుసు, ఏమి చేద్దాం' అని అడుగుతున్నట్లు సమాచారం. తర్జనభర్జనల అనంతరం మీ నిర్ణయమే మా బాట అని ఆయన్ను కలిసిన వారు చెబుతున్నట్లు తెలిసింది.

హైకోర్టు ఆదేశాలతో వెనక్కి తగ్గిన పోలీసులు

» 41ఏ నోటీసులు ఇవ్వాలి
» ఎమ్మెల్యే ఏలూరి వివరణ కూడా తీసుకోవాలని సూచన



పర్చూరు, ఫిబ్రవరి 6: తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుపై పెట్టిన అక్రమ కేసులో హైకోర్టు రాష్ట్ర పోలీసులకు చివాట్లు పెట్టింది. ఏడేళ్ల లోపు జైలు శిక్షకు వీలున్న కేసులలో సీఆర్‌పీసీ సెక్షన్ 41ఏ నోటీసులు ఇవ్వకుండా అరెస్టు చేయటానికి ప్రయత్నించటం ఏమిటని మండిపడింది. మంగళవారం రెండోరోజు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పిటీషన్‌పై హైకోర్టు విచారణ జరిపింది. కోర్టు ఆగ్రహం వ్యక్తం చేయటంతో 41ఏ నోటీసు నిబంధనలు అనుసరిస్తామని ప్రభుత్వం తరుపున న్యాయవాది కోర్టుకు హామీ ఇచ్చారు. ఈ మేరకు పోలీసులు మెమో దాఖలు చేశారు. పోలీసుల మెమోలోని వివరాలను హైకోర్టు నమోదు చేసింది. నోటీసులు ఇచ్చి ఎమ్మెల్యే ఏలూరిని వివరణ తీసుకోవాలని పోలీసులకు హైకోర్టు సూచించింది. కాగా పోలీసులు అరెస్టు చేస్తారని ఎంపీ, ఎమ్మెల్యేలే భయపడుతుంటే సామాన్యుల పరిస్థితి ఏమిటని హైకోర్టు ఘాటుగా వ్యాఖ్యానించింది. పోలీసుల తీరుపై ఎమ్మెల్యే ఏలూరి ముందస్తు మధ్యంతర బెయిల్ మంజూరు చేయాలని సీఆర్పీసీ 41ఏ నిబంధనలు పాటించేలా ఆదేశాలు ఇవ్వాలని రెండు అనుబంధ పిటిషన్‌లు దాఖలు చేశారు. ఈ నేపథ్యంలో హైకోర్టు స్పందించింది. దీంతో రెండోరోజు 41ఏ నోటీసులు ఇస్తామని పోలీసులు కోర్టుకు విన్నవించారు.

కేసు ఇలా...

గ్రానైట్ ఫ్యాక్టరీలో అనుమతులు లేకుండా వైసీపీ నేతలతో తనిఖీలు చేస్తున్న మైనింగ్ అధికారులను ఎమ్మెల్యే ఏలూరి ప్రశ్నించారు. కర్రలు, కారం పొడులతో తనిఖీలకు రావటం ఏమిటని, నిబంధనలు తుంగలో తొక్కి ఇలా వైసీపీ నేతలతో వచ్చి దురుసుగా ప్రవర్తించడాన్ని ఆయన తప్పు పట్టారు. ఈనేపథ్యంలో రాజకీయ కక్షలో భాగంగా గ్రానైట్ ఫ్యాక్టరీ యజమానులు, తెలుగుదేశం పార్టీ సానుభూతిపరులపై అక్రమ కేసులు బనాయించారు. ఎమ్మెల్యే ఏలూరి అనుచరుల తో పాటు, గ్రానైట్ యజమానులను అరెస్టు చేసి జైలుకు పంపారు. ఈకేసులో ఎమ్మెల్యే ఏలూరిని ఏ8గా చేర్చి అరెస్టు చేసేందుకు పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారు. దీంతో ఎమ్మెల్యే ఏలూరి కోర్టును ఆశ్రయించారు.

వెనక్కి తగ్గిన పోలీసులు

ఎమ్మెల్యే ఏలూరిని అరెస్టు చేయడంలో పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించటం, 41 ఏ నోటీసులు ఇవ్వ కుండా తదుపరి చర్యలు చేపట్టడాన్ని కోర్టు తప్పుపట్టింది. నిబంధనలు ప్రకారం నడుచుకోవాని 41ఏ నోటీసులు ఇచ్చి వివరణ తీసుకోవాలని సూచించింది. ఇప్పటికే ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా ఆరుగురును అరెస్టు చేసి జైలుకు పంపడాన్ని హైకోర్టు దృష్టికి తీసుకు వచ్చారు. దీంతో కోర్టు ఈకేసును తీవ్రంగా పరిగణించింది.

కేసులు వేసినందుకే వేధింపులు

పర్చూరు నియోజకవర్గంలో వైసీపీ నేతలు నిబంధనలకు విరుద్ధంగా అర్హులైన వేలాది మంది ఓట్లు తొలగించేందుకు ఫాం 7లు దరఖాస్తు చేశారు. దీనిలో ప్రభుత్వ యంత్రాంగం వైసీపీ నేతలకు అనుకూలంగా వ్యవహరించడం నిబంధనలు తుంగలో తొక్కడంతో పూర్తి సాక్షాధారాలతో ఎమ్మెల్యే ఏలూరి హైకోర్టును ఆశ్రయించారు. దీంతో హైకోర్టు పలువురు పోలీసు ఉన్నతాధికారులపై చర్యలు చేపట్టింది. ఈనేపథ్యంలో కొందరు ప్రభుత్వ పెద్దలు, అధికార యంత్రాంగం, వైసీపీ నేతలు కక్షపూరితంగా అక్రమ కేసులు పెట్టి అరెస్టు చేసేందుకు పావులు కదిపారు. కోర్టు తీర్పుతో యంత్రాంగం అప్రమత్తమైంది. నిబంధనల ప్రకారం నడుచుకుంటామని కోర్టుకు హామీ ఇచ్చారు.

వైసీపీలో బహిర్గతమైన వర్గ విభేదాలు

పలు సొసైటీలలో కొత్త కమిటీల నియామకం • బాచిన కృష్ణచైతన్య వర్గానికి చెక్
హనిమిరెడ్డికి మద్దతు తెలిపితేనే పాతవి పొడిగింపు.. • ఆ పార్టీకి దూరం కానున్న పదవులు కోల్పోయిన నేతలు



హనిమిరెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న నాగులపాడు సొసైటీ కమిటీ సభ్యులు

అద్దంకి, ఫిబ్రవరి 6: వైసీపీ అద్దంకి నియోజకవర్గంలో వర్గ విభేదాలు మరోసారి బహిర్గతం అయ్యాయి. నియోజకవర్గంలో పలు సొసైటీల కమిటీలు(త్రీమెన్ కమిటీ) గడువు జనవరి 31తో ముగియటంతో వైసీపీ నియోజ కవర్గ ఇన్‌ఛార్జ్‌గా నియమితులైన హనిమిరెడ్డి తనదైన మార్కు చూపించే విధంగా కొన్ని కమిటీలకు కొత్త పేర్లతో ప్రతిపాదనలు పంపారు. ఈక్రమంలో కొత్త కమిటీల నియామకం జరిగాయి. దీంతో ఇప్పటి వరకు ఆ పదవుల లో ఉన్న వైసీపీ నేతలు అదే పార్టీలో బాచిన కృష్ణచైతన్య వర్గంగా ఉన్నప్పటికీ, ఇక పార్టీకి దూరమయ్యే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తుంది.

ప్రధానంగా అద్దంకి పట్టణం కేంద్రంగా ఉన్న నాగులపాడు సొసైటీ అధ్యక్షుడిగా సందిరెడ్డి రమేష్ 15 సంవ త్సరాలపాటు పనిచేశారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకివచ్చిన తరువాత బొమ్మనంపాడుకు చెందిన నాయుడు శ్రీనివాసరావును నియమించగా, మరలా జరిగిన నియామకాలలో సందిరెడ్డి రమేష్ భార్య భారతీ చైర్‌పర్సన్‌గా నియమితులయ్యారు. ఇప్పుడు జరిగిన మార్పులలో మానికొండ నాగరాజును నియమించారు. గోవాడ సొసైటీకి మాదాల రామకృష్ణను మార్పుచేసి మానం శ్రీనివాసరావును నియమించారు. పంగులూరు మండలం జాగర్ల మూడివారిపాలెం సొసైటీకి కె.రాజ్యలక్ష్మిని మార్పుచేసి గతంలో సొసైటీ అధ్యక్షుడిగా పనిచేసిన జాగర్లమూడి యలమంద రావు తల్లి వెంకటరత్నంను నియమించారు. నూజెళ్ళపల్లి సొసైటీ అధ్యక్షుడు కొండ్రగుంట హరిబాబు స్థానంలో ధూళిపాళ్ళ హరిబాబును నియమించారు. జనకవరం(పంగులూరు) సొసైటీకి రావూరి రంగారావు స్థానంలో తలపనేని సుధాకర్, కొరిశపాడు మండలం రావినూతలలో కంచర్ల శ్రీనివాసరావు స్థానంలో కారుసాల బసవేశ్వర రావు, తిమ్మనపాలెం సొసైటీలో అన్నెం శ్రీధర్‌రెడ్డి స్థానంలో పోతుల వెంకటస్వామిని నియమించారు. గత కమిటీలో పోతుల వెంకటస్వామి సభ్యుడిగా, అన్నెం శ్రీధర్‌రెడ్డి చైర్మన్‌గా ఉండగా, ప్రస్తుతం శ్రీధర్‌రెడ్డి చైర్మన్‌గా, వెంకటస్వామి సభ్యుడిగా ఉండటం విశేషం, వీరిద్దరి మధ్య అవగాహనతో జరిగినట్లు తెలుస్తుంది. మరో సభ్యుడిగా సాధినేని మస్తాన్‌రావును తొలగించి ఆ స్థానంలో మామిళ్ళపల్లి రామచంద్రరావును నియమించారు. దైవాలరావూరు సొసైటీలో జి.ఆనందబాబు స్థానంలో తానికొండ నరసింహారావును నియమించారు. అయితే, వీటిలో కొద్దిమంది స్వచ్ఛందంగా తప్పుకున్న ప్పటికీ అత్యధికశాతం మాత్రం చైతన్య వర్గంగా ముద్రపడిన వారిగా గుర్తించి మార్పు చేసినట్లు తెలుస్తుంది. ఈ క్రమంలో పదవులు దక్కని నేతలలో అత్యధికశాతం మంది వైసీపీకి దూరమయ్యే అవకాశాలు ఉన్నట్లు తెలు స్తుంది. ఇప్పటివరకు పదవులు వస్తే వైసీపీలోనే కొన సాగాలని, లేనిపక్షంలో తమకు అన్యాయం చేశారని చెప్పి బయటకు వెళ్ళాలన్న ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. పార్టీ మారాలని వేచి చూస్తున్న నేతలకు పదవులు రాకపోవటాన్ని సాకుగా చూపించి వైసీపీకి దూరమయ్యే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తుంది. ఇలా పదవుల పంపకంలో మరోసారి వైసీపీలోని వర్గ విభేదాలు బహిర్గ తమయ్యాయని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. సంతమాగులూరు సొసైటీ విషయంలో అనుకున్నదొకటి అయినదొకటిగా జరిగినట్లు తెలుస్తుంది. మండలంలోని రాజకీయ పరిణామాల నేపథ్యంలో సంతమాగులూరు సొసైటీకి తాము పంపిన పేర్లను మార్పు చేసి కొత్త పేర్లతో కమిటీ వేయించాలని వైసీపీ నేతలు తీవ్రప్రయత్నాలు చేసినప్ప టికీ అప్పటికే జాబితా పూర్తి కావటంతో మార్పు సాధ్యం కాదని ఉన్నతాధికారులు చెప్పినట్లు తెలుస్తుంది.

పల్లెల్లో తాగునీటికి గగ్గోలు

ట్యాంకర్లతో నీటిసరఫరాకు బ్రేక్
వేసవి ముంగిట పరిహాసం
ఆందోళన వ్యక్తం చేస్తున్న ప్రజలు



పెద్దారవీడు మండలం కర్రోలులో నిరసన తెలుపుతు్న గ్రామస్థులు

ఎర్రగొండపాలెం, ఫిబ్రవరి 6 : గుక్కెడు తాగునీటి కోసం పల్లెలు గగ్గోలు పెడుతున్నాయి. వరాకాలంలోనూ తాగునీటి కోసం కటకటలాడే కరువు ప్రాంతంలో ట్యాకర్లతో నీటిని సరఫరా చేస్తారు. అలాంటి ఈ ఏడాది వేసవి ముంగిట ట్యాంకర్లను నిలిపేశారు. అసలే వర్షాభావంతో భూగర్భ జలాలు సైతం ఒట్టిపోయాయి. ఇలాంటి తరుణంలో తాగునీరు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలో తాగునీటి సమస్య పరిష్కారానికి వర్షాకాలంలోనూ ట్యాంకర్లు ఏర్పాటు చేసి నీటి సరఫరా చేసిన ఆర్ డబ్ల్యూఎస్ అధికారులు తీరా వేసవి వచ్చేసరికి ట్యాంకర్లను నిలిపివేశారు. నాడు నిత్యం ఇంచుమించు 1000 ట్యాంకర్ల ద్వారా నీటిసరఫరా చేసి నీటిని అందించారు. అయితే నిర్వాహణలో లెక్కలు తప్పాయని, అధికంగా ట్రిప్పులు నమోదు అవుతున్నాయని ప్రభుత్వం వీటిని నిలిపివేసింది. 2024 ఫిబ్రవరి 1 నుంచి గ్రామాల్లో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా నిలిచి పోయింది. దీంతో నియోజకవర్గంలోని 5 మండలాలలో 50 గ్రామాల్లో తాగేందుకు గుక్కెడు నీరు కరువైంది. తాగునీటి కోసం వ్యవసాయబోర్ల చెంతకు ప్రజలు పరుగులు తీయాల్సి వస్తోంది. ఓ వైపు వేసవి ఎద్దడి ప్రారంభమవుతోంటే మరో వైపు ట్యాంకర్ల ను నిలిపివేయడం ఏమిటని ప్రజలు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. 2023 డిసెంబరు నుంచి ఎర్రగొండపాలెం మండలంలో 130 ట్యాంకర్లు, దోర్నాల మండలంలో 130 ట్యాంకర్లు, పుల్లలచెరువు మండలంలో 320 ట్యాంకర్లు, పెద్దారవీడు మండలంలో 335 ట్యాంకర్లు, త్రిపురాంతకం మండలంలో 85 ట్యాంకర్లతో నిత్యం నీటిని సరఫరా చేశారు. 2024 జనవరి 31 తేదీ వరకు ఈ సరఫరా కొనసాగింది. ప్రస్తుతం అర్థాంతరంగా ట్యాంకర్లు నిలిపివేయడంతో గ్రామాల్లో ప్రజల గొంతెండుతోంది. ఇప్పటికే పెద్దారవీడు మండలం వైడిపాడు ప్రజలు కర్నూలు, గుంటూరు జాతీయ రహదారిపై ధర్నా చేశారు. దోర్నాల మండలం చింతల అగ్రహారం, తిమ్మాపురం ఎస్సీ కాలనీ ప్రజలు, బోడేనాయక్ తాండ ప్రజలు ఖాళీ బిందెలతో నిరసనలు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగునీటి సమస్యకు పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

సమస్య ఉన్న గ్రామాలను గుర్తిస్తున్నాం..

తాగునీటి సమస్య ఉన్న గ్రామాలను గుర్తించేందుకు కలెక్టరు ఆదేశాలతో కమిటీ నియమించాం. ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే ట్యాంకర్లను ఏర్పాటు చేస్తాం.

- ఏఈ శ్రీకాంత్

కొప్పోలు టు కన్యాకుమరి సైకిల్‌యాత్ర

● వీర జవాన్ల సంస్మరణకు ఒంగోలు యువకుడి పయనం



కీర్తినాయుడుకు వీడ్కోలు చెబుతున్న విద్యార్థులు

ఒంగోలు (కార్పొరేషన్), ఫిబ్రవరి 6 : పుల్వామా దాడిలో అమరులైన వీర జవాన్లలను స్మరించుకుంటూ వారికి నివాళులర్పించేందుకు ఒంగోలుకు చెందిన కీర్తి నాయుడు కొప్పోలు నుంచి కన్యాకుమారి వరకు సైకిల్‌యాత్ర ప్రారంభించాడు. మంగళవారం స్థానిక కొప్పోలు రోడ్ వద్ద నుంచి మొదలైన ఈ యాత్రను పలు పాఠశాలల విద్యార్థులు జెండా ఊపి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కీర్తి నాయుడు మాట్లాడుతూ ఫిబ్రవరి 14ను ప్రేమికుల దినోత్సవంగా కాకుండా ప్రతి భారతీయుడు వీర జవాన్లకు ఓ నిమిషంపాటు మౌనం పాటించి నివాళులు అర్పించాలన్నారు. 2023 జనవరి 1 ఒంగోలు కలెక్టరేట్ నుంచి ఢిల్లీ ఇండియా గేట్ వరకు సైకిల్ యాత్ర చేసినట్లు తెలిపారు. మంగళవారం ఒంగోలు నుంచి మొదలైన ఈ సైకిల్ యాత్ర రోజుకు 120 కి.మీ ప్రయాణించి, ఈనెల 14న కన్యాకుమారిలోని వీర జవాన్లకు నివాళులర్పించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు అభినందించారు.

కారుమంచిలో పేస్ సేవా కార్యక్రమాలు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న నిర్వాహకులు

ఒంగోలు(విద్య), ఫిబ్రవరి 6 ఒంగోలులోని పేస్ ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు కారుమంచిలో మంగళవారం ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేసి పలు సేవా కార్యక్రమలను నిర్వహించారు. వారం రోజుల పాటు జరిగే ఈ శిబిరంలో తొలిరోజు గ్రామంలోని జడ్పీ హైస్కూలు విద్యార్థులకు పట్టు పరిశ్రమ, తేనే ఉత్పత్తి, వర్మీకంపోస్టింగ్‌పై అవగాహన కల్పించారు. అనంతరం పాఠశాల ఆవరణలో శ్రమదానం చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం కె.రవి, ఎంపీటీసీ సుమన్‌రెడ్డి, పీఈటీ ఆర్.ఉషారాణి, మహిళా పోలీస్ ఎం.జయంతి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎం.మల్లికార్జునరావు, వి.సురేష్‌బాబు, పృథ్వీకృష్ణ పాల్గొన్నారు. కాగా సేవా కార్యక్రమాల్లో పాల్గొన్న విద్యార్థులను కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్, ప్రిన్సిపాల్ జీవీకే.మూర్తి అభినందించారు.

9న కుక్కలవారిపాలెంలో పశువైద్యశిబిరం

నాగులుప్పలపాడు(ఒంగోలురూరల్), ఫిబ్రవరి6: నాగులుప్పలపాడు మండలం కనపర్తి గ్రామ పంచాయతీ పరిధిలోని కుక్కలవారిపాలెంలో ఈనెల 9వతేదీన ఉచిత పశువైద్య శిబిరం ఆచార్య ఎన్‌జీరంగా సర్వీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు మంగళవారం ఒక ప్రకటనలో ప్రతినిధులు తెలిపారు. అలాగే పశువుల ఆరోగ్యంపై సదస్సు జరుగుతుందనానరు. ఈ శిబిరాన్ని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ కె.బేబీరాణి ప్రారంభిస్తారని, రైతులు సద్వినియోగపరుచుకోవాలని వారు కోరారు.

శ్రీచైతన్యలో ఫ్యామిలీ ఫెస్ట్



మాతృమూర్తికి పాదపూజ చేస్తున్న విద్యార్థినులు

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 6 : ఒంగోలు నగరం లాయర్‌పేటలోని శ్రీచైతన్య పాఠశాలలో మంగళవారం ఫ్యామిలీ ఫెస్ట్ కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ జోసఫ్ తల్లిదండ్రుల గొప్పతనం, గౌరవించే విధానాలను వివరించారు. అనంతరం విద్యార్థులు తల్లిదండ్రుల పాదపూజ చేశారు. అనంతరం తల్లిదండ్రులు పూలు, అక్షితలు వేసి వారి పిల్లలను ఆశీర్వదరించారు. కార్యక్రమంలో ఆర్ఐ అనిల్, సమన్వయకర్త శ్రీనివాసరావు, డీన్ బాలసుబ్రమణ్యం, పాల్గొన్నారు.

కరాటే క్రీడాకారులకు అభినందన

ఒంగోలు (కార్పొరేషన్), ఫిబ్రవరి 6 : అంతర్రాష్ట్ర కరాటే పోటీలలో గెలుపొందిన క్రీడాకారులను మంగళవారం పలువురు అభినందించారు. ఈ నెల 4వ తేదీన బాపట్లలో జరిగిన ఇంటర్ స్టేట్ ఇన్విటేషన్ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీలలో ఒంగోలుకు చెందిన సికోకాయ్ కరాటే విద్యార్థులు ఓవరాల్ ఛాంపియన్‌షిప్ సాధించారు. ఈ మేరకు నగరంలో జరిగిన కార్యక్రమంలో శ్రీప్రతిభ, గురుదత్త విద్యా సంస్థల చైర్మన్ నల్లూరి వెంకటేశ్వర్లు, డాక్టర్ గుండవరపు రాఘవ, నల్లూరి జయప్రకాష్, మారెళ్ళ సుబ్బారావు, ఉపాధ్యాయులు నల్లూరి మోహన్‌రావు, కోచ్ వెంకటేశ్వర్లు, విజయలక్ష్మీ, రామకృష్ణ, యశ్వంత్‌లు పాల్గొని అభినందించారు.

ముగ్గురిపై కేసు

పొదిలి, ఫిబ్రవరి 6 : వేర్వేరు కేసుల్లో జామీను పొందేందుకు తప్పుడు ఆస్తి ధ్రువపత్రాలు సమర్పించారని తేలడంతో న్యాయవాది, మరో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ రంగారావు తెలిపారు. పొదిలి పోలీస్‌స్టేషన్‌లో ఓ చోరీ కేసును, కనిగిరి పోలీస్ స్టేషన్‌లో ఒక రోడ్డు ప్రమాదం కేసు నమోదైంది. ఈ కేసుల్లో నిందితులకు జామీను పొందేందుకు జామీనుదారుల నుంచి తప్పుడు ఆస్తి ధ్రువపత్రాలను పొదిలి జీఎఫ్‌సీఎం కోర్టులో సమర్పించారు. ఇటీవల విచారణలో అవి తప్పుడు ఆస్తిపత్రాలుగా తేలింది. దీంతో న్యాయవాది, మరో ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పల్లెల్లో తాగునీటికి గగ్గోలు

- ట్యాంకర్లతో నీటిసరఫరాకు బ్రేక్
- వేసవి ముంగిట ప్రజలతో పరిహాసం
- ఆందోళన వ్యక్తం చేస్తున్న ప్రజలు

ఎర్రగొండపాలెం, ఫిబ్రవరి 6 : గుక్కెడు తాగునీటి కోసం పల్లెలు గగ్గోలు పెడుతున్నాయి. వర్షాకాలంలోనూ తాగునీటి కోసం కటకటలాడే కరువు ప్రాంతంలో ట్యాకర్లతో నీటిని సరఫరా చేస్తారు. అలాంటి ఈ ఏడాది వేసవి ముంగిట ట్యాంకర్లను నిలిపేశారు. అసలే వర్షాభావంతో భూగర్భ జలాలు సైతం ఒట్టిపోయాయి. ఇలాంటి తరుణంలో తాగునీరు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నియోజకవర్గంలో తాగునీటి సమస్య పరిష్కారానికి వర్షాకాలంలోనూ ట్యాంకర్లు ఏర్పాటు చేసి నీటి సరఫరా చేసిన ఆర్ డబ్ల్యూఎస్ అధికారులు తీరా వేసవి వచ్చేసరికి ట్యాంకర్లను నిలిపివేశారు. నాడు నిత్యం ఇంచుమించు 1000 ట్యాంకర్ల ద్వారా నీటిసరఫరా చేసి నీటిని అందించారు. అయితే నిర్వాహణలో లెక్కలు తప్పాయని, అధికంగా ట్రిప్పులు నమోదు అవుతున్నాయని ప్రభుత్వం వీటిని నిలిపివేసింది. 2024 ఫిబ్రవరి 1 నుంచి గ్రామాల్లో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా నిలిచి పోయింది. దీంతో నియోజకవర్గంలోని 5 మండలాలలో 50 గ్రామాల్లో తాగేందుకు గుక్కెడు నీరు కరువైంది. తాగునీటి కోసం వ్యవసాయబోర్ల చెంతకు ప్రజలు పరుగులు తీయాల్సి వస్తోంది. ఓ వైపు వేసవి ఎద్దడి ప్రారంభమవుతోంటే మరోవైపు ట్యాంకర్లను నిలిపివేయడం ఏమిటని ప్రజలు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. 2023 డిసెంబరు నుంచి ఎర్రగొండ పాలెం మండలంలో 130 ట్యాంకర్లు, దోర్నాల మండలంలో 130 ట్యాంకర్లు, పుల్లలచెరువు మండలంలో 320 ట్యాంకర్లు, పెద్దారవీడు మండలంలో 335 ట్యాంకర్లు, త్రిపురాంతకం మండలంలో 85 ట్యాంకర్లతో నిత్యం నీటిని సరఫరా చేశారు. 2024 జనవరి 31 తేదీ వరకు ఈ సరఫరా కొనసాగింది. ప్రస్తు తం అర్థాంతరంగా ట్యాంకర్లు నిలిపివేయడంతో గ్రామా ల్లో ప్రజల గొంతెండుతోంది. ఇప్పటికే పెద్దారవీడు మండలం వైడిపాడు ప్రజలు కర్నూలు, గుంటూరు జాతీయ రహదారిపై ధర్నా చేశారు. దోర్నాల మండలం చింతల అగ్రహారం, తిమ్మాపురం ఎస్సీ కాలనీ ప్రజలు, బోడేనాయక్ తాండ ప్రజలు ఖాళీ బిందెలతో నిరసనలు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగునీటి సమస్యకు పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.


పెద్దారవీడు మండలం కగ్రోలులో నిరసన తెలుపుతున్న గ్రామప్రజలు

సమస్య ఉన్న గ్రామాలను గుర్తిస్తున్నాం..

తాగునీటి సమస్య ఉన్న గ్రామాలను గుర్తించేందుకు జిల్లా కలెక్టరు ఆదేశాలతో మండల స్థాయి ఇంజనీర్లతో కమిటీ నియమించాం. నివేదికలను కలెక్టరుకు పంపిస్తాం. ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే ట్యాంకర్లను ఏర్పాటు చేస్తాం. **ఏఈ శ్రీకాంత్**

వెలిగొండ ప్రాజెక్టును పూర్తి స్థాయిలో నిర్మించాలి


ధర్నా చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 6: పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టును పూర్తిస్థాయిలో నిర్మించాలని కోరుతూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదురు మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం జిల్లా నాయకులు జీవీ కొండారెడ్డి మాట్లాడుతూ వెలిగొండ ప్రాజెక్టుకు ప్రస్తుత బడ్జెట్‌లో రూ.1500 కోట్లు కేటాయించాలని నిర్వాసితులను మెరుగైన ప్యాకేజీతో ఆదుకోవాలన్నారు. అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టును జాతికి అంకితం చేస్తామని ప్రభుత్వం ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అనంతరం వినతిపత్రాన్ని సబ్ కలెక్టర్ రాహుల్ మీనాకు అందించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు సోమయ్య, రూబెన్, రాజు, రఫి, రైతు సంఘం నాయకులు తిరుపతిరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, బాలనాగయ్య, డీవైఎఫ్ఐ నాయకులు కొండయ్య, ప్రజా సంఘాల నాయకులు ఆదివయ్య, నన్నేసా, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

కళాశాలలో డీఐఈవో ఆకస్మిక తనిఖీ


రికార్డులు పరిశీలిస్తున్న డీఐఈవో

కంభం, ఫిబ్రవరి 6 : కంభం మండలం తురిమెళ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలను మంగళవారం జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి (డీఐఈవో) ఐ.శ్రీనివాసరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. కళాశాల రికార్డులను పరిశీలించారు. కళాశాలలో జరుగుతున్న నాడు-నేడు పనుల్లో భాగంగా తరగతి గదులను, నిర్మాణంలో ఉన్న బాలికల, బాలుర మరుగుదొడ్లను పరిశీలించారు. నాణ్యతతో పనులను పూర్తి చేయాలని ప్రిన్సిపాల్ ప్రభాకరరెడ్డికి సూచించారు.

ఎలక్ట్రికల్ దుకాణాల్లో తనిఖీలు

- కేసు నమోదు

కంభం, ఫిబ్రవరి 6 : కంభం, కందులాపురం కూడలిలోని మహాలక్ష్మి ఎలక్ట్రికల్ షాపు, రాజస్థాన్ ఎలక్ట్రికల్ షాపులను మంగళవారం తూనికలు, కొలతలశాఖ ఇన్‌స్పెక్టర్ రియాజ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విక్రయిస్తున్న వస్తువులు, వాటి బిల్లులను పరిశీలించారు. ఎటువంటి బిల్లులు లేకుండా విక్రయిస్తున్న వస్తువులను నమోదు చేశారు. కంపెనీవి కాకుండా డూప్లికేట్ వస్తువులు విక్రయించడాన్ని గుర్తించారు. తద్వారా కొనుగోలుదారులు మోసపోతున్నారన్నారు. పలువురు ఫిర్యాదు చేయడంతో ఆమేరకు రియాజ్ ఎలక్ట్రికల్ షాపులను తనిఖీ చేసి రెండు షాపులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అలాగే ఉదయం పాలసేకరణ కేంద్రాలను, రేషన్‌షాపు వాహనాల మిషన్లను తనిఖీ చేశారు. వీటి తూనికలో తేడా ఉండడంతో కేసు నమోదు చేశారు.

అనాథలకు నిత్యావసర సరుకుల పంపిణీ


నిత్యావసర సరుకులు అందజేస్తున్న విశ్వేశ్వరరావు

పెద్ద దోర్నాల, ఫిబ్రవరి 6: మండలంలోని చిన్న గుడిపాడు గ్రామంలోని ఆర్‌డీటీ కార్యాలయంలో మంగళవారం అనాథలకు మంగళవారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. మండలానికి చెందిన 105 మంది దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, అనాథలు, దివ్యాంగులకు ఆర్‌డీటీ సంస్థ ఆధ్వర్యంలో బియ్యం, రాగులు, గోదుములు, నూనె, న్యూట్రిషియన్ సరుకులను దోర్నాల అటవీ శాఖ రేంజి అధికారి విశ్వేశ్వరరావు అందజేశారు. ఆర్‌డీటీ సంస్థ మండలంలోని పేదల అభివృద్ధి కోసం విద్య, వైద్యం, జీవనోపాధులు కల్పిస్తూ తోడ్పాటు నందించడం అభినందనీయమని మరిన్ని సేవలందించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఐఆర్‌డీ పుష్పలత, ఏటీఎం వేమయ్య, ఆర్గనైజర్ రాజరత్నం, సిబ్బంది రమణ, శ్రీనివాసులు, ఇమ్మానియేలు పాల్గొన్నారు.

గురుకులాల్లో ప్రవేశానికి దరఖాస్తులు

త్రిపురాంతకం, ఫిబ్రవరి 6: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాల్లో 2024-25 విద్యా సంవత్సరానికి ఐదోతరగతి, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం (సీఈసీ, హెచ్‌ఈసీ) గ్రూపులలో ప్రవేశానికి అర్హులు దరఖాస్తు చేసుకోవాలని దూపాడు గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ కే.మధురవాణి పేర్కొన్నారు. అభ్యర్థులు ఈ నెల 23లోగా ధరఖాస్తులు చేసుకోవాలన్నారు. ప్రవేశపరీక్ష మార్చి 10న నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు ఐదో తరగతి చేరే విద్యార్థులకు, మధ్యాహ్నం 2 గంటలకు ఇంటర్మీడియట్ చేరే విద్యార్థులకు నిర్వహించనున్నట్లు తెలిపారు.

తపాలా సేవలను ప్రజలకు చేర్చాలి

గిద్దలూరు, ఫిబ్రవరి 6 : తపాలా సేవలను ప్రజలకు మరింత చేరువగా తీసుకెళ్లాలని మార్కాపురం పోస్టల్ సూపరింటెండెంట్ కె.శ్రీనివాస్ అన్నారు. గిద్దలూరు సబ్‌డివిజన్ పరిధిలోని పోస్టుమాస్టర్లతో మంగళవారం సాయంత్రం ఆయన సమావేశమయ్యారు. పోస్టల్ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. బ్యాంకులకు ధీటుగా తపాలా శాఖ సేవలను అందిస్తున్న విషయం ప్రజలకు తెలియజేయాలన్నారు.. ఉత్తమ ప్రతిభ కనపరచిన ఉద్యోగులను ఈసందర్భంగా సన్మానించారు. కార్యక్రమంలో పోస్టల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, హెడ్‌పోస్టు మాస్టర్ రంగస్వామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

క్షతగాత్రుని సహాయకులను ఇబ్బంది పెట్టవద్దు

- దర్శి ఎంవీఐ రవికుమార్


పోస్టర్ ఆవిష్కరిస్తున్న రవికుమార్

పొదిలి, ఫిబ్రవరి 6 : ప్రమాదాలు జరిగిన సమయంలో గాయపడిన క్షతగాత్రులతో సహాయంగా వచ్చిన వ్యక్తిని వైద్యశాలలో అనేకరకాల ప్రశ్నలతో ఇబ్బందులకు గురిచేయకుండా చికత్స అందించాలని దర్శి రవాణాశాఖ అధికారి రవికుమార్ అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో మాసోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వైద్యశాల సిబ్బందిగాని, పోలీస్ సిబ్బంది గాని సహాయకుని వివరాలు, గుర్తింపుకార్డులు, చిరునామా అడగడం వంటివి చేయకూడదన్నారు. అనంతరం రోడ్డుభద్రత సూత్రాల కరపత్రాన్ని ఆయన విడుదల చేశారు. ఈకార్యక్రమంలో డాక్టర్ రఫీ, వైద్యశాల సిబ్బంది ఉన్నారు.

కొమరోలు : రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ క్షతగాత్రులను వెంటనే రక్షించేందుకు చొరవ తీసుకోవాలని మార్కాపురం ఆర్‌టీవో అమర్‌నాయక్ అన్నారు. మండలంలోని తాటిచర్ల మోటులోని జాతీయ రహదారిలో ప్రజలకు రోడ్డు ప్రమాదాలపై ఆర్‌టీవో అమర్‌నాయక్ అవగాహన కార్యాక్రమాలను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదంలో గాయపడ్డవారిని వెంటనే వైద్యశాలకు తరలించి ప్రాణాలను నిలబెట్టడం ప్రతి పౌరుడి బాధ్యత అన్నారు. కార్యాక్రమంలో మోటర్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ ఏ.మాధవరావు, ఆటో డ్రైవర్లు, దుకాణదారులు, ప్రజలు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో ఉన్నత విద్యనభ్యసించాలి

గురుకులం సహాయ కార్యదర్శి రమణమూర్తి

పెద్ద దోర్నాల, ఫిబ్రవరి 6: క్రమశిక్షణతో ఉన్నత విద్యనభ్యశించాలని గురుకులం సహాయ కార్యదర్శి రమణమూర్తి అన్నారు. స్థానిక ఏకలవ్య గురకుల ఆదర్శ కళాశాల, పాఠశాలలో పదోతరగతి, ఇంటర్మిడియట్ విద్యార్థులకు వీడ్కోలు వేడుకలు మంగళవారం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ పీ.శ్యామూల్ జోబ్ అధ్యక్షతన నిర్వహించిన వేడుకల్లో భాగంగా ముఖ్య అతిథిగా హాజరైన వెంకటరమణ హాజరయ్యారు. కార్యక్రమంలో గురుకులం డిప్యూటి కార్యదర్శి మ్యోహన్‌రెడ్డి, డిప్యూటి డీఎంహెచ్‌వో శ్రీనివాసరావు,ఎంఈవో మస్తాన్ నాయక్, అధ్యాపక, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

బాలికపై యువకుడి లైంగికదాడి

- ఇన్‌స్టాగ్రాంలో పరిచయం
- ప్రేమిస్తున్నానని నమ్మించి మోసం
- పోలీసుల అదుపులో నిందితుడు

ఒంగోలు (క్రైం), ఫిబ్రవరి 6 : ఓ యువకుడు ఇన్‌స్టాగ్రాంలో మైనర్ బాలికతో పరిచయం పెంచుకున్నాడు. ప్రేమ పేరుతో ఆమెను నమ్మించి లైంగికదాడి చేశాడు. ఈ సంఘటన ఒంగోలులో మంగళవారం వెలుగు చూసింది. అందిన సమాచారం మేరకు.. ఒంగోలు నగర పరిధిలోని పేర్నమిట్టకు చెందిన 14 ఏళ్ల బాలికకు సంతనూతలపాడు మండలం చలప్పాలేనికి చెందిన కల్యాణ్ అనే యువకుడు ఇన్‌స్టాగ్రాంలో పరిచయమయ్యాడు. ఆమెను ప్రేమిస్తున్నట్లు నటించాడు. వారి మధ్య నిత్యం ఫోన్ సంభాషణలు జరుగుతున్నాయి. దీన్ని గుర్తించిన తల్లిదండ్రులు సోమవారం రాత్రి బాలికను మందలించారు. దీంతో మంగళవారం ఉదయం ఆమె కల్యాణ్‌కు ఫోన్ చేసి ఇంటి నుంచి బయటకు వచ్చింది. ఒంగోలు ఆర్టీసీ బస్టాండ్‌కు చేరుకున్న ఆ బాలికను కల్యాణ్ బైక్‌పై నగర శివారు ప్రాంతానికి తీసుకెళ్లి లైంగికదాడి చేశాడు. అనంతరం బాధితురాలిని సమతానగర్ వద్ద వదిలి వెళ్లిపోయాడు. అక్కడ ఓ బడ్డీకొట్టు వద్ద బాలిక విలపిస్తూ ఉండడం గుర్తించిన స్థానిక మహిళలు తాలూకా పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో వారు స్టేషన్‌కు తీసుకెళ్లి విచారించారు. ఆ బాలిక జరిగిన విషయం చెప్పడంతో నిందితుడిని అదుపులోకి తీసుకొని దిశ పోలీసు స్టేషన్‌కు తరలించారు.

మద్యం తాగుదామని తీసుకెళ్లి అంతమొందించారు


వివరాలు వెల్లడిస్తున్న సీఐ వెంకటేశ్వర్లు

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 6: మద్యం తాగుదామని తీసుకెళ్లి ఒక వ్యక్తిని ఇద్దరు వ్యక్తులు అంతమొందించారు. ఘటనకు సంబంధించిన వివరాలను సీఐ ఆవుల వెంకటేశ్వర్లు, పట్టణ ఎస్ఐ రెహమాన్‌లు మంగళవారం విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. స్థానిక ఆర్టీసీ డిపో ఎదురు జోడపాడు రోడ్డులో ఈ నెల 3న అనుమానాస్పదస్థితిలో ఒక వ్యక్తి గాయాలతో రోడ్డుపై మృతి చెందాడు. ఈ మేరకు వీఆర్‌వో బడేసాహెబ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మరణించిన వ్యక్తి పట్టణానికి చెందిన తోట శీనుగా గుర్తించారు. ఈయన మద్యానికి బానిసై తిరుగుతుండేవాడు. ఈ నేపథ్యంలో 3వ తేదీ రాత్రి పట్టణానికి చెందిన పల్లబోతుల రవిశేఖర్, మోతుకూరి పవన్‌కుమార్‌లు ఆటోలో శ్రీనును ఎక్కించుకొని తీసుకెళ్లినట్లు గుర్తించారు. అనంతరం మందు తాపించి కొట్టి ఆటోలో నుంచి ఆయన్ను పడేశారు. దీంతో ఆయన శ్రీను మృతిచెందారు. కేసు విచారించిన పోలీసులు ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. కోర్టులో హాజరుపర్చారు.

విచారించి న్యాయం చేయాలి

గిద్దలూరు, ఫిబ్రవరి 6 : తాను కొనుగోలు చేసిన పొలం ఆన్‌లైన్ కాకుండా వైసీపీ నాయుడు, ఎంపీటీసీ సభ్యుడు గర్రె శ్రీనాథ్ అడ్డుపడుతున్నారని రైతు కొత్త సాంబశివరావు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. పాత తోక పాస్‌పుస్తకాలను ఫేక్ ఎంట్రీలు నమోదు చేయించుకొని తమ భూములు ఆన్‌లైన్ కాకుండా అడ్డుకుంటున్నాడన్నారు. ఈ విషయంపై పూర్తిస్థాయిలో విచారించాలని కోరారు. తాను 18 ఏళ్ల క్రితం అంబవరం రెవెన్యూ పరిధిలో, తన బంధువులు 65 ఎకరాల పొలం కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఆ భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకొని సాగు చేసుకుంటున్నామన్నారు. అయితే వెల్లుపల్లి ఎంపీటీసీ సభ్యుడు గర్రె శ్రీనాథ్ తమ పొలాన్ని కబ్జా చేయాలనే తలంపుతో పాత తోక పాస్‌పుస్తకాలతో, 1బీ లలో ఫేక్ ఎంట్రీలు నమోదు చేయించుకున్నాడన్నారు. ఆ భూములు తమ పూర్వీకులవంటూ ఆన్‌లైన్ కాకుండా అడ్డుకుంటున్నాడని ఆరోపించారు. ఈ విషయంపై గతంలో సర్వే కూడా చేశారని, పూర్తిస్థాయిలో విచారించి ఇంకా ఆన్‌లైన్ కాని 16.62 ఎకరాలు ఆన్‌లైన్ చేయించి పాస్‌బుక్‌లు ఇప్పించాలని రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందజేశారు. అనంతరం విలేకర్లకు వివరాలు వెల్లడించారు.

ముగ్గురిపై కేసు నమోదు

పొదిలి, ఫిబ్రవరి 6 : రెండు వేర్వేరు కేసుల్లో జామీను పొందేందుకు తప్పుడు ఆస్తి ధ్రువపత్రాలు సమర్పించారని తేలడంతో న్యాయవాది, మరో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ రంగారావు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పొదిలి పోలీస్ స్టేషన్‌లో ఓ చోరీ కేసును, కనిగిరి పోలీస్ స్టేషన్‌లో ఒక రోడ్డు ప్రమాదం కేసు నమోదైంది. ఈ కేసుల్లో నిందితులకు జామీను పొందేందుకు జామీనుదారుల నుంచి తప్పుడు ఆస్తి ధ్రువపత్రాలను పొదిలి జేఎఫ్‌సీఎం కోర్టులో సమర్పించారు. ఇటీవల విచారణలో అవి తప్పుడు ఆస్తిపత్రాలుగా తేలింది. దీంతో పొదిలి కోర్ట్ సూపరింటెండెంట్ ఫిర్యాదు మేరకు రెండు క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు ఏఎస్ఐ చెప్పారు. న్యాయవాది, మరో ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఎస్టీయూ నూతన కార్యవర్గం ఎన్నిక

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 6: స్థానిక ఎస్టీయూ కార్యాలయంలో ఆ సంఘం మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా ఫిలప్, అధ్యక్షులుగా టీవీ.రమణ, ఉపాధ్యాక్షులుగా శీను, చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శిగా హనుమంతరావు తదితరులు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షులు ఎర్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉపకరణాలను సద్వినియోగం చేసుకోవాలి


ఎన్నికైన నూతన కార్యవర్గం

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 6: ఉచిత ఉపకరణలు ఉపయోగించుకోవాలని సబ్ కలెక్టర్ రాహుల్ మీనా అన్నారు. స్థానిక మార్కెట్ యార్డులో అలింకో సంస్థ ద్వారా దివ్యాంగులు, వయో వృద్ధులకు వీల్ చైర్లు, ట్రై సైకిళ్లు, వినికిడి యంత్రాలు, చంక కర్రలు, శ్రవణ యంత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విభిన్న ప్రతిభావంతుల సహాయ సంస్థ సంచాలకులు అర్చన, దివ్యాంగుల కార్పొరేషన్ ఛైర్మన్ ముంతాజ్, మున్సిపల్ ఛైర్మన్ బాలమురళీకృష్ణ, ఎంపీపీ అరుణ, ఏఎంసీ ఛైర్మన్ డా. ఎం.షంషీర్ అలీబేగ్, ఎంపీడీఓ చందన తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను గాలికొదిలిన వైసీపీ

- టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ అశోక్‌రెడ్డి
- ఉమ్మడివరంలో భవిష్యత్తుకు గ్యారెంటీ సభ

పుల్లలచెరువు, ఫిబ్రవరి 6 : రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం ప్రజాసమస్యలను గాలికొదిలిందని, వచ్చే ఎన్నికల్లో వైసీపీని తరిమికొట్టాలని ఎర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ గుడూరి ఎరిక్షన్ బాబు పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని ఉమ్మడివరంలో 'బాబు షూరిటీ- భవిష్యత్‌కు గ్యారెంటీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అవినీతి తప్ప తప్ప అభివృద్ధి మచ్చుకైన కనిపించడం లేదన్నారు. రూ.83 కోట్లతో చిన్న కండ్లేరుకు వెలిగొండ టీ5ను అనుసంధానం పేరుతో జీవో ఇచ్చి నేటికీ పనులు ప్రారంభించలేదని అన్నారు. గ్రామంలో సీసీ రోడ్లు, డ్రేనేజీలు లేక మురుగు రోడ్లపైకి వస్తోందన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఎడాదికి మూడు గ్యాసు సిలిండర్లు, నెలకు 18 నుంచి 60 ఏళ్ల లోపు మహిళకు 1500 ఆర్థికసాయం అందజేస్తామన్నారు. రైతులకు ఎడాదికి రూ.20వేలు సహాయం, నిరుద్యోగులకు నెలకు 3 వేల భృతి అందజేస్తారని అన్నారు. వైసీపీ చేసే అక్రమాలపై టీడీపీ అధికా రంలోకి వచ్చాక వడ్డీతో సహా చెల్లిస్తామన్నారు. ఎర్రగొండపాలెం నియోజక వర్గంలో మంత్రి ఉన్నా, రహదారులు మాత్రం అధ్వానంగా ఉన్నాయన్నారు. టీడీపీ అధికారంలో వున్నప్పుడు వేసిన రోడ్లు తప్ప ఎక్కడ రోడ్లు వేయలేదని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీకి మీ ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు పయ్యావుల ప్రసాద్, టీడీపీ మాజీ మండలాధ్యక్షుడు శనగా నారాయణరెడ్డి, టీడీపీ మండల నాయకులు కాకర్ల కోటయ్య, మునగాల రామిరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


బాండ్లు అందజేస్తున్న ఎరిక్షన్‌బాబు

జగనన్న కాలనీ స్థల ఎంపికలో అయోమయం

- తీగలేరు వద్ద కరకట్ట స్థలంలో హద్దురాళ్ల ఏర్పాటు

పెద్ద దోర్నాల, ఫిబ్రవరి 6: ప్రభుత్వం పేదలకు మంజూరు చేసిన జగనన్న కాలనీల్లో లబ్ధిదారుల స్థలం ఎంపికలో అయోమయం నెలకొంది. ఇంటిస్థలాలు లేక తీగలేరు కాల్వ కరకట్టపై హద్దులు ఏర్పాటు చేసుకుంటున్నారు. ఈ క్రమంలో మంగళవారం సుమారు వంద మంది పేదలు తీగలేరు కాలువ కరకట్టపై హద్దురాళ్లు పాతి తమదనిపించుకునే ప్రయత్నం చేయడం గమనార్హం. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే నవరత్నాల్లో భాగంగా ఇంటి స్థలాలు ఇచ్చి పక్కా గృహాలు నిర్మించి మహిళల పేరుపై రిజిస్ట్రేషన్ చేస్తామని గొప్పలు చెప్పుకొంది. అయితే దోర్నాలకు 3, 4 కిలోమీటర్ల దూరంలో హసనాబాద్ గ్రామం వద్ద ఎందుకూ పనికి రాని కొండబోడుపై ఇంటిస్థలాలు మంజూరు చేసింది. లబ్ధిదారులు ఎవరూ ఆ స్థలాలు తీసుకొనేందుకు అంగీకరించక పోయినా స్థానిక నాయకుల లబ్ధి కోసం అంతర్గత రహదారులు, విద్యుత్తు ఏర్పాటు చేసి ఎన్ఆర్ఈజీఎస్ నిధులు దుర్వినియోగం చేశారనే ఆరోపణలు ఉన్నాయి. కలెక్టర్ స్థాయి అధికారులు పరిశీలించినా ఫలితం కానరాలేదు. లబ్ధిదారులు మంత్రి సురేష్ దృష్టికి ఈ విషయం తీసుకుపోయారు. అదుగో ఇదుగో మార్చిలో ఇస్తామంటూ నాన్చివేత ధోరణితో కాలయాపన చేశారు. దీంతో లబ్ధిదారులు ఆశలు వదులుకున్నారు. ప్రత్యామ్నాయ మార్గం అన్వేషించగా, దోర్నాల పున్నమి గెస్టుహౌస్‌కు సమీపంలోని తీగలేరు కాలువ కట్టపై ఇప్పటికే కొంత ఆక్రమణకు గురికాగా మిగిలిన కాల్వ కట్టపై ఇంటిస్థలాల కోసం హద్దురాళ్లను పాతా రు. ఈ విషయం చర్చనీయాంశంగా మారింది. సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు చేపడతారో చూడాలి.


తీగలేరు వద్ద హద్దులు ఏర్పాటు చేసుకుంటున్న పేదలు

తప్పుల తడకగా ఓటర్ల జాబితా

- ఒకే డోర్ నంబరుతో 12 ఓట్లు


ఒకే డోర్ నంబరుతో ఉన్న ఓట్లు

మార్కాపురం రూరల్, ఫిబ్రవరి 6: మార్కాపురం నియోజకవర్గంలోని ఓటర్ల తుదిజాబితా తప్పులతడకగా తయారైంది. బీఎల్‌వోలు సక్రమంగా విచారించి ఓటర్లు నమోదు చేయకపోవడంతో ఓటర్ల జాబితాలో తప్పులు పునరావృతం అవుతున్నాయి. పట్టణంలోని 77వ పోలింగ్ బూత్‌లో 10-1050-జెడ్ అనే ఇంటి నంబరుతో వేర్వేరు కుటుంబాలకు చెందిన సంబంధంలేని 12 మందికి ఓట్లు ఉన్నాయి. వివిధ కులాలకు చెందిన వ్యక్తుల ఓట్లు కూడా ఒకే ఇంటి నంబర్‌తో కనిపిస్తున్నాయి. షేక్ ఫాతిమా పేరు ఉన్న ఒకే మహిళకు 259, 260 సీరియల్ నెబర్‌లతో రెండు ఓట్లు ఉన్నాయి. ఈమె ఇంటి నెంబర్ కూడా వేర్వేరుగా 10-1050-జడ్-53-జి ఒక నెంబర్, 10-1050-జెడ్-53హెచ్ మరో నంబరుతో ఉంది. దీంతో ఒకే వ్యక్తి పేరు రెండుసార్లు జాబితాలో కనిపిస్తోంది. బీఎల్‌వోలు ఇళ్ల వద్దకు వచ్చి పూర్తి సమాచారం సేకరించకుండా ఇష్టానుసారం జాబితా తయారు చేశారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

బీసీలకు టీడీపీలోనే సముచిత స్థానం


సభలో మాట్లాడుతున్న మాజీ మంత్రి కొల్లు రవీంద్ర

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 6: రాష్ట్రంలో టీడీపీ హయాంలోనే బీసీలు అన్ని రంగాల్లో రాణించి సముచిత స్థానం నిలిచారని మాజీ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. మండలంలోని రాయవరంలో మంగళవారం రాత్రి 'జయహో బీసీ' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన కొల్లు రవీంద్రకు టీడీపీ శ్రేణులు బైకు ర్యాలీతో ఘన స్వాగతం ఏర్పాటు చేశారు. రాయవరంలోని ఎన్టీఆర్ విగ్రహానికి కొల్లు రవీంద్ర పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒక్క అవకాశం అంటూ అధికారంలోకి వచ్చిన జగన్ రాష్ట్రాన్ని అక్రమాలకు అడ్డాగా మార్చిందన్నారు. బీసీలకు అన్యాయం చేశారన్నారు. టీడీపీ ప్రభుత్వం బీసీలకు అన్ని రంగాలలో సముచిత స్థానం కల్పించిందన్నారు. మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో రానున్నది టీడీపీ-జనసేన ప్రభుత్వమే అన్నారు. ఎన్నికలలో బీసీలంతా ఏకమై వైసీపీకి బుద్ధి చెప్పాలన్నారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఇమ్మడి కాశీనాథ్ మాట్లాడుతూ.. టీడీపీ-జనసేన కూటమిని బీసీలు ఆదరించి గెలిపించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు తాళ్లపల్లి సత్యనారాయణ, వక్కలగడ్డ మల్లిఖార్జునరావు, శాసనాల వీరబ్రహ్మం, కందుల రామిరెడ్డి, కాకర్ల శ్రీనివాసులు, కందుల విగ్నేష్ రెడ్డి, కంచర్ల కాశయ్య, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

బీసీలను ఆదుకునే బాధ్యత టీడీపీదే

- ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు నూకసాని బాలాజీ
- టీడీపీలో 120 బీసీ కుటుంబాలు చేరిక
- 'జయహో బీసీ' సభ విజయవంతం

గిద్దలూరు టౌన్, ఫిబ్రవరి 6 : టీడీపీ అధికారంలోకి రాగానే బీసీలను అన్నివిధాలుగా ఆదుకునే బాధ్యత తీసుకుంటామని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు నూకసాని బాలాజీ అన్నారు. మంగళవారం పట్టణంలోని విశా సుబ్బరత్నం కళ్యాణ మండపంలో జయహో బీసీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన బాలాజీ మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి రాగానే 'బీసీ సంరక్షణ చట్టం' అమలులోకి తెస్తామన్నారు. టీడీపీకి ఎల్లప్పుడూ వెన్నుదన్నుగా నిలిచారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. బీసీల కోసం టీడీపీ అనేక సంక్షేమ పథకాలను అమలుజేసిందన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని సంక్షేమ పథకాలు అమలుజేయనున్నట్లు తెలిపారు. బీసీ ఓట్లతో అధికారం దక్కించుకున్న జగన్‌రెడ్డి బీసీలపై దాడులు చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నాడని విమర్శించారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే బీసీలకు రక్షణ చట్టం అమలులోకి తెస్తామన్నారు. బీసీలపై దాడులు చేయాలంటే ఒణుకు పుట్టేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.


మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు నూకసాని బాలాజీ

అవకాశం ఇవ్వండి - అభివృద్ధి చేస్తా: ముత్తుముల

రాన్ను ఎన్నికల్లో టీడీపీ, జనసేన బలపరచిన అభ్యర్థిగా తాను గిద్దలూరు నుంచి బరిలో ఉంటానని, ఈ ఎన్నిక లలో తనకు అవకాశం కల్పిస్తే గిద్దలూరును అభివృద్ధి చేసి చూపిస్తానని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. గతంలోనూ తాను నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు సహకారంతో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశానన్నారు. బీసీల సంక్షేమం కోసం టీడీపీ ఆవిర్భావం నుండి చేపట్టిన ప్రజాసంక్షేమ కార్యక్రమాలే నేడు అధికసంఖ్యలో బీసీలు చేరడానికి కారణమన్నారు. జగన్‌రెడ్డి ప్రజాసంక్షేమాన్ని మరిచి ప్రతీకార దాడులతో అన్ని వర్గాల ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాడని విమర్శించారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ పరిశీలకులు సుధాకర్‌రెడ్డి, జడ్పీటీసీ సభ్యుడు బుడత మధుసూదన్, గిద్దలూరు, కొమరోలు, బేస్తవారపేట, కంభం, రాచర్ల మండల పార్టీల అధ్యక్షులు మార్తాల సుబ్బారెడ్డి, వెంకటేశ్వర్లుయాదవ్, మోహన్‌రెడ్డి, శ్రీనివాసులు, యోగానంద్, కౌన్సిలర్లు చంద్రశేఖర్‌యాదవ్, బిల్లా రమేష్‌యాదవ్, సర్పంచ్‌లు లక్ష్మీప్రసన్న, టీడీపీ నాయకులు పాముల వెంకటరవమణయాదవ్, జీవనేశ్వర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


మోహన్‌యాదవ్‌ను టీడీపీలోనికి ఆహ్వానిస్తున్న నేతలు

120 కుటుంబాల చేరిక

కొమరోలు మండలం నల్లగుంట్ల గ్రామానికి చెందిన పంకు మోహన్ యాదవ్ ఆధ్వర్యంలో 120 బీసీ కుటుంబాలు మంగళవారం జయహో బీసీ కార్యక్రమంలో జిల్లా పార్టీ అధ్యక్షులు నూకసాని బాలాజీ, గిద్దలూరు టీడీపీ ఇన్‌చార్జి ముత్తుముల అశోక్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరాయి. వీరికి తెలుగుదేశం కండువాలు కప్పి ఆహ్వానించారు. మోహన్‌యాదవ్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో గిద్దలూరు నియోజక వర్గంలో అశోక్‌రెడ్డి గెలుపు కోసం కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సురేష్

బోదనంపాడులో పల్లెపల్లెకు ప్రజాయాత్ర

కురిచేడు, ఫిబ్రవరి 6 : కురిచేడు మండలం బోదనంపాడు గ్రామంలో తెలుగుదేశం పార్టీ జిల్లా లీగల్ సెల్ మాజీ అధ్యక్షుడు పరిటాల సురేష్ ఆధ్వర్యంలో పల్లె పల్లెకు ప్రజాయాత్ర కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో సురేష్ మాట్లాడుతూ తెలుగుదేశం, జనసేన ప్రభుత్వం ఏర్పాటు ఖాయమన్నారు. రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన వైసీపీని తుక్కుతుక్కుగా ఓడించాలని కోరారు. జగన్‌రెడ్డి పాలనలో వ్యవస్థలన్నీ నిర్వీర్యం అయ్యాయన్నారు. చంద్రబాబును గెలిపిస్తే మరలా అన్ని రంగాలు గాడిలో దారిలో పడతాయన్నారు. వచ్చే ఎన్నికలలో తెలుగుదేశం, జనసేన పార్టీల అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఆయన వెంట వేమా వెంకటేశ్వర్లు, యాదగిరి వెంకటేశ్వర్లు, వేమా రమేష్, లక్ష్మయ్య పాల్గొన్నారు.

పల్లెల్లో బెల్టు జోరు..!

- ప్రభుత్వ మద్యం దుకాణాలు రెండు
- అనధికార షాపులు 40

వెలిగండ్ల, ఫిబ్రవరి 6 : ఊరురా బెల్ట్ షాపులు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. పల్లెలు, మారుమూల గ్రామాలు మత్తులో జోగుతున్నాయి. మద్యం పచ్చని సంసారాల్లో చిచ్చు పెడుతుండగా వైసీపీ అధికారంలోకి వచ్చాక నిబంధనలకు విరుద్ధంగా బెల్టు షాపులు తెరిచి అధిక ధరలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. వెలిగండ్ల మండలంలో 21 గ్రామ పంచాయతీలు ఉండగా మెగళ్లూరు, వెలిగండ్ల, నాగులవరం, కంకణంపాడు, అగ్రహారం, జూళ్లపాలెం, చోడవరం, కొటాలపల్లి, మరపగుంట్ల, పద్మాపురం, రాళ్లపల్లి, కంఢ్రిక గ్రామాల్లో బెల్ట్ దుకాణాలు అధికంగా ఉన్నాయి. ప్రభుత్వ మద్యం షాపులు రెండు ఉంటే బెల్ట్ షాపులు 40 ఉన్నట్లు సమాచారం. బెల్టుషాపులు నియంత్రించాల్సిన అధికారులు బడా వ్యాపారుల కనుసన్నల్లో పనిచేస్తూ గ్రామాల్లో అడ్డుగా ఉన్న చిన్న చిన్న వారిని పట్టుకొని వారిపై కేసులు నమోదు చేస్తూ వారి ఆస్తులను సైతం అమ్మిస్తున్నారని ప్రజలు బహిరంగంగా ఆరోపిస్తున్నారు.



మద్యం బాటిళ్లను తీసుకెళ్తున్న వ్యక్తి

24 గంటలూ అందుబాటులో

అధికారంలోకి వస్తే మందు బందు చేస్తామని చెప్పిన జగన్‌రెడ్డి అందుకు భిన్నంగా గ్రామాల్లో 24 గంటలూ మద్యం అందుబాటులో ఉండేలా చేస్తూ లక్షలు ఆర్జిస్తున్నారు. రోజువారీ కూలీలే టార్గెట్‌గా ఎంచుకొని రాత్రింబవళ్లు యథేచ్ఛగా మద్యంను అమ్ముతూ పేద కుటుంబాలను చిన్నాభిన్నం చేస్తున్నారు. మండలంలో కొన్ని గ్రామాల్లో కిరాణా దుకాణాల్లో కూడా మద్యంను అమ్ముతున్నారు.

ఇక్కడ రూ.10 ఇచ్చి... అక్కడ రూ.50 కమీషన్

ప్రభుత్వ మద్యం అయినప్పటికీ కమీషన్ లో మాత్రం పెద్ద వ్యాపారమే సాగుతోంది. అమ్మకాల అధారంగా వారం లేదా పది రోజులు టార్గెట్‌గా పెట్టుకొని మద్యం బాటిళ్ల తీసుకెళ్తున్నారు. కొందరు 30 నుంచి 50 బాటిళ్లకు పరిమితమైతే, ఇంకొందరు కేసులను తీసుకెళ్తున్నారు. ఒక్కో కేసుకు 48 బాటిళ్లు ఉంటాయి. ఇలా పెద్ద సంఖ్యంలో కొనేవారు మద్యం షాపులో పనిచేసేవారికి ఒక్కో క్వార్టర్ బాటిల్‌కు రూ.10 అదనంగా (కమీషన్) ఇస్తున్నారు. కమీషన్లు పుచ్చుకుంటూ ఎన్ని కేసులైనా ఇస్తున్నట్లు సమాచారం. మద్యం తీసుకొచ్చిన వారు ఒక్కో బాటిల్ పై రూ.50 అదనంగా అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారు. అందులో ఎవరికీ ఎలాంటి మినహాయింపు లు, డిస్కౌంట్‌లు లేవట.



విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న కొండయ్య, బ్రహ్మంచౌదరి

ఘనంగా ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ

దొనకొండ, ఫిబ్రవరి 6 : దొనకొండలోని ఒబ్బాపురం ఎస్సీ కాలనీలో తెలుగు యువత నాయకులు కుందుర్తి లక్ష్మణ్ ఆధ్వర్యంలో తెలుగు యువత ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహాన్ని మంగళవారం రాత్రి ఘనంగా ఆవిష్కరించారు. టీడీపీ చీరాల ఇన్‌చార్జి ఎంఎం కొండయ్య, దర్శి నియోజకవర్గ టీడీపీ పరిశీలకుడు నాదెండ్ల బ్రహ్మంచౌదరి, దర్శి నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, మండల అధ్యక్షుడు నాగులపాటి శివకోటేశ్వరరావు విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఒబ్బాపురం ఎస్సీ కాలనీలో తెలుగు యువత నేతృత్వంలో మహనీయుడు ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటు ఎంతో అభినందనీయమని నిర్వాహకులైన యువతను వారు అభినందించారు. ఎన్టీఆర్ గొప్పతనాన్ని, తెలుగు ప్ర జలకు ఆయన చేసిన సేవలను, సినీ, రాజకీయ రంగాలలో ఆయన సాధించిన గొప్ప విజయాలను ఈ సందర్భంగా వక్తలు గుర్తు చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వల్లపునేని వెంకటస్వామి, శ్రుంగారపు నాగసుబ్బారెడ్డి, కొమ్మతోటి సుబ్బారావు, నిమ్మకాయల సుబ్బారెడ్డి, షేక్ తోహీద్, విప్పర్ల లక్ష్మీరావు, పత్తి వెంకటేశ్వర్లు, యరగొర్ల బసవయ్య, మన్నెం గాలెయ్య, కమ్మా వెంకటనారాయణ, దుగ్గెంపూడి చెంచయ్య, పెమ్మసాని లక్ష్మీనారాయణ, యగ్గోని యల్లారెడ్డి, బండ్లా వెంకటనారాయణ, నల్లూరి శ్రీనివాసరావు, పోతిపోగు చెన్నయ్య, బూరగ అశోక్, కొమ్మతోటి మహేష్ పలు గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ఒబ్బాపురం ఎన్టీఆర్ అభిమానులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారీ అన్నదాన కార్యక్రమంతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో అలరించేలా ఏర్పాటు చేశారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కదిరి

అభ్యర్థులను ప్రకటించలేదు.. వేచి చూద్దాం

అనుచరులతో మాజీ ఎమ్మెల్యే కదిరి

కనిగిరి, ఫిబ్రవరి 6 : కనిగిరి వైసీపీ అభ్యర్థిని అధిష్ఠానం ఇంకా ప్రకటించలేదని, కేవలం ఇన్‌చార్జిని మాత్రమే నియమించిందని... అప్పటి వరకు వేచి చూద్దామని మాజీ ఎమ్మెల్యే వైసీపీ నాయకుడు కదిరి బాబూరావు అన్నారు. నియోజకవర్గంలోని సీఎస్‌పురం మండలంలోని శీలంవారిపల్లి గ్రామంలోని ఆయన క్యాంప్ నివాసంలో మంగళవారం అనుచరులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వచ్చే ఎన్నికల్లో బరిలో ఉండాల్సిందేనని అనుచరులు పట్టుపట్టడంతో ఆయన అలా స్పందించారు. ఎమ్మెల్యే అభ్యర్థి అంటే చులకన భావం ఏర్పడిందని, అసలు అధిష్ఠానం ఏ సర్వే ప్రకారం దద్దాల నారాయణయాదవ్‌ను నియమించిందని అనచరులు ప్రశ్నించారు. కనీసం విలువలు కూడా అదిష్ఠానం పాటించదా అంటూ కదిరిపై ప్రశ్నల వర్షం కురిపించారు. ఎంతో ప్రజాదరణ ఉన్న మీరు ఎందుకు వెనకడుగు వేయాలన్నారు. స్వతంత్ర అభ్యర్థిగా ఎన్నికల్లో నిలబడినా గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని కేడర్ పట్టుపట్టింది. కదిరి మాట్లాడుతూ కనిగిరికి బుర్రా మధుసూదన్‌యాదవ్ ఎమ్మెల్యేగా ఉన్నారన్నారు. ఇంకా ఎన్నికలు మూడు నెలలు ఉన్నాయని, దద్దాలను ఇన్‌చార్జిగా నియమించడం స్వాగతిస్తూనే అధిష్ఠాన నిర్ణయం మేకు తాను నడుచుకుంటానన్నారు. ఈ సమయంలో ఎవరూ పార్టీలు మారవద్దని సూచించారు. తాను తెలుగుదేశం పార్టీ నుంచి వైసీపీకి వచ్చినపుడు పార్టీల కతీతంగా తన వెంటే ఉండి మద్దతు ఇస్తున్న ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. 10 రోజులు ఆగితే అభ్యర్థులను ప్రకటించే అవకాశం ఉందని అప్పటి వరకు సంయమనం పా టించాలని కోరారు. ఆ తర్వాత అందరం కలసికట్టుగా నిర్ణయం తీసుకుందామన్నా రు. ఆరు మండలాల నుంచి కదిరి అభిమానులు, అనుచరులు పాల్గొన్నారు. కదిరి సమావేశంతో వైసీపీలో గుబులు మొదలైంది.

వైసీపీ పాలనలో బీసీలకు ఇబ్బందులు

టీడీపీ చీరాల ఇన్‌చార్జి కొండయ్య

దొనకొండ, ఫిబ్రవరి 6 : బీసీ సామాజిక ఓట్లతో అధికారం చేపట్టిన వైసీపీ ప్రస్తుతం బీసీలను అన్ని విధాలుగా ఇబ్బందులు పెడుతోందని టీడీపీ చీరాల ఇన్‌చార్జి ఎంఎం కొండయ్య పేర్కొన్నారు. స్థానిక ఒబ్బాపురంలో టీడీపీ దర్శి నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు మోడి వెంకటేశ్వర్లు అధ్యక్షతన మంగళవారం రాత్రి జరిగిన జయహో బీసీ సదస్సుకు ఆ యన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. 2009 లో ఎంపీగా పోటీ చేసిన సమయంలో దొనకొండ ప్రాంత టీడీపీ నాయకులు కార్యకర్తలు చూపిన అభిమానం ఎన్నటికీ మరువలేన న్నారు. పార్టీకి అంకితభావంతో పనిచేసే నా యకులు, కార్యకర్తలకు తగిన గుర్తింపు ఉం టుందన్నారు. తెలిసో తెలియకో జగన్‌కు ఓటు వేసినందుకు రాష్ట్రానికి, ప్రజలకు తీరని అ న్యాయం జరిగిందన్నారు. మాచర్లలో ఒక బీ సీకి చెందిన టీడీపీ అభిమానిని జై వైసీపీ, జై జగన్ అని అనలేదని నడిరోడ్డులో గొంతుకోసి న అరాచక పాలన ఈ రాష్ట్రంలో వైసీపీ కొనసాగిస్తుందని దుయ్యబట్టారు. ఎస్సీలు, ఎస్టీలు, బీసీలు గొంతెత్తి మాట్లాడితే ఒక పథకం ప్ర కారం పోలీసులతో ఎన్నో రకాలుగా ఇబ్బంది లు పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తేనే బడుగు, బ ల హీన వర్గాల అభివృద్ధి జరుగుతుందని రానున్న ఎన్నికల్లో టీడీపీ గెలుపునకు ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేసి చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాలని పిలుపునిచ్చారు. టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు నాదెండ్ల బ్రహ్మంచౌదరి మాట్లాడుతూ జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి బలహీన వర్గాల పై దాడులు చేస్తూనే ఉన్నారని ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో దర్శి నియోజకవర్గంలో టీడీపీ మాత్రమే పోటీ చేయబోతుందని భరోసా ఇచ్చారు. వైసీపీ నాయకుల తప్పుడు ప్రచారాలను టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు నమ్మవద్దని పిలుపునిచ్చారు. దర్శి నియోజకవర్గంలో 2014 నుంచి 2019 వరకు టీడీపీ హయాంలో జరిగిన అభివృద్ధి తప్ప వైసీపీ పాలకులు ఎటువంటి అభివృద్ధి చేయలేదని, దీనిపై బహిరంగ చర్చకు తాము సిద్ధమన్నారు. కార్యక్రమంలో దర్శి నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, టీడీపీ దర్శి నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు మోడి వెంకటేశ్వర్లు, టీడీపీ మండల అధ్యక్షుడు నాగులపాటి శివకోటేశ్వరరావు, నాయకులు అంకాల మల్లికార్జున (మల్లి), యరగొర్ల బసవయ్య, బత్తుల బాలరాజు, మోడి చిన్నఆంజనేయులు, వల్లపునేని కేశవ, పలు గ్రామాలకు చెందిన బీసీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



జయహో బీసీ సదస్సులో మాట్లాడుతున్న కొండయ్య

10లోపు 'బాబు ష్యూరిటీ'ని పూర్తి చేయాలి



ముఖ్య కార్యకర్తలతో మాట్లాడుతున్న అధ్యక్షుడు పువ్వాడి

పామూరు, ఫిబ్రవరి 6 : బాబు ష్యూరిటీ.. భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమాన్ని ఈనెల 10వతేదీలోగా పూర్తి చేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు శ్రేణులకు సూచించారు. టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ ఉగ్ర ఆదేశాల మేకు పార్టీ కార్యాలయంలో బూత్ కమిటీ ఇన్‌చార్జులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమాల లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. మిగిలి ఉన్న గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. ఐదేళ్ల జగన్‌రెడ్డి పాలనలో ఎక్కడా అభివృద్ధి పనులు జరగలేదని, రాష్ట్ర భవిష్యత్ నాశనమైందన్న విషయాన్ని తెలియజేయాలన్నారు. అందరి బాగు కోసం టీడీపీకి ఓట్లు వేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేయాలని పువ్వాడి తెలిపారు. సమావేశంలో జిల్లా కమిటీ సభ్యుడు సయ్యద్ అమీర్‌బాబు, షేక్ ఖాజారహంతుల్లా, ఆర్‌ఆర్ రఫీ, పట్టణ ఫోర్‌మెన్ కమిటీ సభ్యుడు ఉప్పలపాటి హరిబాబు, షేక్ గౌసబాషా, దేవరపు మాల్యాద్రి, బూత్ కమిటీ ఇన్‌చార్జిలు షేక్ చినహజరత్, సాంబయ్య, పత్తు మస్తాన్, సయ్యద్ ఖాదర్‌బాషా, నాయబ పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన సీఐ

తాళ్లూరు, ఫిబ్రవరి 6 : పోలీస్ స్టేషన్‌కు దర్శి నూతన సీఐ ఎస్కే షమీ ఉల్లా మంగళవారం సందర్శించారు. ఎన్నికల సందర్భంగా అప్రమత్తంగా ఉండాలని, రౌడీ షీటర్ల కదలికలను గమనిస్తుండాలని, గ్రామాల్లో రాజకీయ వివాదాలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఎస్సై వైవీ రమణయ్యకు సూచించారు. కేసుల పురోగతిపై చర్చించారు. రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్సై రమణయ్య ఏఎస్సై మోహన్‌రావు ఉన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న సీఐ షమీఉల్లా

నేడు టీడీపీ జయహో బీసీ సదస్సు

తాళ్లూరు, ఫిబ్రవరి 6 : తాళ్లూరు ఎన్టీఆర్ భవన్ సమీపాన జయహో బీసీ సదస్సు నిర్వహిస్తున్నట్లు టీడీపీ బీసీ సెల్ మండల అధ్యక్షుడు పిన్నిక రమేష్, టీడీపీ మండల అధ్యక్షుడు బీ ఓబుల్‌రెడ్డి, ఒంగోలు పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి మానం రమేష్‌బాబు తెలిపారు. ఎన్టీఆర్ భవన్‌లో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సదస్సుకు టీడీపీ జిల్లా అధ్యక్షుడు నూకసాని బాలాజీ, మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, నియోజకవర్గ టీడీపీ పరిశీలకుడు నాదెండ్ల బ్రహ్మంచౌదరి, దర్శి నియోజకవర్గ జనసేన పార్టీ నాయకుడు గరికపాటి వెంకట్, నియోజవర్గ టీడీపీ నాయకులు గోరంట్ల రవికుమార్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరుకానున్నట్లు తెలిపారు. ఈసదస్సుకు మండలంలోని టీడీపీ, జనసేననాయకులు, అభిమానులు, కార్యకర్తలు, బీసీ సోదరులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో టీడీపీ బీసీ నేతలు వంగపల్లి నాగేశ్వరరావు, బూచిరాజు ట్రేడ్ యూనియన్ నాయకులు గాండ్ల నరిసిరెడ్డి ఉన్నారు.

రుణమాఫీ చేయాలని రేపు ధర్నా

పామూరు, ఫిబ్రవరి 6 : రైతుల రుణాలను మాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో 8వ తేదీన నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా నాయకుడు పీ రఘునాథరెడ్డి కోరారు. జీవైఆర్ భవన్‌లో మంగళవారం సమావేశం నిర్వహించారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కే ప్రభాకర్, ఏఐటీయూసీ నాయకులు మహేష్, ప్రసాద్ పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షను వినియోగించుకోవాలి

దొనకొండ, ఫిబ్రవరి 6 : ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను వినియోగించు ఎంపీపీ బొరిగొర్ల ఉషామురళి సూచించారు. మండలంలోని వెంకటాపురం గ్రా మంలో మంగళవారం వైద్యాధికారి సునీత నేతృత్వంలో నిర్వహించిన వైద్య శిబిరంలో ఆమె పాల్గొన్నారు. డాక్టర్ సునీత రోగులకు పరీక్షలు చేసి మందు లు అందజేశారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది సేవలందించారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

కురిచేడు, ఫిబ్రవరి 6: కురిచేడులో మంగళవారం వైసీపీ ఇన్‌చార్జి డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి పలు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన కార్యక్రమాలలో పాల్గొన్నారు. దర్శి రోడ్డులోని అయ్యప్పస్వామి దేవస్థానం దగ్గర నుంచి ర్యాలీగా గ్రామంలో కి వచ్చారు. పంచాయతీ కార్యాలయం ఎదురుగా సీసీ రోడ్డుకు శంకుస్థాపన, ఎస్సీ కాలనీలో డ్రైనేజీకి, వాల్మీకి బజారులో డ్రైనేజీ కాలువలకు శంకుస్థాపన చేశారు. ము స్లిం ఈద్గా ప్రహరీ గోడ ప్రారంభోత్సం, కొండమీద బొల్లికొండ్రాయ స్వామి గుడికి సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఎస్సెస్పీ కాలనీ, ఎస్సీ కాలనీ, వాసవీ ఆలయంలో ప్రజలతో కలసి మాట్లాడారు. గ్రామాభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తానని చెప్పారు. ఆయన వెంట జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయ మ్మ, వైసీపీ మండల నాయకులు ఉన్నారు.



మాట్లాడుతున్న బూచేపల్లి

ఆశా కార్యకర్తల ఆందోళన

హనుమంతునిపాడు, (కనిగిరి), ఫిబ్రవరి 6 : ఆశా కార్యకర్తల కనీస వేతనాలు పెంచాలని ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు యూ లక్ష్మీదేవి అన్నారు. ఆశా కార్యకర్తలు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పీహెచ్‌సీ ఎదుట మంగళవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆశాలతో సంబంధం లేని పనులు చేయించవద్దన్నారు. సెలవులు, రిటైర్మెంట్ బెనిఫిట్స్, గ్రూప్ ఇన్స్యూరెన్స్ సౌకర్యం కల్పించాలని కోరారు. సంక్షేమ పథకాలను వర్తింప చేయాలని డిమాండ్ చేశారు. ఆశాల నియామకంలో రాజకీయ జోక్యం లేకుండా ప్రభుత్వమే నియామకాలు చేపట్టాలని కోరారు. గిరిజన ప్రాంతంలో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ వర్కర్‌ను ఆశాలుగా నియమించాలన్నారు. మెడికల్ లీవ్‌లు వేతనంతో కూడిన మెటర్నటీ లీవులు అమలు చేయాలన్నారు. రూ.10లక్షల గ్రూపు ఇన్స్యూరెన్స్ సౌకర్యం కల్పించి మట్టి ఖర్చులు ఇవ్వాలన్నారు. రిటైర్మెంట్ వయసు 62 ఏళ్లకు పెంచుతూ జీవోను వర్తింప చేయాలని డిమాండ్ చేశారు. కొవిడ్ కాలంలో మరణించిన ఆశాలకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియాను తక్షణమే చెల్లించాలన్నా రు. ఏఎన్ఎం ట్రైనింగ్ ఇవ్వాలని, ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలన్నారు. జీఎన్ఎం ట్రైనింగ్ పొందిన ఆశాలను ఏఎన్ఎంలుగా నియమించాలన్నారు. హెల్త్ సెక్రటరీ స్టాఫ్‌నర్స్ నియామకాల్లో ఆశాలకు వెయిటేజ్ ఇవ్వాలని కోరారు. అనంతరం పీహెచ్‌సీలోని డాక్టర్ సం దీప్‌కు వినతిపత్రం అందచేశారు. కార్యక్రమం లో లక్ష్మమ్మ, చాముండేశ్వరి, బాలచెన్నమ్మ, సు భాషిణి, రజని, ప్రమీల, రవణమ్మ, ప్రశాంతి, అన్నమ్మ, గురవమ్మ, చిన్నమ్మి, లక్ష్మీదేవి పాల్గొన్నారు.



పీహెచ్‌సీ డాక్టర్ సందీప్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆశా కార్యకర్తలు

పామూరు : వైసీపీ ప్రభుత్వం ఆశాలపై పనిభారం పెంచి కనీస వేతనం ఇవ్వకుండా, వెట్టిచాకిరీ చేయిస్తోందని సీఐటీయూ మండల కార్యదర్శి కే మాల్యాద్రి ధ్వజమెత్తారు. మండలంలోని బొట్లగూడూరు పీహెచ్‌సీలో ఆశా డే సందర్భంగా ఆయన మాట్లాడారు. 8న చలో విజయవాడకు ఆశాలు తరలిరావాలని పిలుపునిచ్చారు.



మాట్లాడుతున్న మాల్యాద్రి

సేంద్రియ ఎరువులతోనే అధిక దిగుబడులు

జిల్లా వ్యవసాయ వనరుల కేంద్రం డీడీఏ సుధాకర్‌రాజు

కనిగిరి, ఫిబ్రవరి 6 : సేంద్రియ ఎరువుల వాడకంతోనే అత్యధిక పంట దిగుబడులు సాధించ వచ్చని జిల్లా ఆత్మా వ్యవసాయ వనరుల కేంద్రం డీడీఏ జీ సుధాకర్‌రాజు అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఆరు మండలాల రైతులకు పంటల సాగుపై, చీడపీడల నివారణపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పాల్గొన్న డీడీఏ సుధాకర్‌రాజు మాట్లాడుతూ రైతులు పండించే పంటలకు ఆయా భూమి సారవంతంగా తయారు చేసుకోవాలన్నారు. భూసారాన్ని కాపాడుకునేందుకు పచ్చి రొట్ట, సేంద్రియ ఎరువల వాడకం వలన భూమి ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. అదేవిధంగా సమగ్ర పోషక యాజమాన్యం పాటించటం ద్వారా పురుగులు, తెగుళ్లను ఆశించటం తగ్గటమే కాకుండా నాణ్యమైన ఉత్పత్తికి రైతలకు ఎంతో తోడ్పడుతుందన్నారు. వరిలో ఉల్లికోడు, కాండం తొలిచే పురుగు, దోమ, అగ్గి తెగులు, శనగలో ఎండు తెగులు, పచ్చపురుగు, నీటి ఎద్దడి, మినుములో పల్లాకు తెగులు, బూడిద తెగులు, కందిలో మారకా మచ్చల పురుగు, పెద్ద తెగులు, ఎండు తెగులు, వేరుశనగలో నులిపురుగులు మొదలకు కుళ్లు, బత్తాయి, బీర, మిరప వంటి పంటలకు ఆశించే వైరస్‌లపై, పంటల సాగులో ఏర్పడే ఇబ్బందులు వాటి పరిష్కారం పై అవగాహన కల్పించారు. అదేవిధంగా స్థానిక రైతు భరోసా కేంద్రంలో (ఏపీసీఎన్ఎఫ్) పురుగు మందు లేని సేంద్రియ వ్యవసాయం ద్వారా పండించిన కూరగాయల విక్రయ కేంద్రాన్ని కనిగిరి ఏఓ ప్రారంభించగా ఏడీఏ ఈవీ రమణతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా రైతు భరోసా కేంద్రానికి వచ్చిన రైతులు, ప్రజలకు ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన నాణ్యమైన కూరగాయలను విక్రయించి సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా రైతులు తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడులు, లాభాలు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో ఆర్‌బీకే ఏంపీఈవో స్వర్ణ, బాపట్ల వ్యవసాయ కళాశాల ఇంటర్న్‌షిప్ విద్యార్థి షేక్ అర్షియా, సేంద్రియ వ్యవసాయ శిక్షకులు అంద్రా నారాయణ, వెలుగొండయ్య, పీ తిరుపతయ్య, ఎన్ రవణమ్మ, విజయరాణి, షేక్ ఖాసింబి, రమేష్‌బాబు, వెం కటనారాయణమ్మ, షేక్ మీరావలి, ఇర్మియా, అనిల్, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీడీఏ సుధాకర్‌రాజు.. సేంద్రియ కూరగాయలను పరిశీలిస్తున్న ఏవో

9 నుంచి పల్లెకు పోదాం

పామూరు, ఫిబ్రవరి 6 : మండలంలో ఈనెల 9, 10, 11 తేదీల్లో పల్లెకు పోదాం కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు బీజేపీ ఇన్‌చార్జి కేవీ రమణయ్య తెలిపారు. పార్టీ కార్యాలయంలో మంగళవారం నాయకులతో కార్యక్రమ నిర్వహణపై చర్చించారు. సమావేశంలో మండల అధ్యక్షుడు జె చిన సుబ్బయ్య, కె హరగోపాల్, డీ పవన్‌కుమార్, పీ అరవింద్, పీ శ్రీనివాసులు పాల్గొన్నారు.



యువకుడి ఆత్మహత్య

దర్శి ఫిబ్రవరి 6 : మండలంలోని బొట్లపాలెం గ్రామానికి చెందిన సీహెచ్ శివ (22) సోమవారం రాత్రి ఇంటిలోనే ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం యువకుడు శివ ఆదివారం నలుగురు స్నేహితులతో విందు చేసుకున్నారు. స్నేహితులో ఒకరి డబ్బులు రూ.1100 మాయమయ్యాయని, ఆ నగదు శివ తీసుకున్నాడంటూ వాదులాడుకున్నారు. ఆ క్రమంలో శివ సెల్‌ను లాక్కొని వెళ్లారు. దీంతో మనస్థాపం చెంది సోమవారం సాయంత్రం ఇంట్లో ఉరివేసుకొని శివ ఆత్మహత్య చేసుకున్నాడు. పొలం నుంచి తిరిగి వచ్చిన నాయనమ్మ విషయాన్ని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ శివన్నారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.





తాడేపల్లి : తాడేపల్లిలో దారా వెంకయ్య కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న భువనేశ్వరి



ఓపీ కోసం నిరీక్షణ

కిటకిటలాడిన జీజీహెచ్ ఓపీ విభాగం ● సిబ్బంది లేక రోగుల వెతలు

గుంటూరు(మెడికల్), ఫిబ్రవరి 6: అనారోగ్యంతో చూపించుకునేందుకు వచ్చిన వారికి గుంటూరు ప్రభుత్వాస్పత్రిలో చుక్కలు కనిపించాయి. ప్రభుత్వ సమగ్రాస్పత్రి ఔట్‌పేషెంట్(ఓపీ) విభాగం మంగళవారం ఉదయం రోగుల రద్దీతో కిక్కిరిసింది. ఓపీ చీటి కోసం వందల సంఖ్యలో రోగులు బారులు తీరారు. 11 ఓపీ రిజిస్ట్రేషన్ కౌంటర్లు ఉండగా మంగళవారం చీటీలు రాసేందుకు కేవలం ఐదుగురు డేటా ఎంట్రీ ఆపరేటర్లు మాత్రమే అందుబాట్లో ఉన్నారు. దీంతో రోగులు గంటల తరబడి ఎదురుచూడాల్సి వచ్చింది. ఓపీ ఆవరణలో వాహనాల పార్కింగ్ కూడా అస్తవ్యస్తంగా మారింది. వేల సంఖ్యలో రోగులు వస్తున్నా వీరి నియంత్రణకు తగినంత సంఖ్యలో సెక్యూరిటీ సిబ్బందిని నియమించ లేదు. ఓపీ విభాగానికి వచ్చి పరిస్థితులు పరిశీలించిన సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్ సిబ్బందిని తక్కువగా నియమించడంపై వివరణ ఇవ్వాలని పార్కింగ్, సెక్యూరిటీ తదితర మూడు విభాగాల కాంట్రాక్టర్లకు నోటీసులు జారీ చేశారు.

అండగా ఉంటాం

- మంగళగిరి నియోజకవర్గంలో నిజం గెలవాలి యాత్ర
- టీడీపీ కార్యకర్తల కుటుంబాలకు భువనేశ్వరి భరోసా



దుగ్గిరాల : శృంగారపురంలో టీడీపీ కార్యకర్త శృంగారపాటి శౌరి కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం అందిస్తున్న నారా భువనేశ్వరి

మంగళగిరి, ఫిబ్రవరి 6: అధైర్య పడొద్దు.. పార్టీ మీకు అండగా ఉంటుందని టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరి కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. నిజం గెలవాలి యాత్రలో భాగంగా మంగళవారం ఆమె మంగళగిరి, దుగ్గిరాల, తాడేపల్లి మండలాల్లో పర్యటించారు. చంద్రబాబు అక్రమ అరెస్టును తట్టుకోలేక మనస్తాపంతో మృతి చెందిన పార్టీ కార్యకర్తల కుటుంబాలను భువనేశ్వరి పరామర్శించారు. ఏడు కుటుంబాలను పరామర్శించి ధైర్యం చెప్పారు. గన్నవరం విమానాశ్రయంలో ఆమెకు కృష్ణా జిల్లా పార్టీ నాయకులు ఘనస్వాగతం పలికారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో దుగ్గిరాల గ్రామానికి చేరుకున్నారు. పార్టీ కార్యకర్త కన్నెగంటి మోహనరావు(71) కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం శృంగారపురం గ్రామంలో శృంగారపాటి శౌరి(70), మంగళగిరి మండలం చినకాకాని గ్రామంలో అనుమోలు బసవరాజు (55), తాడేపల్లి పట్టణం బ్రహ్మానందపురానికి చెందిన దారా వెంకయ్య (60), మంగళగిరి మండలం నవులూరు గ్రామానికి చెందిన వేమూరి కోటయ్య(63), ఎర్రబాలెం గ్రామానికి చెందిన జొన్నాదుల వెంకట కోటేశ్వరరావు(70), కృష్ణాయ పాలెం గ్రామానికి చెందిన ఈపూరి దేవసహాయం(65) కుటుంబాలను కలిసి కుటుంబ సభ్యులను పరామర్శించారు. భువనేశ్వరిని చూడగానే మృతుల కుటుంబ సభ్యులు భావోద్వేగానికి గురయ్యారు. మృతి చెందిన కార్యకర్తలకు నివాళులు అర్పించి, ఆయా కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.3 లక్షల చొప్పున చెక్కులను భువనేశ్వరి అందజేశారు. భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా పార్టీ అండగా నిలుస్తుందని వారికి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో తాడికొండ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి, ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ, నన్నపనేని రాజకుమారి, టీడీపీ, జనసేన నేతలు పాల్గొన్నారు.



మంగళగిరి: కృష్ణాయపాలెంలో ఈపూరి దేవసహాయం కుటుంబానికి చెక్కును అందజేస్తున్న భువనేశ్వరి

ఆటోతో ఢీకొట్టి.. రాడ్లతో దాడి



దాడిలో గాయ పడిన గొల్లపూడి శ్రీనివాసరావు

- టీడీపీ దళిత నేతపై హత్యాయత్నం
- స్థానికుల కేకలతో వైసీపీ మూకల పరారీ
- తురుమెళ్లలో అధికార పార్టీ శ్రేణుల దారుణం
- ఈ సంఘటనతో పర్యటనను రద్దు చేసుకున్న ఎమ్మెల్యే

రొంపిచర్ల, నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 6: అధికారం అండతో వైసీపీ మూకలు రెచ్చిపోతున్నాయి. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, మద్దతుదారుల్లో భయాందోళనలే లక్ష్యంగా వైసీపీ నాయకులు చెలరేగిపోతున్నారు. ఇందుకు తాజాగా మంగళవారం ఉదయం పల్నాడులో చోటుచేసుకున్న సంఘటనే నిదర్శనం. ద్విచక్ర వాహనంపై పనికి వెళ్తున్న టీడీపీ నాయకుడ్ని ఆటోతో ఢీకొట్టి కిందపడిపోయిన తర్వాత గొడ్డళ్లు, ఇనుప రాడ్లతో విచక్షణా రహితంగా వైసీపీ మూకలు దాడి చేశాయి. దాడిని గమనించిన స్థానికులు కేకలతో వైసీపీ వర్గీయులు పారిపోయారు. లేదంటే బాధితుడు మృతి చెంది ఉండేవాడే. సంచలనం కలిగించిన ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు.. రొంపిచర్ల మండలం తురుమెళ్ళ గ్రామానికి చెందిన గొల్లపూడి శ్రీనివాసరావు భవన నిర్మాణ కార్మికుడు. టీడీపీ కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొంటాడు. డిసెంబరు 31న గ్రామంలో ఫ్లెక్సీల వివాదం జరిగింది. ఈ నేపథ్యంలో శ్రీనివాసరావును హతమార్చేందుకు గ్రామానికి చెందిన వైసీపీ వర్గీయులు పథకం రూపొందించారు. ఈ క్రమంలో రోజులానే పనినిమిత్తం శ్రీనివాసరావు ద్విచక్ర వాహనంపై మంగళవారం ఉదయం నరసరావుపేటకు బయల్దేరారు. కాపుకాసి ఉన్న వారు ఆయన్ను ఆటోలో వెంబడించి గ్రామ శివార్లలో ఢీకొట్టారు. ద్విచక్ర వాహనంపై నుంచి కిందపడిపోయిన శ్రీనివాసరావుపై ఆటోలోని వారు ఇనుప రాడ్లు, గొడ్డళ్లతో విచక్షణా రహితంగా దాడి చేసి కొట్టారు. కాళ్లను నుజ్జునుజ్జు చేశారు. తలపై గొడ్డలితో కొట్టారు. దాడిని ఆ సమీపంలోని పొలాల్లో ఉన్న వ్యక్తులు గమనించి కేకేలు వేయడంతో అగంతకులు అక్కడి నుంచి పారిపోయారు. వారు తెచ్చుకున్న ఆటోను సంఘటనా స్థలంలో వదలివెళ్లారు. తీవ్ర రక్తస్రావంతో పడి ఉన్న శ్రీనివాసరావును స్థానికులు నరసరావుపేటలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటన నియోజకవర్గంలో కలకలంరేపింది. రొంపిచర్ల పోలీసులు సంఘటనాస్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. అగంతకులు వదిలివెళ్లిన ఆటోను స్వాధీనపరుచుకున్నారు. ఎస్ఐ పాల్‌రాజ్ రవీంద్ర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గ్రామానికి చెందిన గొల్లపూడి రామారావు, మరి కొంతమంది హత్యాయత్నం చేసినట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. గ్రామంలో అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు పికెట్ ఏర్పాటు చేశారు. దాడి చేసిన వారిని అరెస్టు చేసేందుకు ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ సంఘటనతో గ్రామంలో ముందుగా ఏర్పాటు



తురుమెళ్ళలో పోలీసుల పహారా

చేసిన ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పర్యటనను రద్దు చేసుకున్నారు. ఇటీవల గ్రామంలో జరిగిన వివాదం నేపథ్యంలో శ్రీనివాసరావు హత్యకు వైసీపీ నేతలు యత్నించారని టీడీపీ నేతలు చెబుతున్నారు.

దారుణం : డాక్టర్ అరవిందబాబు

ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శ్రీనివాసరావును టీడీపీ ఇన్‌చార్జి అరవింద బాబు పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ ఘటనకు ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పూర్తి బాధ్యత వహించాలన్నారు. ఎస్సీ కుటుంబానికి చెంది, కూలి పనులతో జీవనం సాగించే శ్రీనివాసరావుపై దాడి దారుణం అన్నారు. ఎమ్మెల్యే కనుసన్నల్లోనే తురమెళ్ల గ్రామ వైసీపీకి చెందిన గోళ్ళపూడి రామారావు, కొండయ్య, తిరుమల చెంచారావు, తిరుమల కోటేశ్వ రరావు, మరో గుర్తు తెలియని వ్యక్తి దాడిలో పాల్గొన్నారని చెప్పారు. దాడిని సర్పంచ్ గాజుల మాణిక్యరావు, చిన కోటేశ్వ రరావు, కాటం శ్రీనివాసరావు, కాటం నాగాంజనేయులు ప్రోత్సహించా రని చెప్పారు. దాడిపై ఎస్సీ న్యాయవిచారణ జరిపించాలన్నారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన వ్పటి నుంచి ఎస్సీలపై దాడులు జరుగుతున్నాయన్నారు. తురుమెళ్ల, అలవాల గ్రామాలపై దృష్టి పెట్టాలని ఎస్పీని కోరినా ఆయన పెడ చెవిన పెట్టారని అందు వల్లే ఈ దాడి జరిగిందన్నారు. అరవిందబాబు వెంట మాజీ ఎంపీపీ కడియం కోటి సుబ్బా రావు, టీడీపీ రొంపిచర్ల మండల అధ్యక్షుడు పులుకూరి జగ్గారావు, మడకా శివప్రసాదరావు, పాపారావు, మరియబాబు, న్యాయవాదులు సీతారామయ్య, చక్రపాణి తదితరులున్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి: జీవీ

టీడీపీ దళిత నేత శ్రీనివాసరావుపై వైసీపీ శ్రేణుల హత్యాయత్నం దారుణమని, నిందితులను కఠినంగా శిక్షించాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు డిమాండ్ చేశారు. సర్పంచ్ ఆధ్వర్యంలోనే వైసీపీ శ్రేణులు హత్యాయత్నానికి పాల్పడ్డా యని ఆరోపించారు. రోజురోజుకు వైసీపీ గుండాలు పెట్రేగిపోయి అల్లర్లు, దాడులు, హత్యాయత్నాలకు పాల్పడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. పోలీసుల సమక్షంలో వీధి రౌడీల్లా కర్ర లు, రాడ్లు పట్టుకుని వీరంగం సృష్టిస్తూ అల్లర్లు సృష్టిస్తున్న సంఘటనలు ఉన్నాయన్నారు.

బడి పిల్లలకూ.. ఓట్లు



బడికి వెళ్లి పాఠాలు వినాల్సిన వారు.. రానున్న ఎన్నికల్లో ఓటు వేయనున్నారు. ఎనిమిదో తరగతి చదువుతున్న వారి వయస్సు 14 ఏళ్లు కాగా 21 ఏళ్లుగా చూపి వారి పేర్లను ఓటర్ల జాబితాలో చేర్చారు. బరితెగించిన వైసీపీ నాయకుల ఒత్తిళ్లకు ఎన్నికల అధికారులు ఆమోదం తెలిపారు. టీడీపీకి పట్టున్న బెల్లంకొండ మండలంలో పాగా వేసేందు కు వైసీపీ నేతలు బడి పిల్లలను పావులుగా మార్చు కున్నారు. పెదకూరపాడు ఓట్ల జాబితాలో ఈ చిత్రవిచిత్రాలు వెలుగు చూశాయి. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాలనీలో అత్యధిక మెజారిటీ రావాలని ఎమ్మెల్యే చెప్పడంతో స్థానిక నేతలు విద్యార్థులను ఓటర్ల జాబితాలోకి చేర్పించేశారు. పెదకూ రపాడు నియోజకవర్గం బెల్లంకొండ మండలం ఎమ్మాజీగూడెం(పులిచింతల ప్రాజెక్టు ముంపు గ్రామం) ఓటర్ల జాబితా చూసిన వారికి నోట మాట రావడం లేదు.

- 14 ఏళ్లకు 21గా చూపి నమోదు
- వైసీపీ నేతల ఒత్తిడి.. అధికారుల ఆమోదం
- 8వ తరగతి విద్యార్థుల పేర్లు ఓటర్ల జాబితాలో..

బెల్లంకొండ, గుంటూరు సిటీ, ఫిబ్రవరి 6: పెదకూరపాడు నియోజకవర్గం బెల్లంకొండ మండలం ఎమ్మాజీగూడెం పులిచింతల ముంపు కాలనీలో నివాసముంటున్న చాలామంది పిల్లలు సమీపంలోని సత్తెనపల్లి, బెల్లంకొండ పాఠశాలల్లో చదువుకుంటున్నారు. వారి వయస్సు కేవలం 14 ఏళ్లలోపే. అయితే గెలుపే ధ్యేయంగా పెట్టుకున్న వైసీపీ నేతలు బడి పిల్లలను ఓటర్లగా చేర్చేశారు. ఓటర్ల తుది జాబితా విడుదల అయ్యే వరకు 14 ఏళ్ల లోపు వయస్సున్న పిల్లలకు ఓటు హక్కు వచ్చిన సంగతి ఎవరికీ తెలియదు. ఎమ్మాజీగూడెం పోలింగ్ బూత్ నెంబరు 28 ఓటర్ల జాబితాలో చేరిన పిల్లలు ఆయా పాఠశాలల్లో చదువుకుంటున్నారు. వాస్తవానికి వారి వయస్సు 14 ఏళ్లు మాత్రమే ఓటర్ల జాబితాలో వారికి 21 సంవత్సరాలు ఉన్నట్లుగా చూపించారు. కొత్తగా ఓట్లు వచ్చినట్లు చెబుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు వైసీపీ సానుభూతిపరులుగా ఉన్నట్లు సమాచారం. 14 ఏళ్ల పిల్లలకు ఓటు హక్కును కల్పించిన తహసీల్దార్ రెండు రోజుల క్రితం బదిలీపై వెళ్లిపోయారు.

విద్యార్థులకు ఓట్లు ఇలా..

ఎమ్మాజీగూడెం పులిచింతల ముంపు కాలనీకి చెందిన ఓర్సు చంద్రకళ సత్తెనపల్లి బాలికల ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతుంది. ఓటర్ల జాబితా సీరియల్ నెంబరు 1039 లో ఈ బాలికకు ఓటు ఉంది.

- ఓర్సు శివగోపి పాపాయిపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. ఓటరు జాబితాలోని సీరియల్ నెంబరు 1037లో ఈ బాలుడికి ఓటు ఉంది.
- కూరాకుల హిమబిందు బెల్లంకొండ అడ్డరోడ్డులోని కస్తూర్బా పాఠశాలలో పదో తరగతి చదువుకుంటుంది. ఈ బాలికకు ఓటరు జాబితాలోని సీరియల్ నెంబరు 1027లో ఓటు హక్కు ఉంది.
- సత్తెనపల్లి బాలికల ఉన్నత పాఠ శాలలో 8వ తరగతి చదువుతున్న తమ్మిశెట్టి మహాలక్ష్మికి ఓటరు జాబితాలోని సీరియల్ నెంబరు 1028లో ఓటు ఉంది.
- ఏడో తరగతి వరకు చదివి ఎమ్మాజీగూడెం పాఠశాలలో డ్రాప్ ఔట్‌గా ఉన్న ఓర్సు లక్ష్మీ తిరుపతమ్మకు ఓటరు జాబితా సీరియల్ నెంబరు 1026లో ఓటు ఇచ్చారు.
- పాపాయపాలెం జడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న రావూరి మనోజ్‌కుమార్‌కు ఓటరు జాబి తా సీరియల్ నెంబరు 1031లో ఓటు ఉంది.
- పేరేచర్ల ప్రైవేటు పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న తురక నీలిమకు ఓటరు జాబితా సీరియల్ నెంబరు 1040లో ఓటు ఉంది.
- సత్తెనపల్లి బాలికల ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న నంద్యాల వాసవికి ఓటు సీరియల్ నెంబరు 1048లో ఉంది.
- దాచేపల్లి మండలం కేసానుపల్లి సమీపంలోని ప్రైవేటు పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న బత్తుల శివ పూజితకు ఓటర్ సీరియల్ నెంబరు 1052లో ఓటు కల్పించారు.
- సత్తెనపల్లి శాంతినికేతన్‌లో ఇంటర్ మొదటి సం వత్సరం చదువుతున్న జల్లి దివ్యకు ఓటరు జాబి తా సీరియల్ నెంబరు 1053లో ఓటు ఉంది.



ఎమ్మాజీగూడెంలో 14 ఏళ్ల పిల్లల కు ఓటు హక్కు కల్పించిన జాబితా



● ప్రజాస్వామ్యం ఖూనీ

ఎమ్మెల్యే శంకరరావు పిల్లలకు ఓటు హక్కు కలిపించి ప్రజాస్వామ్యం ఖూనీ చేశారు. తప్పుడు మార్గంలో గెలవాలన్న ఆలోచనతోనే విద్యార్థులకు ఓటు హక్కు కల్పించారు. అధికారులు వైసీపీ నేతలకు తొత్తులుగా మారిపోయి ఈ దారుణానికి ఒడిగట్టారు. బడి పిల్లలకు ఓటు హక్కు కల్పించిన అధికారులపై, ఒత్తిడి చేసిన వైసీపీ ఎమ్మెల్యే శంకరరావుపై ఎన్నికల సంఘం క్రిమినల్ చర్యలు తీసుకోవాలి.

- కొమ్మాలపాటి శ్రీధర్, మాజీ ఎమ్మెల్యే పెదకూరపాడు



ఉలిక్కి పడ్డ.. బాపట్ల

- గ్యాంగ్‌వార్‌ను తలపించేలా కత్తులతో వీరంగం
- సూర్యలంక రోడ్డులో ఓ యువకుడి దారుణ హత్య
- తృటిలో తప్పించుకున్న మరో యువకుడు.. గాయాలతో చీరాలలో చికిత్స

బాపట్ల రూరల్, బాపట్ల, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): గతంలో ఎన్నడూ లేని రీతిలో గంజాయి మత్తులో యువకులు గ్యాంగ్ వార్‌ను తలపించేలా గుంపులుగా నడిరోడ్డుపై కత్తులు, కర్రలతో వీరంగం.. వేటాడి మరీ ఓ యువకుడ్ని దారుణంగా హత్య చేయగా మరో యువకుడు తృటిలో తప్పించుకున్న ఘటన సూర్యలంక రోడ్డులో మంగళవారం సాయంత్రం జరిగింది. ఈ ఘటనతో బాపట్లవాసులు ఉలిక్కిపడ్డారు. పట్టణంలోని చీలురోడ్డు సమీపంలో మంగళవారం మధ్యాహ్నం ఇరువర్గాల యువకుల మధ్య ఘర్షణ జరిగింది. ఆ తర్వాత ఎవరి దారిన వారు వెళ్లిపోయారు. గొడవకు సంబంధించి ఫిర్యాదు ఇవ్వడానికి యాసిన్ అనే యువకుడు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారని సమాచారం. మంగళవారం సాయంత్రం సూర్యలంక రోడ్డులో ఉన్న ఓ రెస్టారెంట్‌లో భోజనం చేయడానికి ఓ వర్గానికి చెందిన ఐదుగురు యువకులు చేరుకున్నారు. మద్యం, గంజాయి మత్తులో ఉన్నట్లు గుర్తించిన హోటల్ నిర్వాహకులు వారిని పక్కకు పంపిచేశారు. ఈ క్రమంలో ముప్పై మందితో అక్కడకు చేరుకున్న మరో గ్రూపు ఐదుగురు యువకులు వచ్చిన వాహనాన్ని ధ్వంసం చేశారు. ఆ తర్వాత కత్తులు, కర్రలతో వారిపై దాడికి తెగబడ్డారు. గోరంట్ల సుమంత్(22) అనే యువకుడిపై కత్తులతో విచక్షణా రహితంగా దాడి చేసి కొట్టారు. అతడు తప్పించుకునేందుకు యత్నించగా రోడ్డు వరకు పరిగెత్తించి మరీ కొట్టి చంపి పక్కనున్న పొదల్లో పడేశారు. మరో యువకుడు రాహుల్ వారి నుంచి తప్పించుకున్నాడు. అయితే అతడు గాయాలతో చీరాల ఏరియా వైద్యశాలలో చికిత్స పొందినట్లు సమాచారం. పాతకక్షల నేపథ్యంలో దాడి చేయడానికి వచ్చిన యువకులు ఆటోల్లో, బైకుల్లో కత్తులు, కర్రలు గాలిలో తిప్పుతూ నడిరోడ్డుమీద హల్‌చల్ చేస్తూ దారుణానికి ఒడిగట్టారు. హత్యకు గురైన సుమంత్ హైదరాబాద్‌లో కంప్యూటర్ కోర్సు నేర్చుకుంటూ మంగళవారమే పట్టణానికి రాగా, అతడు హత్యకు గురి కావడం సంచలనం రేపింది. మృతుడు తల్లి పట్టణ టీడీపీలో గతంలో క్రియాశీలకంగా పనిచేశారని తెలుస్తోంది.

పోలీసుల అదుపులో ఇద్దరు

హత్యకు సంబంధించి అనుమానితులుగా పేర్కొంటున్న వారిలో ఇద్దరు బాపట్ల ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా పోలీసులు వారిని మంగళవారం రాత్రి అదుపులోకి తీసుకున్నారు. ఇద్దరిలో ఒకరైన యాసిన్ అనే వ్యక్తికి గతంలోనే నేర చరిత్ర ఉన్నట్లు తెలుస్తోంది. పోలీసుల నిఘా వైఫల్యం కూడా ఈ హత్యకు కారణంగా పలువురు అభిప్రాయపడుతున్నారు. పోలీసుల వైపు నుంచి కనీస నిఘా కూడా పర్యాటక తీరంలో లేకపోవడంతో మత్తు, గంజాయికి అడ్డాగా మారిందనే అభిప్రాయాన్ని ప్రజలు వ్యక్తం చేస్తున్నారు

అందరూ 30 ఏళ్లలోపు వారే...

రెండు గ్రూపులుగా విడిపోయి ఘర్షణకు పాల్పడిన యువకులంతా స్థానికులే. 30 ఏళ్లలోపే వారే కావడం గమనార్హం. వీరిలో చాలా మంది డిగ్రీపూర్తి చేసిన యువకులు కాగా మరి కొంతమంది వివిధ వృత్తులు చేస్తున్న వారు ఉన్నారు. పోలీసుల అదుపులో ఉన్న యాసిన్ అనే నిందితుడు గతంలో ఓ పత్రికలో రిపోర్టర్‌గా పనిచేయడంతో పాటు ప్రస్తుతం బాపట్లలో డ్రైవింగ్ స్కూల్ నడుపుతున్నాడు



దాడిలో ధ్వంసమైన కారు అద్దం

ఢిల్లీ రిజిస్ట్రేషన్‌తో కారు....

హత్యకు గురైన సుమంత్ అతడి స్నేహితులు ఢిల్లీ రిజిస్ట్రేషన్‌తో ఉన్న కారులో రెస్టారెంట్‌కు వెళ్లారు. ఈ వాహనం బాపట్ల పట్టణంలో చక్కర్లు కొడుతూనే ఉంటుందని, గంజాయి తరలింపునకు కూడా అదే వాహనాన్ని ఉపయోగిస్తారనే ప్రచారం ఉంది. గుంపుగా వచ్చిన ప్రత్యర్థి వర్గం ముందుగా ఆ కారునే లక్ష్యంగా చేసుకుని విధ్వంసానికి పాల్పడగా తర్వాత వారిపై దాడి, ఒకరి హత్య జరిగింది. వాస్తవానికి సుమంత్ స్నేహితుడు రాహుల్ అనే యువకుడ్ని అంతమొందించడమే టార్గెట్‌గా వేరే వర్గం యువకులు వచ్చినప్పటికీ అతడు తప్పించుకున్నాడు. దీంతో సుమంత్‌ను దారుణంగా హత్య చేసి తమ కక్ష తీర్చుకున్నారని సమాచారం. హత్యకు సంబంధించి ఇద్దర్ని అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నామని బాపట్ల రూరల్ పోలీసులు తెలిపారు. సుమంత్‌తో పాటు ఉన్న అతని స్నేహితులు నలుగురు, వారి మీద దాడికి తెగబడిన గుంపులోని మిగిలిన వారి కోసం గాలిస్తున్నామని పోలీసులు తెలిపారు.

నేడు బాపట్లకు షర్మిల

- అంబేడ్కర్ సర్కిల్ వరకు రోడ్‌షో, సభ
- వైసీపీ అసమ్మతి నేతల చూపు కాంగ్రెస్ వైపు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న జేడీ శీలం

బాపట్ల, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్. షర్మిలారెడ్డి బుధవారం బాపట్లకు రానున్నారు. ఆమె కాంగ్రెస్ సారథిగా బాధ్యతలు తీసుకున్నాక పార్టీకి జవసత్వాలు అందించడా నికి చేపట్టిన జిల్లాల పర్యటనలో భాగంగా జిల్లాకు వస్తున్నారు. ఆమె పర్యటనను విజయవంతం చేయడానికి కాంగ్రెస్ నేతలు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. పట్టణంలోని చీలు రోడ్డు నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు రోడ్ షో నిర్వహణతో పాటు అనంతరం అదే కూడలిలో బహిరంగ సభ నిర్వహించను న్నారు. షర్మిల సభ విజయవంతం చేయడానికి కాంగ్రెస్ శ్రేణులు ప్రయత్నిస్తుంటే తెరవెనుక నుంచి వైసీపీ అసంతృప్త నేతలు వారికి సహకరిస్తున్నట్లు సమాచారం. వైసీపీలోని అసమ్మతి నేతల చూపు కాంగ్రెస్ వైపు ఉన్నట్లు సమాచారం. ముఖ్యంగా తమకు తగురీతిలో గుర్తింపు దక్కడం లేదని అసంతృప్తితో ఉన్న జగన్ సామాజిక వర్గ నేతలు కొంతమంది షర్మిలతో భేటీ అయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఆయా స్థానాలకు సంబంధించి సీట్ల విషయంలో పీసీసీ అధ్యక్షురాలి దగ్గర ప్రతిపాదనలు పెట్టనున్నట్లు సమాచారం.

పోలీస్ బాస్ ఎవరు..?

- తాత్కాలికంగా నిలిచిన మలికగర్గ్ బదిలీ
- రిలీవ్ కావొద్దని ఉన్నతాధికారుల మౌఖిక ఆదేశాలు
- కొత్తగా నియమితులైన పరమేశ్వరరెడ్డి పట్ల వైసీపీ నేతల అభ్యంతరమే కారణం
- పరిశీలనలో పల్నాడు జిల్లా ఎస్పీ



ఒంగోలు (క్రైం), ఫిబ్రవరి 6 : జిల్లా ఎస్పీగా ఎవరు వస్తారు అన్న విషయంలో సందిగ్ధం నెలకొంది. మలికగర్గ్ బదిలీ తాత్కాలికంగా నిలిచిపోయింది. ఆమెకు మంగళవారం జరగాల్సిన వీడ్కోలు సభ కూడా రద్దయ్యింది. ఇక్కడికి ఎస్పీగా రావాల్సిన పరమేశ్వరరెడ్డి పట్ల జిల్లాకు చెందిన వైసీపీ నేతలు తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేయడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. అయితే మలికగర్గ్‌ను కొనసాగిస్తారా? లేక కొత్తవారిని నియమిస్తారా? అన్నది కొద్దిరోజుల్లో తేలనుంది. ఎస్పీ మలికగర్గ్‌ను తిరుపతి బదిలీ చేసి అక్కడ పనిచేస్తున్న పరమేశ్వరరెడ్డిని ఇక్కడ ఎస్పీగా నియమిస్తూ ఈనెల 1న ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. దీంతో మంగళవారం మలికగర్గ్‌కు వీడ్కోలు సభ ఏర్పాటు చేశారు. అయితే రిలీవ్ కావొద్దని ఆమెకు ఉన్నతాధికారుల నుంచి సోమవారం రాత్రి మౌఖిక ఆదేశాలు అందాయి. దీంతో వీడ్కోలు సభను రద్దు చేశారు. దీని వెనుక ఏమి జరుగుతోంది? జిల్లా ఎస్పీగా ఎవరు వస్తారు? అన్నది చర్చనీయాంశమైంది. పరమేశ్వరరెడ్డి నియామకంపై అధికార పార్టీ నేతలు సానుకూలంగా లేరు. ఆదేసమయంలో తిరుపతి లోకసభ ఉపఎన్నిక సందర్భంగా జరిగిన పరిణామాలను దృష్టిలో ఉంచుకొని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చన్నాయుడు పరమేశ్వరరెడ్డి ప్రకాశం జిల్లా ఎస్పీగా నియామకంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఈక్రమంలోనే సోమవారం విజయవాడ ఓ హోటల్‌లో వైసీపీ జిల్లా కోఆర్డినేటర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశానికి హాజరైన వైసీపీ నాయకులు పరమేశ్వరరెడ్డి నియమాకంపై అభ్యంతరాలు వ్యక్తం చేశారు. ఈనేపథ్యంలో తాత్కాలికంగా ఎస్పీ మలికగర్గ్‌ను రిలీవ్ కావొద్దని ఉన్నతాధికారులు మౌఖిక ఆదేశాలు ఇచ్చారు.

ఎనిమిది తర్వాత తుది నిర్ణయం

వాస్తవానికి గత నెలలో రాష్ట్రంలోని 30 మంది ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ ఉత్తర్వులు వచ్చాయి. ఆ జాబితాలో మలికగర్గ్ పేరు లేదు. కానీ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి వైసీపీ జిల్లా కోఆర్డినేటర్‌గా వచ్చిన తరువాత ఆగమేఘాలపై ఈనెల 1న మలికగర్గ్‌ను తిరుపతికి బదిలీ చేసి అక్కడ ఉన్న పరమేశ్వరరెడ్డిని ఇక్కడ ఎస్పీగా నియమిస్తూ ఉత్తర్వులు వచ్చాయి. దీంతో ఆమె ఇక్కడి నుంచి రిలీవ్ అయ్యేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. అయితే పరమేశ్వరరెడ్డి పట్ల జిల్లాలోని వైసీపీ నేతలు సానుకూలత వ్యక్తం చేయకపోగా ఆయన వద్దు అంటూ భీష్మించారు. దీంతో ఎస్పీ బదిలీ తాత్కాలికంగా నిలిచిపోయింది. పల్నాడు ఎస్పీగా పనిచేస్తున్న రవిశంకర్‌రెడ్డిని ఎస్పీగా నియమించాలని వైసీపీ నాయకుల ప్రతిపాదిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో ఈ నెల 8 తర్వాత ఎస్పీ విషయంలో తుది నిర్ణయం తీసుకునే అవకాశముంది.

మూడు సొసైటీలలో చైర్మన్‌లు మార్పు

మేదరమెట్ల, ఫిబ్రవరి 6: వైసీపీ అద్దంకి నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా పాణెం చిన్న హనిమిరెడ్డి బాధ్యతలు స్వీకరించాక గత ఇన్‌చార్జ్ బాచిన కృష్ణచైతన్య నియమించిన సొసైటీ చైర్మన్‌లను మార్పుచేశారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో పెద్దదైన రావినూతల సొసైటీకి కారుసాల బసయేశ్వరరావును చైర్మన్‌గా నియమించారు. బసయేశ్వరరావు రావినూతల సొసైటీలో సుదీర్ఘకాలం పనిచేయడమే కాకుండా జిల్లా కేంద్ర సహకార బ్యాంక్‌లో ఉన్నత పదవిలో పదవీవిరమణ పొందారు. ఆ సొసైటీలో సభ్యులుగా అరుద్ర రఘుబాబు, కొత్తపల్లి సుబ్బారావును నియమించారు. తిమ్మనపాలెం సహకార సంఘానికి గతంలో పాలకమండలి సభ్యులుగా ఉన్న పోతుల వెంకటస్వామిని చైర్మన్‌గా నియమించారు. గతంలో చైర్మన్‌గా ఉన్న అన్నెం శ్రీనాథ్‌రెడ్డిని సభ్యుడుగా నియమించారు. యర్రబాలెం నుంచి మామిళ్ళపల్లి రామచంద్రరావును మరో సభ్యుడుగా నియమించారు. ధైవాలరావూరు సొసైటీ చైర్మన్‌గా గతంలో డైరెక్టర్‌గా ఉన్న తానికొండి నరసింహారావును నియమించారు. సభ్యులుగా తొట్టెంపూడి రామారావు, బాలినేని వీ రయ్యను నియమించారు. వచ్చే సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఈ మార్పులు చేసినట్లు తెలుస్తుంది. ఈ కమిటీల పదవీకాలం జూలై 30 వరకు ఉంటుందని నియామక ఉత్తర్వులలో పేర్కొన్నారు.

వైసీపీ పాలనలో బీసీలకు ఇబ్బందులు

టీడీపీ చీరాల ఇన్‌చార్జి కొండయ్య



మాట్లాడుతున్న కొండయ్య

దొనకొండ, ఫిబ్రవరి 6 : బీసీ సామాజిక ఓ ట్లతో అధికారం చేపట్టిన వైసీపీ ప్రస్తుతం బీసీలను అన్ని విధాలుగా ఇబ్బందులు పెడుతోందని టీడీపీ చీరాల ఇన్‌చార్జి ఎంఎం కొండయ్య పేర్కొన్నారు. స్థానిక ఒబ్బాపురంలో టీడీపీ దర్శి నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు మోడి వెంకటేశ్వర్లు అధ్యక్షతన మంగళవారం రాత్రి జరిగిన జయహో బీసీ సదస్సుకు ఆ య న ముఖ్య అతిథిగా ప్రసంగించా రు. 2009లో ఎంపీగా పోటీ చేసిన సమయంలో దొనకొండ ప్రాంత టీడీపీ నాయకులు కార్యకర్తలు చూపిన అభిమానం ఎన్నటికీ మరువలేన న్నారు. పార్టీకి అంకిత భావంతో పనిచేసే నా యకు లు, కార్యకర్తలకు తగిన గుర్తింపు ఉం టుంద న్నారు. తెలిసో తెలియకో జ గన్‌కు ఓటు వేసినందుకు రాష్ట్రానికి, ప్రజలకు తీరని అ న్యాయం జరిగిందన్నారు. మాచర్లలో ఒక బీసీకి చెందిన టీడీపీ అభిమానిని జై వైసీపీ, జై జగన్ అని అనలేదని నడిరోడ్డులో గొంతుకోసి న అరాచక పాలన ఈ రాష్ట్రంలో వైసీపీ కొనసాగిస్తుందని దుయ్యబట్టారు. ఎస్సీలు, ఎస్టీలు, బీసీలు గొంతెత్తి మాట్లాడితే ఒక పథకం ప్ర కారం పోలీసులతో ఎన్నో రకాలుగా ఇబ్బంది లు పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తేనే బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి జరుగుతుందని రానున్న ఎన్నికల్లో టీడీపీ గెలుపునకు ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేసి చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాలని పిలుపునిచ్చారు. టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు నాదెండ్ల బ్రహ్మంచౌదరి మాట్లాడుతూ జగన్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి బలహీన వర్గాలపై దాడులు చేస్తూనే ఉన్నారని ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో దర్శి నియోజకవర్గంలో టీడీపీ మాత్రమే పోటీ చేయబోతుందని భరోసా ఇచ్చారు. వైసీపీ నాయకుల తప్పుడు ప్రచారాలను టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అ భిమానులు నమ్మవద్దని పిలుపునిచ్చారు. దర్శి నియోజకవర్గంలో 2014 నుం చి 2019 వరకు టీడీపీ హయాంలో జరిగిన అభివృద్ధి తప్ప వైసీపీ పాలకులు ఎటువంటి అభివృద్ధి చేయలేదని, దీనిపై బహిరంగ చర్చకు తాము సిద్ధమన్నారు. కార్యక్రమంలో దర్శి నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, టీడీపీ దర్శి నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు మోడి వెంకటేశ్వర్లు, టీడీపీ మండల అధ్యక్షుడు నాగులపాటి శివకోటేశ్వరరావు, నాయకులు అంకాల మ ల్లికార్జున (మల్లి), యరగొర్ల బసవయ్య బత్తుల బాలరాజు, మోడి చిన్నఆంజనేయులు, వల్లపునేని కేశవ, పలు గ్రామాలకు చెందిన బీసీ నాయకుల పాల్గొన్నారు.

14 మంది తహసీల్దార్‌లకు స్థానచలనం

ఆరుగురికి పోస్టింగ్

ఒంగోలు (కలెక్టరేట్), ఫిబ్రవరి 6 : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నెల్లూరు, గుంటూరు జిల్లాల నుంచి వచ్చిన 14 మంది తహసీల్దార్‌లకు ఇటీవల ఇచ్చిన పోస్టింగ్ స్థానాలను మారుస్తూ కలెక్టర్ దినేష్‌కుమార్ మంగళవారం రాత్రి ఉ త్తర్వులు జారీ చేశారు. ఆరుగురికి కొత్తగా పోస్టింగ్‌లు ఇచ్చారు. కలెక్టరేట్ సూపరింటెండెంట్లుగా బేస్తవారపేటలో పనిచేస్తున్న వి.లావణ్య, శ్రీకాంత్ కేథార్‌నాథ్, డి.మల్లికార్జునరావు, ఎం.నాగిరెడ్డిని నియమించారు. రవికుమార్‌కు ఒంగోలు అర్బన్, ఎస్‌కే నాగూర్‌మీరాకు సీఎస్‌పురం, ఎం.డానియేల్‌కు ఒంగోలు రూరల్ తహసీల్దార్‌గా పోస్టింగ్ ఇచ్చారు. నాగులుప్పలపాడులో పనిచేస్తున్న ఎం.సృజన్‌కుమార్‌ను గిద్దలూరు, ఎర్రగొండపాలెంలో పనిచేస్తున్న బి.సోమ్లానాయక్‌ను మార్కాపురం, ఒంగోలు అర్బన్‌లో పనిచేస్తున్న జి.సిద్ధార్థ్‌ను ఎర్రగొండపాలెం, మార్కాపురంలో పనిచేస్తున్న జి.రమేష్‌కుమార్‌ను చీమకుర్తి, సింగరాయకొండలో పనిచేస్తున్న రమణయ్యను కంభం తహసీల్దార్‌గా నియమించారు. సీఎస్‌పురంలో పనిచేస్తున్న ఎంవీకే సుధాకర్‌రావును పొన్నలూరు, దోర్నాలలో పనిచేస్తున్న పి.అనురాధను కేఆర్‌సీసీ ఒంగోలు ఆర్డీవో ఆఫీసు, అర్ధవీడులో పనిచేస్తున్న జె.ప్రసాదరావును సింగరాయకొండ, గిద్దలూరులో పనిచేస్తున్న పద్మనాభుడును బేస్తవారపేట, కంభంలో పనిచేస్తున్న వైవీబీ కుటుంబరావును టంగుటూరు, దర్శిలో పనిచేస్తున్న బి.పద్మావతిని నాగులుప్పలపాడు తహసీల్దార్‌గా స్థానచలనం కల్పించారు.

మెప్మాలో కలకలం..!

- 'ఆంధ్రజ్యోతి' కథనంతో కదులుతున్న డొంక
- నకిలీ గ్రూపులతో రూ.కోట్ల స్వాహాపై ఇంటెలిజెన్స్ ఆరా
- సిట్ వేయాలని టీడీపీ డిమాండ్
- బోగస్ రుణాలు పొందిన వైసీపీ నాయకులు, ఆర్పీల గుండెల్లో గుబులు
- నోరు మెదపని మెప్మా అధికారులు

పట్టణ పేదరక నిర్మూలన సంస్థ (మెప్మా)లో రుణాల పేరుతో జరిగిన గోల్‌మాల్ వ్యవహారం ప్రకంపనలు సృష్టిస్తోంది. ఈ విషయమై 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనం ఆ సంస్థలో కలకలం రేపింది. నకిలీ గ్రూపులతో బ్యాంకులను బురిడీ కొట్టించి రూ.కోట్ల మేర రుణాలు దోచుకున్న వారి గుండెల్లో గుబులు మొదలైంది. అదేసమయంలో ఈ వ్యవహారంపై ఇంటెలిజెన్స్ అధికారులు దృష్టి సారించారు. అసలేం జరిగిందన్న విషయమై ఆరా తీయడం ప్రారంభించారు. అదేసమయంలో రుణాలు బొక్కేసిన వైసీపీ మహిళా నాయకులు, ఆర్పీలు తప్పులు కప్పిపుచ్చుకునేందుకు దారులు వెతుకుతున్నారు. ఎలాగైనా ఈ గండం నుంచి గట్టెక్కించాలని, బ్యాంకులకు తామే నెలనెలా వాయిదాలు చెల్లిస్తామని పొదుపు మహిళల చుట్టూ తిరుగుతున్నారు. మరోవైపు బోగస్ పేర్లతో రుణాల స్వాహాపై సిట్‌తో విచారణ చేయించాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా మెప్మా అధికారులు నోరు మెదపకపోవడం అనుమానాలకు తావిస్తోంది.



ఒంగోలు (కార్పొరేషన్), ఫిబ్రవరి 6 : మహిళల ఆర్థిక స్వావలంబన కోసం ఏర్పాటు చేసిన పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా)లో కొంతకాలంగా బోగస్ రుణాల బాగోతం నడిచింది. అధికారపార్టీ నాయకురాళ్లు, ఆర్పీలు కుమ్మక్కై పెద్ద దందాను నడిపారు. లేని పొదుపు సంఘాలు ఉన్నట్లు చూపించి, గ్రూపు సభ్యులకు తెలియకుండానే వారిపేర్లు చేర్చి, నకిలీ ఆధార్ కార్డులను సృష్టించి ఒంగోలులోని వివిధ బ్యాంకుల్లో రూ.50కోట్ల మేరకు రుణాలు తీసుకొని స్వాహా చేశారు. దీనిపై 'ఆంధ్రజ్యోతి' ఆదివారం సంచికలో 'మెప్మాలో మెక్కా.శారు' శీర్షికన సమగ్ర కథనం ప్రచురితమైంది. ఇది ప్రస్తుతం ఆ సంస్థతోపాటు, అధికార పార్టీ నేతల్లో కలకలం సృష్టిస్తోంది.

రంగంలోకి ఇంటెలిజెన్స్

రుణాల పేరుతో రూ.50కోట్ల గోల్‌మాల్ వ్యవహారంపై ఇంటెలిజెన్స్ అధికారులు ఆరా తీస్తున్నారు. వారు మంగళవారం ఒంగోలులోని మెప్మా జిల్లా కార్యాలయంలో పీడీ రవికుమార్‌ను కలిసి పొదుపు రుణాల మంజూరు, రికవరీలు, ఇతరత్రా రుణాల విషయంలో విధివిధానాలను అడిగి తెలుసుకున్నట్లు సమాచారం. అంతేకాకుండా రూ.కోట్ల రుణాలు బ్యాంకుల నుంచి ఎలా పొందారు? అందుకు బాధ్యులు ఎవరు? వారి విధులు ఏమిటి? అధికారుల భాగస్వామ్యం తదితర అంశాలను క్షుణ్ణంగా అడిగినట్లు సమాచారం. దీంతో మెప్మా పీడీ పలువురు పీవోలను పిలిచి ఇంటెలిజెన్స్ అధికారులు అడిగిన సమాచారం ఇవ్వాలని ఆదేశించినట్లు తెలిసింది. ఇదిలా ఉండగా పొదుపు రుణాలకు సంబంధించి కీలక బాధ్యత వహించే లీడ్ బ్యాంకు మేనేజరు మెప్మా కార్యాలయానికి వెళ్లి ఇప్పటి వరకూ డివిజన్‌ల వారీ ఎన్ని గ్రూపులకు రుణాలు ఇచ్చారు? సభ్యులు ఎంతమంది? అన్న వివరాలను సేకరించినట్లు తెలిసింది. దీంతో మెప్మా కార్యాలయంలో ఉద్యోగుల్లో ఆందోళన మొదలైంది. మరోవైపు ఆర్పీలు, సీవోలు కలవరపడుతున్నారు.

తప్పించుకునేందుకు అడ్డదారులు

పట్టణ పొదుపు మహిళలకు ఇటీవల ప్రభుత్వం విరివిగా రుణాలు మంజూరు చేయడంతోపాటు, ఆయా బ్యాంకర్లు కూడా రూ.లక్షల్లో రుణాలు ఇచ్చేందుకు వెనుకాడడం లేదు. దీంతో కొందరు ఆర్పీలు తమ చేతివాటం చూపారు. పలువురు పొదుపు సభ్యుల ఆధార్ కార్డులను ఆధారంగా చేసుకుని నకిలీ గ్రూపులు తయారు చేసి రూ.కోట్లు దండుకున్నారు. ఈ వ్యవహారంలో కొందరు వైసీపీ శ్రేణుల భాగస్వామ్యం కూడా ఉండటంతో వారిలో వణుకు మొదలైంది. ఎవరికి వారే భుజాలు తడుముకుంటూ స్కాం నుంచి తప్పించుకునే మార్గాలను అన్వేషిస్తున్నారు. కొందరు అవినీతిని కప్పి పుచ్చుకునేందుకు ఇప్పటికే అడ్డదార్లు వెతుకుతున్నారు. మరి కొందరు రాజకీయ నాయకుల వద్దకు పరుగులు పెట్టి తమను గట్టెక్కించాలని వేడుకుంటున్నారు.

మెప్మా అధికారుల మౌనం

మెప్మాలో నకిలీ పొదుపు సంఘాల పేరుతో భారీగా రుణాలు పొందడం గత కొద్ది నెలలుగా సాగింది. ఇదేమీ అధికారులకు తెలియకుండా జరగలేదన్న అనుమానాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికీ దీనిపై ఎలాంటి విచారణ కానీ, సిబ్బందికి హెచ్చరికలు కానీ చేయకపోవడం వెనుక ఆంతర్యం ఏమిటి? అని పలువురు ప్రశ్నిస్తున్నారు. మెప్మా జిల్లా స్థాయి అధికారుల నుంచి క్షేత్రస్థాయి ఉద్యోగుల వరకు అక్రమార్కుల నుంచి భారీగా ముడుపులు ముట్టాయని పలువురు ఆరోపిస్తున్నారు. అధికారులకు కూడా ఇందులో భాగస్వామ్యం ఉంది అనడానికి వారి మౌనమే సమాధానమని అంటున్నారు.

బాలినేనికి చిత్తశుద్ధి ఉంటే సిట్‌తో విచారణ చేయించాలి

టీడీపీ నాయకుల డిమాండ్

మెప్మాలో జరిగిన రూ.కోట్ల కుంభకోణంపై ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డికి చిత్తశుద్ధి ఉంటే సిట్‌తో విచారణ చేయించాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గతంలో ఒంగోలులో జరిగిన భూకబ్జాలపై తానే సిట్ వేయించానని, తాను ఎలాంటి అవినీతికి పాల్పడలేదని పదేపదే చెప్పుకొంటున్న బాలినేని.. ఇప్పుడు జరిగిన రుణాల స్వాహాపై తన నీతిని నిరూపించుకోవాలన్నారు. బోగస్ గ్రూపుల పేరుతో రూ.కోట్లు బొక్కేసిన వ్యవహారంలో వైసీపీ నేతల భాగస్వామ్యంపై ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. విలేకరుల సమావేశంలో పార్టీ నాయకులు ఎద్దుశశికాంత్ భూషణ్, కామేపల్లి శ్రీనివాసరావు, షేక్ కపిల్ బాషా, పి.వెంకటేశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్‌లను అడ్డుకున్న పోలీసులు

- చలో అసెంబ్లీకి వెళ్లకుండా కట్టడి
- 60 మందికిపైగా గృహ నిర్బంధం
- మార్టూరు టోల్‌గేట్ వద్ద అదుపులోకి పలువురు
- జిల్లా వ్యాప్తంగా సంఘ బాధ్యులపై నిఘా

ఒంగోలు (కలెక్టరేట్), ఫిబ్రవరి 6 : సమస్యల పరిష్కారం కోసం సర్పంచ్‌లు చేపట్టిన చలో అసెంబ్లీకి వారు వెళ్లకుండా అడుగడుగునా పోలీసులు అడ్డుకున్నారు. ఎక్కడికక్కడ కట్టడి చేశారు. ముందస్తుగా సోమవారమే 60 మందికిపైగా సర్పంచ్‌లకు నోటీసులు ఇచ్చి గృహనిర్బంధంలో ఉంచారు. బస్టాండ్‌లు, రైల్వే స్టేషన్‌లలో నిఘా ఉంచారు. ఆర్టీసీ బస్సుల్లో విజయవాడ వెళ్తున్న కొందరిని మార్టూరు సమీపంలోని టోల్‌గేట్ వద్ద అదుపులోకి తీసుకుని వివిధ స్టేషన్‌లకు తరలించారు.

వైసీపీ ప్రభుత్వంలో పంచాయతీలు నిర్వీర్యం

రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామ సచివాయాలను ఏర్పాటు చేసి పంచాయతీలను నిర్వీర్యం చేసింది. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే ఆర్థిక సంఘం నిధులను కూడా రాష్ట్ర ప్రభుత్వం స్వాహా చేస్తోంది. పంచాయతీల్లో చిల్లిగవ్వ కూడా లేక చేసిన పనులకు బిల్లులు కూడా చెల్లించలేని దుస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో గత కొంతకాలం నుంచి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను నిరసిస్తూ ఏపీ పంచాయతీరాజ్ చాంబర్, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘంతోపాటు టీడీపీ, జనసేన, బీజేపీల ఆధ్వర్యంలో వివిధ రూపాల్లో ఆందోళనలు చేపట్టారు. అయినా ప్రభుత్వం స్పందించకపోగా ఉన్న అధికారాలను హరించేవిధంగా వ్యవహరిస్తోంది.

సర్పంచ్‌ల గృహ నిర్బంధం

కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన రూ.8,629 కోట్ల ఆర్థిక సంఘం నిధులను పంచాయతీల ఖాతాల్లో జమ చేయాలని, గ్రామ సచివాలయాలు, వలంటీర్లు పంచాయతీల ఆధీనంలోనే పనిచేయాలని, ఉపాధి హామీ నిధులను పంచాయతీలకు ఇచ్చి సర్పంచ్‌ల ద్వారానే ఖర్చు చేయాలని, విద్యుత్ బిల్లులను ప్రభుత్వమే చెల్లించాలని తదితర మొత్తం 15 డిమాండ్లతో పంచాయతీరాజ్ చాంబర్, సర్పంచ్‌ల సంఘం సయుక్తంగా మంగళవారం చలో అసెంబ్లీకి పిలుపునిచ్చాయి. ఆ కార్యక్రమానికి జిల్లా నుంచి సర్పంచ్‌లు తరలివెళ్లకుండా పోలీసుల ద్వారా ప్రభుత్వం అడుగడగునా అడ్డంకులను సృష్టించింది. జిల్లావ్యాప్తంగా సోమవారమే 60 మందికి పైగా సర్పంచ్‌లకు పోలీసులు నోటీసులు ఇచ్చారు. వారిని గృహ నిర్బంధంలో ఉంచారు. ఇంకోవైపు సోమవారం అర్ధరాత్రి నుంచి జిల్లా సరిహద్దుతోపాటు బస్టాండ్లు, రైల్వే స్టేషన్‌లలో తనిఖీలు చేపట్టారు. సర్పంచ్‌ల సంఘ ప్రతినిధులపై నిఘా ఉంచారు. ఆర్టీసీ బస్సుల్లో విజయవాడకు వెళ్తున్న కొందరు సర్పంచ్‌లను మార్టూరు సమీపంలోని టోల్‌గేట్ వద్ద అదుపులోకి తీసుకొని వారిని సంబంధిత మండలాల పోలీసు స్టేషన్లకు తరలించినట్లు సమాచారం.



పోలీస్ స్టేషన్‌లో ఉన్న సర్పంచ్‌లు

ఘనంగా ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ

దొనకొండ, ఫిబ్రవరి 6 : దొనకొండలోని ఒబ్బాపురం ఎస్సీ కాలనీలో తెలుగు యువత నాయకులు కుందుర్తి లక్ష్మణ్ ఆధ్వర్యంలో తెలుగు యువత ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహాన్ని మంగళవారం రాత్రి ఘనంగా ఆవిష్కరించారు. టీడీపీ చీరాల ఇన్‌చార్జి ఎంఎం కొండయ్య, దర్శి నియోజకవర్గ టీడీపీ పరిశీలకుడు నాదెండ్ల బ్రహ్మంచౌదరి, దర్శి నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, మం డల అధ్యక్షుడు నాగులపాటి శివకోటేశ్వరరావు విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఒబ్బాపురం ఎస్సీ కాలనీలో తెలుగు యువత నేతృత్వంలో మహనీయుడు ఎన్టీఆ ర్ విగ్రహ ఏర్పాటు ఎంతో అభినందనీయమని నిర్వాహకులైన యువతను వారు అభినందించారు. ఎన్టీఆ ర్ గొప్పతనాన్ని, తెలుగు ప్ర జలకు ఆయన చేసిన సేవలను, సినీ, రాజకీయ రంగాలలో ఆయన సాధించిన గొప్ప విజయాలను ఈ సందర్భంగా వక్తలు గుర్తు చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వల్లపునేని వెంకటస్వామి, త్రుంగారపు నాగసుబ్బారె డ్డి, సుబ్బారావు, సుబ్బారెడ్డి, షేక్ తోహీద్, విప్పర్ల ల క్ష్మీరావు, పత్తి వెంకటేశ్వర్లు, యరగొర్ల బసవయ్య, మన్నెం గాలెయ్య, కమ్మా వెంకటనారాయణ, దుగ్గెంపూడి చెంచయ్య, పెమ్మసాని లక్ష్మీనారాయణ, యగ్గోని యల్లారెడ్డి, బండ్లా వెంకటనారాయణ, నల్లూరి శ్రీనివాసరావు, పోతిపోగు చెన్నయ్య పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షలకు 70 కేంద్రాలు

కేజీబీవీల్లో ఉన్న 10 సెంటర్లు రద్దు

ఒంగోలు (విద్య), ఫిబ్రవరి 6 : జిల్లాలో మార్చిలో జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణకు జిల్లా విద్యాశాఖ ప్రతిపాదించిన 70 కేంద్రాలకు ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ ఆమోదం తెలిపారు. గత ఏడాది జిల్లాలో 80 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. ఈ ఏడాది కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లోని పది కేంద్రాలను రద్దు చేశారు. వీటిలో కురిచేడు, దొనకొండ, ముండ్లమూరు, పీసీపల్లి, వెలిగండ్ల, మద్రిపూడి, పెద్దారవీడు, దోర్నాల, పుల్లలచెరువు, త్రిపురాంతకంలోని కేజీబీవీలు ఉన్నాయి. కస్తూర్బా గాంధీ విద్యాలయాల్లో విద్యార్థినులకు తరగతి గదులు, వసతి గృహం ఒకే భవనంలో నడుస్తున్నాయి. అక్కడ పరీక్షలు జరిగే సమయంలో 6నుంచి9 తరగతుల విద్యార్థులు ఆ భవనంలోని వసతి గృహ గదుల్లోనే ఉండాల్సి వస్తోంది. ఇది పరీక్షలు రాసే విద్యార్థులకు అసౌకర్యంగా ఉంటోంది. దీంతో ఆ కేంద్రాలను రద్దు చేసి విద్యార్థులను ఇతర పాఠశాలల్లోని కేంద్రాల్లో సర్దుబాటు చేశారు.


29,449 మంది విద్యార్థులు

జిల్లాలోని 602 ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో చదువుతున్న 29,449 మంది విద్యార్థులు పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరుకానున్నారు. వీరిలో బాలురు 14,800 మంది, బాలికలు 14,649 మంది ఉన్నారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు సమర్థులైన హెచ్‌ఎంలు, స్కూలు అసిస్టెంట్లను ఆయా కేంద్రాల చీఫ్‌లు, డిపార్ట్‌మెంట్ అధికారులుగా విద్యాశాఖ అధికారులు నియమిస్తున్నారు.

పర్చూరుపై మల్లగుల్లాలు

- మద్దిశెట్టి, రవిశంకర్‌తో సీఎంవో అధికారుల చర్చలు





ఆంధ్రజ్యోతి, ఒంగోలు

ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని పర్చూరు అసెంబ్లీ వైసీపీ ఇన్‌చార్జి వ్యవహారంపై ఆపార్టీ అధిష్ఠానం మ ల్లగుల్లాలు పడుతోంది. ప్రస్తుత ఇన్‌చార్జి ఆమంచి కృష్ణమోహన్‌తో సోమవారం మంతనాలు జరిపిన ము ఖ్యనేతలు మంగళవారం దర్శి ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్, ఒంగోలుకు చెందిన వ్యాపారవేత్త రవిశం కర్‌లను పిలిచి మాట్లాడారు. పర్చూరు ఇన్‌చార్జిగా ఉన్న ఆమంచి కృష్ణమోహన్ అక్కడి నుంచి పోటీకి సిద్ధం గాలేరన్న సమాచారానికి తోడు, ఆయన్ను ఆపార్టీ శ్రేణులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్న నేపథ్యంలో ప్రత్యామ్నా యం కోసం అధిష్ఠానం పావులు కదిపిన విషయం విదితమే. సోమవారం ఆమంచితో అధిష్ఠానంలోని ముఖ్య నాయకులతోపాటు సీఎం కూడా మాట్లాడారు. అయినా ప్రత్యామ్నాయ అభ్యర్థి కోసం మంగళవారం కూడా ప్రయత్నాలు కొనసాగించడంతో ఆమంచిని పర్చూరు నుంచి తప్పించటం కానీ, ఆయన పోటీచేయనని చెప్పడం కానీ జరిగిందన్న నమ్మకం ఆపార్టీ శ్రేణుల్లో బలపడిపోయింది.

కాపు సామాజికవర్గం వారినే రంగంలోకి దించాలని వ్యూహం

కమ్మ సామాజికవర్గం ఓటర్లు అధికంగా ఉన్న పర్చూరు నియోజకవర్గం నుంచి కాపు సామాజికవర్గానికి చెందిన వ్యక్తిని రంగంలోకి దింపాలనేది వైసీపీ వ్యూహం. అందుకే సీఎంతో తాను పోటీచేస్తానని చెప్పిన గొట్టిపాటి భరత్‌ను, పోటీకి సిద్ధంగా ఉన్న మరో మాజీ ఇన్‌చార్జి రామనాథంబాబును పక్కనపెట్టి కాపు సామాజికవర్గం వారికోసం అన్వేషిస్తున్నారు. దర్శి ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్‌ను సిటింగ్ స్థానం నుంచి తప్పించి మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డికి అవకాశం ఇచ్చారు. దీంతో అసంతృప్తితో ఉన్న మద్దిశెట్టిని పర్చూరు నుంచి పోటీచేయమని గతంలో కోరగా ఆయన తిరస్కరించారు. తిరిగి మంగళవారం సజ్జలతో పాటు సీఎంవో ముఖ్య కార్యదర్శి ధనుంజయరెడ్డి కూడా ఆయనతో మాట్లాడినట్లు తెలిసింది. మరోసారి ఆ లోచించండి పర్చూరు నుంచి మీరు పోటీచేస్తే బాగుంటుందని చెప్పినట్లు సమాచారం. ఒంగోలు నుంచి కం ది రవిశంకర్ కూడా సీఎంవో నుంచి పిలుపు రావడంతో వెళ్లారు. ఆయన ఆలస్యంగా అక్కడికి చేరుకోవడంతో అప్పటికే బుధవారం నాటి అసెంబ్లీ సమావేశాలు, కేబినేట్ సమావేశానికి సంబంధించిన పనుల్లో ని మగ్నమైన అధిష్ఠానంలోని నాయకులు, సీఎంవో అధికారులు బుధవారం సాయంత్రం కానీ గురువారం కానీ మీరు రావాల్సి ఉంటుంది చెప్పినట్లు తెలిసింది. గతంలా చెప్పిన విధంగా పర్చూరు నుంచి పోటీచేసే అంశంపై మరోసారి ఆలోచించాలని సూచించినట్లు తెలిసింది. అయితే సోమవారం సీఎంను కలిసిన ఆమంచి కృష్ణమోహన్.. చీరాల నుంచి ఎమ్మెల్యే బలరాం లేక ఆయన కుమారుడు వెంకటేష్ కాకుండా వేరేవారికి అవకాశం ఇవ్వాలన్న తన డిమాండ్‌ను మరోసారి ప్రస్తావించేందుకే పరిమితమైనట్లు భావిస్తున్నారు. అందువల్లనే పర్చూరు విషయంలో కూడా ఆయన కోసం వెంపర్లాడకుండా ప్రత్యామ్నాయ అభ్యర్థి కోసం పరిశీలించాలని సీఎం చెప్పిన ఆదేశాలతోనే మంగళవారం ఈ ప్రయత్నాలు జరిగాయని భావిస్తున్నారు.

రుణ మాఫీ చేయాలని రేపు ధర్నా

పామూరు, ఫిబ్రవరి 6 : రైతుల రుణాలను మాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో 8వ తేదీన నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా నాయకుడు పీ రఘునాథరెడ్డి కోరారు. జీవైఆర్ భవన్‌లో మంగళవారం సమావేశం నిర్వహించారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కే ప్రభాకర్, ఏఐటీయూసీ నాయకులు మహేష్, ప్రసాద్ పాల్గొన్నారు.



సతాయిస్తున్న సర్వర్!

- రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో పనులకు ఆటంకం
- క్రయవిక్రయదారుల పడిగాపులు
- వారం రోజులుగా ఇదే పరిస్థితి

ఒంగోలు (క్రైం), ఫిబ్రవరి 6 : రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో సర్వర్ సతాయిస్తోంది. పదేపదే డౌన్ అవుతుండటంతో పనులకు ఆటంకం ఏర్పడుతోంది. వారం రోజుల నుంచి ఇదే పరిస్థితి నెలకొన్నప్పటికీ చక్కదిద్దేందుకు అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. దీంతో ఆస్తుల రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన క్రయవిక్రయదారులు కార్యాలయాల వద్ద పడిగాపులు కాయాల్సిన దుస్థితి నెలకొంది. ప్రస్తుతం గ్రామ, వార్డు సచివాలయాల్లో జగనన్న గృహాల రిజిస్ట్రేషన్ జరుగుతోంది. దీంతో సర్వర్‌పై ఒత్తిడి పెరిగి నెమ్మదిస్తోంది. గత నెల 30 నుంచి ఇదే పరిస్థితి నెలకొంది. దీంతో భూముల క్రయవిక్రయదారులు, ఈసీలు, ఇతరత్రా రిజిస్ట్రేషన్ సేవలు అవసరమైన వారు ఇక్కట్లు పడుతున్నారు. రిజిస్ట్రేషన్‌లు కూడా రాత్రి పొద్దుపోయే వరకూ చేస్తున్నారు. అప్పటి వరకూ క్రయవిక్రయదారులు వేచి ఉండాల్సి వస్తోంది. సర్వర్ బాగా పనిచేస్తే ఒక్కో డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్‌కు 15 నిమిషాలు పడుతుంది. ఒంగోలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ రోజుకు సగటున 40 నుంచి 50 దస్తావేజులు రిజిస్ట్రేషన్ చేస్తుంటారు. కానీ సర్వర్ వచ్చీపోతుండటంతో ఒక్కో డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ గంటల సమయం పడుతోంది. దీంతో రాత్రి పొద్దుపోయే వరకూ అధికారులు రిజిస్ట్రేషన్‌లు చేస్తున్నారు.



పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన సీఐ

తాళ్లూరు, ఫిబ్రవరి 6 : పోలీస్ స్టేషన్‌కు దర్శి నూతన సీఐ ఎస్కే షమీఉల్లా మంగళవారం సందర్శించారు. ఎన్నికల సందర్భంగా అప్రమత్తంగా ఉం డాలని, రౌడీ షీటర్ల కదలికలను గమనిస్తుండాలని, గ్రామాల్లో రాజకీయ వివాదాలు తలెత్త కుండా చర్య లు చేపట్టాలని ఎస్సై వీ రమణయ్యకు సూచించారు. కేసుల పురోగతిపై చర్చించారు. రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్సై రమణయ్య, ఏఎస్సై మోహన్‌రావు ఉన్నారు.

వైసీపీలో బహిర్గతమైన వర్గ విభేదాలు

- పలు సొసైటీలలో కొత్త కమిటీల నియామకం
- బాచిన కృష్ణచైతన్య వర్గానికి చెక్
- హనిమిరెడ్డికి మద్దతు తెలిపితేనే పాతవి పొడిగింపు.. లేదంటే మార్పే!
- ఆ పార్టీకి దూరం కానున్న పదవులు కోల్పోయిన నేతలు



హనిమిరెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న నాగులపాడు సొసైటీ నూతన కమిటీ సభ్యులు

అద్దంకి, ఫిబ్రవరి 6: వైసీపీ అద్దంకి నియోజకవర్గంలో వర్గ విభేదాలు మరోసారి బహిర్గతం అయ్యాయి. నియోజకవర్గంలో పలు సొసైటీల కమిటీలు(త్రీమెన్ కమిటీ) గడువు జనవరి 31తో ముగియటంతో వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా నియమితులైన హనిమిరెడ్డి తనదైన మార్క్ చూపించే విధంగా కొన్ని కమిటీలకు కొత్త పేర్లతో ప్రతిపాదనలు పంపారు. ఈక్రమంలో కొత్త కమిటీల నియామకం జరిగాయి. దీంతో ఇప్పటివరకు ఆ పదవులలో ఉన్న వైసీపీ నేతలు అదే పార్టీలో బాచిన కృష్ణచైతన్య వర్గంగా ఉన్నప్పటికీ, ఇక పార్టీకి దూరమయ్యే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తుంది.

ప్రధానంగా అద్దంకి పట్టణం కేంద్రంగా ఉన్న నాగులపాడు సొసైటీ అధ్యక్షుడిగా సందిరెడ్డి రమేష్ 15 సంవత్సరాలపాటు పనిచేశారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకివచ్చిన తరువాత బొమ్మనంపాడుకు చెందిన నాయుడు శ్రీనివాసరావును నియమించగా, మరలా జరిగిన నియామకాలలో సందిరెడ్డి రమేష్ భార్య భారతీ చైర్పర్సన్‌గా నియమితులయ్యారు. ఇప్పుడుజరిగిన మార్పులలో మానికొండ నాగరాజును నియమించారు. గోవాడ సొసైటీకి మాదాల రామకృష్ణను మార్పుచేసి మానం శ్రీనివాసరావును నియమించారు. పంగులూరు మండలం జాగర్లమూడివారిపాలెం సొసైటీకి కె.రాజ్యలక్ష్మిని మార్పుచేసి గతంలో సొసైటీ అధ్యక్షుడిగా పనిచేసిన జాగర్లమూడి యలమందరావు తల్లి వెంకటరత్నంను నియమించారు. నూజెళ్ళపల్లి సొసైటీ అధ్యక్షుడు కొండ్రగుంట హరిబాబు స్థానంలో ధూళిపాళ్ళ హరిబాబును నియమించారు. జన కవరం(పంగులూరు) సొసైటీకి రావూరి రంగారావు స్థానంలో తలపనేని సుధాకర్, కొరిశపాడు మండలం రావినూతలలో కంచర్ల శ్రీనివాసరావు స్థానంలో కారుసాల బసవేశ్వరరావు, తిమ్మనపాలెం సొసైటీలో అన్నెం శ్రీధర్‌రెడ్డి స్థానంలో పోతుల వెంకటస్వామిని నియమించారు. గత కమిటీలో పోతుల వెంకటస్వామి సభ్యుడిగా, అన్నెం శ్రీధర్‌రెడ్డి చైర్మన్‌గా ఉండగా, ప్రస్తుతం శ్రీధర్‌రెడ్డి చైర్మన్‌గా, వెంకటస్వామి సభ్యుడిగా ఉండటం విశేషం, వీరిద్దరి మధ్య అవగాహనతో జరిగినట్లు తెలుస్తుంది. మరో సభ్యుడిగా సాధినేని మస్తాన్‌రావును తొలగించి ఆ స్థానంలో మామిళ్ళపల్లి రామచంద్రరావును నియమించారు. దైవాలరావూరు సొసైటీలో జి.ఆనందబాబు స్థానంలో తానికొండ నరసింహారావును నియమించారు.

అయితే, వీటిలో కొద్దిమంది స్వచ్ఛందంగా తప్పుకున్నప్పటికీ అత్యధికశాతం మాత్రం చైతన్య వర్గంగా ముద్రపడిన వారిగా గుర్తించి మార్పు చేసినట్లు తెలుస్తుంది. ఈ క్రమంలో పదవులు దక్కని నేతలలో అత్యధికశాతం మంది వైసీపీకి దూరమయ్యే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తుంది. ఇప్పటివరకు పదవులు వస్తే వైసీపీలోనే కొనసాగాలని, లేనిపక్షంలో తమకు అన్యాయం చేశారని చెప్పి బయటకు వెళ్ళాలన్న ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. పార్టీ మారాలని వేచి చూస్తున్న నేతలకు పదవులు రాకపోవటాన్ని సాకుగా చూపించి వైసీపీకి దూరమయ్యే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తుంది. ఇలా పదవుల పంపకంలో మరోసారి వైసీపీలోని వర్గ విభేదాలు బహిర్గతమయ్యాయని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

సంతమాగులూరు సొసైటీ విషయంలో అనుకున్నదొకటి అయినదొకటిగా జరిగినట్లు తెలుస్తుంది. ఈ మండలంలో చోటుచేసుకున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో సంతమాగులూరు సొసైటీకి తాము పంపిన పేర్లను మార్పుచేసి కొత్త పేర్లతో కమిటీ వేయించాలని వైసీపీ నేతలు తీవ్రప్రయత్నాలు చేసినప్పటికీ అప్పటికే జాబితా పూర్తి కావటంతో మార్పు సాధ్యం కాదని ఉన్నతాధికారులు చెప్పినట్లు తెలుస్తుంది.

దాతల సహాయ సహకారాలు మరువలేనివి

చినగంజాం, ఫిబ్రవరి 6: ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు దాతలు అందిస్తున్న సహాయ సహకారాలు మరవలేనివని ప్రధానోపాధ్యాయుడు కుర్రా రామారావు అన్నారు. కడవకుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల పోషకాహారానికి పలువురు దాతలు సాయం అందిస్తున్నట్లు ఆయన చెప్పారు. మార్చి 18 నుంచి జరగనున్న పదో తరగతి పరీక్షలకు హాజరుకానున్న విద్యార్థులకు అదనపు తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఈ సందర్భంగా విద్యార్థులకు పోషకాహారం అందించేందుకు సోపిరాల గ్రామానికి చెందిన సిద్దం రాము ఆయన కుమారుడు సాయిపవన్ జ్ఞాపకార్థం రూ.ఐదు వేలు, కడవకుదురు గ్రామానికి చెందిన చీమకుర్తి కృష్ణమూర్తి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు ప్రభాకర్ రూ.ఐదు వేలు అందిచినట్లు తెలిపారు. విద్యార్థుల పోషకాహారానికి సాయం అందిస్తున్న దాతలకు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు పర్చూరులో 'స్పందన'

పర్చూరు, ఫిబ్రవరి 6: పర్చూరులోని శ్రీఅద్దంకి నాంచారమ్మ కల్యాణ మండపంలో బుధవారం మధ్యాహ్నం 2గంటలకు జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా హాజరుకానున్నట్లు రెవెన్యూ అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

హైకోర్టు ఆదేశాలతో వెనక్కి తగ్గిన పోలీసులు

- 41ఏ నోటీసులు ఇవ్వాలి
- ఎమ్మెల్యే ఏలూరి వివరణ కూడా తీసుకోవాలని సూచన



పర్చూరు, ఫిబ్రవరి 6: తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుపై పెట్టిన అక్రమ కేసులో హైకోర్టు ఏపీ పోలీసులకు చివాట్లు పెట్టింది. ఏడేళ్ల లోపు జైలు శిక్షకు వీలున్న కేసులలో సీఆర్‌పీసీ సెక్షన్ 41ఏ నోటీసులు ఇవ్వకుండా అరెస్టు చేయటానికి ప్రయత్నించటం ఏమిటని మండిపడింది. మంగళవారం రెండోరోజు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పిటీషన్‌పై హైకోర్టు విచారణ జరిపింది. కోర్టు ఆగ్రహం వ్యక్తం చేయటంతో 41ఏ నోటీసు నిబంధనలు అనుసరిస్తామని ప్రభుత్వం తరుపున న్యాయవాది కోర్టుకు హామీ ఇచ్చారు. ఈమేరకు ఏపీ పోలీసులు మెమో దాఖలు చేశారు. ఏపీ పోలీసుల మెమోలోని వివరాలను హైకోర్టు నమోదు చేసింది. నోటీసులు ఇచ్చి ఎమ్మెల్యే ఏలూరిని వివరణ తీసుకోవాలని పోలీసులకు హైకోర్టు సూచించింది.

పోలీసులు అరెస్టు చేస్తారని ఎంపీ, ఎమ్మెల్యేలే భయపడుతుంటే సామాన్యుల పరిస్థితి ఏమిటని హైకోర్టు ఘాటుగా వ్యాఖ్యానించింది. పోలీసుల తీరుపై ఎమ్మెల్యే ఏలూరి ముందస్తు మధ్యంతర బెయిల్ మంజూరు చేయాలని సీఆర్‌పీసీ 41ఏ నిబంధనలు పాటించేలా ఆదేశాలు ఇవ్వాలని రెండు అనుబంధ పిటిషన్‌లు దాఖలు చేశారు. ఈ నేపథ్యంలో హైకోర్టు స్పందించింది. దీంతో రెండో రోజు 41ఏ నోటీసులు ఇస్తామని పోలీసులు కోర్టుకు విన్నవించారు.

కేసు ఇలా...

గ్రానైట్ ఫ్యాక్టరీలో అనుమతులు లేకుండా వైసీపీ నేతలతో తనిఖీలు చేస్తున్న మైనింగ్ అధికారులను ఎమ్మెల్యే ఏలూరి ప్రశ్నించారు. కర్రలు, కారం పొడులతో తనిఖీలకు రావటం ఏమిటని, నిబంధనలు తుంగలో తొక్కి, ఇలా వైసీపీ నేతలతో వచ్చి దురుసుగా ప్రవర్తించడాన్ని ఆయన తప్పు పట్టారు. ఈనేపథ్యంలో రాజకీయ కక్షలో భాగంగా గ్రానైట్ ఫ్యాక్టరీ యజమానులు, తెలుగుదేశం పార్టీ సానుభూతిపరులపై అక్రమ కేసులు బనాయించారు. ఎమ్మెల్యే ఏలూరి అనుచరులతోపాటు, గ్రానైట్ యజమానులను అరెస్టు చేసి జైలుకు పంపారు. ఈకేసులో ఎమ్మెల్యే ఏలూరిని ఏ8గా చేర్చి అరెస్టు చేసేందుకు పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారు. దీంతో ఎమ్మెల్యే ఏలూరి కోర్టును ఆశ్రయించారు.

వెనక్కి తగ్గిన పోలీసులు

ఎమ్మెల్యే ఏలూరిని అరెస్టు చేయడంలో పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించటం, 41 ఏ నోటీసులు ఇవ్వకుండా తదుపరి చర్యలు చేపట్టడాన్ని కోర్టు తప్పుపట్టింది. నిబంధనలు ప్రకారం నడుచుకోవాని 41ఏ నోటీసులు ఇచ్చి వివరణ తీసుకోవాలని సూచించింది. ఇప్పటికే ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా ఆరుగురును అరెస్టు చేసి జైలుకు పంపడాన్ని హైకోర్టు దృష్టికి తీసుకు వచ్చారు. దీంతో కోర్టు ఈకేసును తీవ్రంగా పరిగణించింది.

కేసులు వేసినందుకే వేధింపులు

పర్చూరు నియోజకవర్గంలో వైసీపీ నేతలు నిబంధనలకు విరుద్ధంగా అర్హులైన వేలాది మంది ఓట్లు తొలగించేందుకు ఫాం 7లు దరఖాస్తు చేశారు. దీనిలో ప్రభుత్వ యంత్రాంగం వైసీపీ నేతలకు అనుకూలంగా వ్యవహరించడం నిబంధనలు తుంగలో తొక్కడంతో పూర్తి సాక్ష్యాధారాలతో ఎమ్మెల్యే ఏలూరి హైకోర్టును ఆశ్రయించారు. దీంతో హైకోర్టు పలువురు పోలీసు ఉన్నతాధికారులపై చర్యలు చేపట్టింది.

ఈనేపథ్యంలో కొందరు ప్రభుత్వ పెద్దలు, అధికార యంత్రాంగం, వైసీపీ నేతలు కక్షపూరితంగా అక్రమ కేసులు పెట్టి అరెస్టు చేసేందుకు పావులు కదిపారు. కోర్టు తీర్పుతో యంత్రాంగం అప్రమత్తమైంది. నిబంధనల ప్రకారం నడుచుకుంటామని కోర్టుకు హామీ ఇచ్చారు.



వెంకటాపురం వద్ద పొగతోటను పరిశీలిస్తున్న వెల్లంపల్లి పొగాకు వేలం కేంద్రం అధికారుల బృందం

నాణ్యమైన పొగాకును ఉత్పత్తి చేయాలి

అద్దంకి, ఫిబ్రవరి 6: రైతులు మెలకువలు పాటించి నాణ్యమైన పొగాకు ఉత్పత్తి చేయాలని వెల్లంపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రం నిర్వహణాధికారి ఎం.సత్యశ్రీనివాస్ అన్నారు. అద్దంకి, కొరిశపాడు మండలాలలోని వెంకటాపురం, బొడ్డువానిపాలెంలో ఒంగోలు పొగాకు బోర్డు ప్రాంతీయ కార్యాలయం ఫీల్డ్ ఫ్రెండ్ టీమ్ పొగాకు సాగు చేసిన పొలాలు, క్యూరింగ్ జరుగుతున్న తీరును పరిశీలించారు. రైతుల సమస్యలు తెలుసుకొని పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో తులసి, చలమయ్య, పలు కంపెనీల ప్రతినిధులు ప్రశాంత్, డీవీ రావు, రామాంజనేయులు, యు.శ్రీనివాసరావు, వెంకటాపురం సర్పంచ్ అంజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చలో బాపట్లను విజయవంతం చేయాలి

పర్చూరు, ఫిబ్రవరి 6: బాపట్లలో బుధవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆపార్టీ సీనియర్ నేత తోట శివనాగేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల కార్యక్రమానికి హాజరవుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా బారీస్థాయిలో రోడ్‌షో నిర్వహించనున్నట్లు తెలిపారు. పెద్ద సంఖ్యలో కాంగ్రెస్‌పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

వైద్య సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలి



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న కంటి వెలుగు రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ డాక్టర్ సునీల్

చినగంజాం, ఫిబ్రవరి 6: ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా పేద ప్రజలకు కల్పిస్తున్న వైద్య సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని కంటి వెలుగు రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ డాక్టర్ సునీల్ అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. మొదటి విడత ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా కాట్రాక్ట్ ఆపరేషన్లకి గుర్తించిన వారందరూ వెంటనే కంటి ఆపరేషన్లు చేయించుకోవాలని డాక్టర్ సునీల్ సూచించారు. ప్రభుత్వం కార్పొరేట్ హాస్పటిల్‌లో ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయిస్తున్నట్లు చెప్పారు. కొత్తపాలెం గ్రామంలో ఆయన ఇంటింటికి తిరిగి ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రభుత్వం కల్పిస్తున్న సదుపామాలపై అవగాహన కల్పించారు. పీహెచ్‌పీలో మొదటి విడత ఆరోగ్య సురక్ష పథకంపై వైద్యాధికారులు, వైద్య సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించి, కంటి ఆపరేషన్లు చేయించుకోవాల్సిన వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా ఆప్తమాలిక్ అధికారి భూషణం, పీహెచ్‌సీ వైద్యాధికారులు ఎస్.విజయభాస్కరరావు, పి.సాయిశ్రీచరణ్, సూపర్‌వైజర్లు చిరంజీవి, ఉల్దారాణి, ఎంఎస్‌వో సుబ్బారావు, ఎఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మణికేశ్వరం సొసైటీలో విద్యుత్ మోటార్ చోరీ

అద్దంకి, ఫిబ్రవరి 6: మండలంలోని మణికేశ్వరం సొసైటీ భవనం వద్ద విద్యుత్ మోటార్ చోరీకి గురైంది. సొసైటీ అధ్యక్షుడు సోమా శ్రీనివాసరెడ్డి కథనం మేరకు .. పునరావాస కాలనీలో ఉన్న సొసైటీ భవనం వద్ద ధాన్యం జల్లెడ పట్టేందుకు వినియోగించే విద్యుత్ మోటార్ చోరీకి గురైంది. సీసీ కెమెరాలు ఉన్నప్పటికీ దొంగ ముసుగు ధరించి ఉండటంతో గుర్తించే వీలులేకుండా పోయిందని తెలిపారు. ఈ విషయమై పోలీస్‌లకు ఫిర్యాదు చేసినట్లు శ్రీనివాసరెడ్డి తెలిపారు.

ఓట్ల తొలగింపునకు కలెక్టర్ అనుమతి తప్పనిసరి

- ఈఆర్వో వెంకటేశ్వర్లు



సమావేశంలో మాట్లాడుతున్న ఈఆర్వో వెంకటేశ్వర్లు

పర్చూరు, ఫిబ్రవరి 6: ఓట్ల జాబితా ప్రకటించిన తరువాత ఏఒక్క ఓటు తొలగించాలన్న కలెక్టర్ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని పర్చూరు నియోజకవర్గ ఓటర్ల నమోదు అధికారి కె.వెంకటేశ్వర్లు అన్నారు. పర్చూరు నియోజకవర్గ ఎన్నికల అధికారిగా బాధ్యతలు చేపట్టిన వెంకటేశ్వర్లు మంగళవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో వివిధ పార్టీల నాయకులు, సెక్టోరియల్ పోలీసు అధికారులతో విడివిడిగా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేవిధంగా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఓట్లు తొలగింపు విషయంలో మొత్తం నియోజకవర్గంలోని ఓట్లలో 0.1 శాతం దాటితే సీఈవో అనుమతి తీసుకోవాలన్నారు. పరిధికి లోబడి ఉన్న ఓట్ల తొలగింపునకు కలెక్టర్ అనుమతితో తొలగిస్తామన్నారు. పోలీసు అధికారులతో జరిగిన సమావేశంలో ఆయా మండలాల పరిధిలో సమస్యాత్మక గ్రామాల వివరాలు, పోలింగ్ బూత్‌ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి సెక్టోరియల్ అధికారి వారి పరిధిలోని పోలింగ్ బూత్‌లపై సమగ్ర సమాచారంతో ఉండాలన్నారు.

కార్యక్రమంలో ఆయా మండలాల రెవెన్యూ అధికారులు, పోలీసుల అధికారులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి వంద రోజులు పని కల్పించాలి

- డ్వామా పీడీ అర్జునరావు



ప్రజావేదికలో మాట్లాడుతున్న డ్వామా పీడీ అర్జునరావు

అద్దంకి టౌన్, ఫిబ్రవరి 6: ప్రతి కుటుంబానికి వంద రోజులు పని కల్పించాలని డ్వామా పీడీ బి.అర్జునరావు అన్నారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయం ఆవరణంలో మండలంలో జరిగిన ఉపాధి హామీ పనులపై ప్రజా వేదిక నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పనుల్లో వచ్చే చిన్న చిన్న పొరపాట్లు, తప్పులు మరల జరగకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. మండల స్థాయి అధికారులు పర్యవేక్షిస్తుండాలని అన్నారు. మండలంలోని గ్రామాలలో ఉపాధి హామీ పనులకు సంబంధించి ఏప్రిల్ 1, 2022 నుంచి మార్చి 31. 2023 వరకు జరిగిన పనులపై జనవరి 29 నుంచి ఫిబ్రవరి 5 వరకు 15వ విడత సామాజిక తనిఖీ నిర్వహించినట్టు అర్జునరావు చెప్పారు. మండలంలో 685 పనులను రూ.6.81 కోట్లతో చేయించనట్టు చెప్పారు. అలాగే, పంచాయతీ రాజ్‌కు సంబంధించి 27 పనులకు రూ.154 కోట్లు, ఆర్‌డబ్ల్యూఎస్‌కు సంబంధించి 7 పనులకు రూ.19 లక్షల పనులు చేసినట్టు తెలిపారు. ఆయా పనులకు సంబంధించి సోషల్ ఆడిట్ నివేధిక ఆధారంగా చర్చిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో డీవీవో శోభన్, ఎంపీడీవో సత్యనారాయణ, ఎస్‌ఆర్‌పీ ఆవులయ్య, ఏపీవో గాయత్రి లక్ష్మి పాల్గొన్నారు.

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి



మార్టూరులో పాదయాత్రకు స్వాగతం పలుకుతున్న రజక నాయకులు

మార్టూరు, ఫిబ్రవరి 6: రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని అనేకసార్లు పలు రాజకీయ పార్టీలకు అర్జీలు అందజేసినట్లు నేషనల్ దోబిసంగ్ అధ్యక్షుడు అన్నవరపు నాగమల్లేశ్వరరావు తెలిపారు. రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని కోరుతూ తిరుపతి నుంచి విజయవాడ వరకు పాదయాత్ర నిర్వహిస్తున్న రజక నాయకులకు మార్టూరులో పర్చూరు నియోజకవర్గ రజక సంఘం అధ్యక్షుడు పోలూరు సింగయ్య ఆధ్వర్యంలో మంగళవారం ఘనస్వాగతం పలికారు. ఈసందర్భంగా నాగమల్లేశ్వరారవు మాట్లాడుతూ ఏరాజకీయ పార్టీ కూడా చొరవ చూపించడంలేదన్నారు. రజకులను ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా, అభివృద్ధి చెందనీయకుండా వాళ్ల స్వప్రయోజనాలకు వాడుకుంటూ అన్యాయం చేస్తున్నారని అన్నారు. స్థానిక కూరగాయాల మార్కెట్ వద్ద నుంచి రాజుపాలెం డొంక వరకు సంఘం నాయకులు సంఘీభావ యాత్ర సాగించారు. కార్యక్రమంలో బాపట్ల బీసీ సంఘం నాయకులు రవికుమార్, అనిల్‌కుమార్, సాయిబాబా, పర్వతాలు, పాపారావు, వాడాల శ్రీనివాసరావు, పోతవ రం సుబ్బారావు, పోలూరు రాజు, భీమవరపు రాము, తాటివారిపాలెం ఉమ పాల్గొన్నారు.

కార్మికులకు ఇచ్చిన హామీలను అమలుచేయాలి

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 6: మున్సిపల్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులు చేపట్టిన సమ్మె కాలంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలుచేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తంగిరాల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. మంగళవారం అద్దంకి మున్సిపల్ కార్యాలయం ఎదుట జరిగిన మున్సిపల్ కార్మికుల ధర్నాలో ఆయన మాట్లాడారు. సమ్మె విరమణ సందర్భంగా అంగీకరించిన అంశాలపై ఇంతవరకు జీవోలు ఇవ్వలేదని చెప్పారు. ఈసందర్భంగా మున్సిపల్ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి పి.తిరుపతిరెడ్డి, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు పెనుబాక ఆదాం, గాలి బీష్మా, జ్యోతి వెంకట్రావు, దాసరి వీరయ్య, బత్తుల కృష్ణ, దాసరి అలివేలు, మాలెంపాటి అంజమ్మ, తదితరులు పాల్గొన్నారు.



మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు



డీటీవో సురేష్‌ను సన్మానిస్తున్న సెయింట్‌ఆన్స్ కళాశాల అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ రమణమూర్తి

హెల్మెట్ పెట్టుకోవాలి.. సీటు బెల్ట్ ధరించాలి

చీరాల, ఫిబ్రవరి 6: వాహనాలు నడిపే సమయంలో చోదకుల్లో ప్రధానంగా ద్విచక్ర వాహనచోదకులు హెల్మెట్, నాలుగు చక్రాల వాహన చోదకులు సీటు బెల్ట్‌ను తప్పకుండా ధరించాలని జిల్లా రవాణాశాఖ అధికారి ఆర్.సురేష్ చెప్పారు. రోడ్డు భద్రతా మాసోత్సవాలలో భాగంగా మంగళవారం సెయింట్ ఆన్స్ ఇంజనీరింగ్ కళాశాలలో అధ్యాపకులకు, సిబ్బందికి, కళాశాల బస్సు డ్రైవర్లకు, విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సురేష్ మాట్లాడుతూ వాహనాలు నడిపేటప్పుడు ఫోన్ మాట్లాడవద్దని చెప్పారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని చెప్పారు. ట్రాఫిక్ నియమ, నిబంధనలను తప్పకుండా పాటించాలని చెప్పారు. ముందుగా రోడ్డు భద్రతా ప్రతిజ్ఞ చేయించారు.

కార్యక్రమంలో కళాశాల అడ్మినిస్ట్రేటివ్ మేనేజరు ఆర్వీ రమణమూర్తి, ఎంవీఐలు బి.రామకృష్ణారెడ్డి, సీహెచ్ రాంబాబు, ఏఎంవీఐ బి.కిషోర్‌బాబు, ఎన్‌జీవో సాల్మన్ తదితరులు పాల్గొన్నారు.

క్విజ్ విజేత పెదగంజాం విద్యార్థులు

చినగంజాం, ఫిబ్రవరి 6: మండలంలోని పెదగంజాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు స్కూల్ కాంప్లెక్స్ స్థాయిలో జరిగిన క్విజ్ పోటీలలో ప్రథమ స్థానం సాధించినట్లు హెచ్ఎం దేవదత్తం తెలిపారు. కారంచేడు, వేటపాలెం, చీరాల, చినగంజాం మండలాల స్థాయిలో సాంఘికశాస్త్ర క్విజ్ పోటీలలో సీనియర్ విభాగంలో నలుగురు విద్యార్థులు ప్రథమ స్థానం సాధించినట్లు చెప్పారు. పాఠశాలలో మంగళవారం జరిగిన అభినందన సభలో ప్రథమ స్థాయిలో నిలిచిన ఆసోది ప్రశాంతి, యరమాల ఉమామహేశ్వరి(10వ తరగతి), మాచవరపు హర్షిత, మాచవరపు సంతోష్(9వ తరగతి), శిక్షణ ఇచ్చిన సాంఘికశాస్త్ర ఉపాధ్యాయులు డి.నారాయణరెడ్డి, కె.నాగరాజు, ఎ.సుబ్బరాజును హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ వి.ఉదయభాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో ప్రజాసమస్యలను పరిష్కరించాలి

పంగులూరు, ఫిబ్రవరి 6: మండల అధికార యంత్రాంగం సమన్వయంతో పనిచేసి ప్రజాసమస్యలు పరిష్కరించాలని ఎంపీపీ తేళ్ళ నాగమ్మ కోరారు. మంగళవారం జరిగిన పంగులూరు మండల సర్వసభ్య సమావేశానికి ఎంపీపీ తేళ్ళ నాగమ్మ అధ్యక్షత వహించారు. ఎంపీడీవో మ్యాత్యూబాబు మాట్లాడుతూ మార్చి నెలాఖరుకు గ్రామ పంచాయితీలలో నూరు శాతం పన్ను వసూలు చేయాలని కోరారు. గ్రామాల్లో పారిశుద్యం సక్రమంగా నిర్వహించి ప్రజారోగ్యం కాపాడే బాధ్యత అధికారులదేనని అన్నారు. 15వ ఆర్థిక సంఘం నిదులను జాగ్రత్తగా వినియోగించుకోవాలని సూచించారు. మండల సమావేశానికి పలువురు అధికారులు, గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు గైర్హాజరయ్యారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ రాంబాబు, పంచాయతీరాజ్ ఏఈ రామకుమార్, సీడీపీవో కృష్ణకుమారి పాల్గొన్నారు.

'నిరంతరం అందుబాటులో ఉంటా'

చీరాల, ఫిబ్రవరి 6: ప్రతిఒక్కరూ ఆనందంగా ఉండాలి.. అందులో మనం ఉండాలనే తలంపుతో అడుగులు ఉండాలని వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్ అన్నారు. స్థానిక శాంతినగర్‌లో నూతనంగా నిర్మించిన చర్చి పునఃప్రతిష్ఠ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావుతో కలసి వెంకటేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎప్పుడు ఏ అవసరం వచ్చినా తమవంతు సహకారం అందిస్తామన్నారు. నిరంతరం అందుబాటులో ఉంటూ అండగా ఉంటామని చెప్పారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు కలవకూరి యానాదిరావు, కంకణాల నాని, ప్రతాప్, జయకుమార్, కీర్తి వెంకట్రావు, బత్తుల అనిల్, షేక్ సుభానీ, కావూరి బాలకోటిరెడ్డి, పాస్టర్లు, సంఘపెద్దలు, సంఘస్థులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం

పంగులూరు, ఫిబ్రవరి 6: మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యమని వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనిమిరెడ్డి అన్నారు. మంగళవారం పంగులూరులో జరిగిన ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. 982 గ్రూపులకు రూ.7 కోట్ల 71 లక్షలు మంజూరుకాగా, సంబంధిత చెక్కును మండల మహిళా సమాఖ్య ప్రతినిధులకు హనిమిరెడ్డి అందచేశారు. కార్యక్రమంలో ఎంపీపీ తేళ్ళ నాగమ్మ, జడ్పీటీసీ రాయిణి ప్రమీల, ఎంపీడీవో మ్యాత్యూబాబు, సర్పంచ్ గుడిపూడి నాగేంద్రం, రవికుమార్, ఏపీఎం జ్యోతిప్రసాద్, కోటిరెడ్డి, జంపాని రవిబాబు, తదితరులు పాల్గొన్నారు.

సొసైటీలకు నూతన పాలకవర్గం

పంగులూరు, ఫిబ్రవరి 6: మండలంలోని మూడు పీఏసీఎస్‌లకు కొత్త పాలకవర్గ నియామకం చేశారు. చైర్మన్‌లతోపాటు సభ్యులను కొత్తవారిని నియమిస్తూ అధికారిక ఉత్తర్వులు వెలువడ్డాయి. జనకవరం పంగులూరు పీఏసీఎస్ చైర్మన్‌గా తలపనేని సుధాకర్, సభ్యులుగా బొల్లా పోలయ్య, కట్టా నాగేశ్వరరావు, జాగర్లమూడివారిపాలెం సొసైటీ చైర్మన్‌గా జాగర్లమూడి వెంకటరత్నం, సభ్యులుగా పూసల హనుమంతరావు, బండి ఓబుల్‌రెడ్డి నియమితులయ్యారు. నూజెళ్ళపల్లి పీఏసీఎస్ చైర్మన్‌గా ధూళిపాళ్ళ హరిబాబు, సభ్యులుగా మద్దినేని చలపతిరావు, విప్పర్ల రామారావు నియమితులయ్యారు. కోటపాడు సొసైటీకి సీనియర్ ఇన్‌స్పెక్టర్ మారుతీబాబును అఫిషియల్ పీఏసీఎస్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

గురుకుల పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 6: అద్దంకి ప్రాంతంలోని శింగరకొండ వద్ద గల అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో వచ్చే విద్యా సంవత్సరానికి 5వ తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పి.దుర్గాగాయత్రి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత గల బాలికలు ఈనెల 23లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మార్చి 10న ప్రవేశ పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. ఇంటర్‌లో బైపీసీ, ఎంపీసీ గ్రూపులలో 40 చొప్పున సీట్లు ఉంటాయని తెలిపారు.

42 మద్యం సీసాలు స్వాధీనం

చీరాల టౌన్, ఫిబ్రవరి 6: ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో అక్రమ మద్యం, గంజాయి, నగదు తదితర అసాంఘిక రవాణాకు పాల్పడకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు చీరాల జీఆర్పీ ఎస్సై కొండయ్య తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సోమవారం రాత్రి చీరాల్లో ఆగిఉన్న సర్కార్ ఎక్స్‌ప్రెస్‌లో సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించగా 42 మద్యం సీసాలు రవాణా చేస్తున్న వ్యక్తిని గుర్తించారు. కేసు నమోదు చేసుకుని సీసాలను సీజ్ చేశారు. నిరంతరం తనిఖీలు ఉంటాయని, నేరస్థులపై కఠినంగా వ్యవహరించనున్నట్లు ఎస్సై తెలిపారు.

బంగారు బాసికాలు అందజేత

అద్దంకి, ఫిబ్రవరి 6: శింగరకొండ లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో ఉత్సవాల సమయంలో స్వామివారు, అమ్మవార్లకు ధరింప చేసేందుకు బంగారు కల్యాణ బాసికాలు అందజేశారు. వీటిని ఒంగోలుకు చెందిన ఉండవల్లి చంద్రశేఖర్, మధులత దంపతులు మంగళవారం దేవస్థానం సిబ్బంది, పూజారులకు అందజేశారు.

విజేతలకు బహుమతులు అందజేత



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఆర్టీసీ అధికారులు

అద్దంకి, ఫిబ్రవరి 6: రోడ్డు భద్రతా మాసోత్సవంలో భాగంగా మండలంలోని తిమ్మాయపాలెం హైస్కూల్‌లో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు, సిబ్బంది ఏడుకొండలు, రత్నం, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్

కట్టుదిట్టంగా ఇంటర్, టెన్త్ పరీక్షలు

● ఎలాంటి ఇబ్బందులు రానీయొద్దంటూ కలెక్టర్ ఆదేశం

నెల్లూరు (విద్య), ఫిబ్రవరి 6 : జిల్లాలో ఇంటర్, పదోతరగతి పబ్లిక్ పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ ఎం.హరినారాయణన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం నగరంలోని కలెక్టరేట్‌లో టెన్త్, ఇంటర్ పరీక్షల నిర్వహణపై సంబంధిత అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించి మాట్లాడారు. మార్చి 1 నుంచి 20వ తేదీ వరకు ఇంటర్ పరీక్షలు జరుగుతాయన్నారు. కొత్త జిల్లావ్యాప్తంగా 81 కేంద్రాల్లో జరిగే పరీక్షలకు ప్రథమ సంవత్సరం 25,202, ద్వితీయ సంవత్సరం 24,243, ఒకేషనల్ 2,631 మంది కలిపి 52,076 మంది విద్యార్థులు హాజరవుతారని అన్నారు. అలాగే మార్చి 18 నుంచి 30వతేదీ వరకు జరిగే 32,384 మంది విద్యార్థులు టెన్త్ పరీక్షలు రాయనున్నారని చెప్పారు. ఈ పరీక్షలను కోఆర్డినేషన్ కమిటీ సభ్యులు సమన్వయం చేసుకుంటూ ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలతో నిర్వహించాలని ఆదేశించారు. పోలీసుశాఖ ద్వారా గట్టి బందోబస్తును ఏర్పాటు చేయడంతోపాటు 144 సెక్షన్ అమలు చేయాలని సూచించారు. కేంద్రాల్లో మంచినీటి వసతి, మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచేందుకు ఆయా మునిసిపాలిటీల ద్వారా శానిటేషన్ పనులు చేయించాలన్నారు. విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా ఆర్టీసీ బస్సులు నడపాలని ఆదేశించారు. పరీక్ష కేంద్రాల్లో గుర్తింపు పొందిన అధికారులు మాత్రమే ఉండాలని, ఇతర వ్యక్తులు ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో కార్పొరేషన్ కమిషనర్ వికాస్‌మర్మత్, అదనపు కమిషనర్ శర్మద, డీఆర్‌ఓ లవన్న, ఏఎస్పీ శ్రీనివాసులు, డీటీసీ చందర్, ఆర్ఐఓ ఎ.శ్రీనివాసులు, డీఈఓ గంగాభవాని తదితరులు పాల్గొన్నారు.

● పిల్లల్లో నులిపురుగులను నివారించండి

నెల్లూరు (వైద్యం) : పిల్లల్లో నులిపురుగుల నివారణకు గట్టి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ హరినారాయణన్ వైద్యాధికారులను ఆదేశించారు. మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో ఈ నెల 9వ తేదీన జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవంపై చేపట్టాల్సిన చర్యల గురించి వైద్యాధికారులతో ఆయన సమీక్షించారు. జిల్లావ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 100 శాతం లక్ష్యాలను సాధించేలా కృషి చేయాలని సూచించారు. డీఈవో, ఆర్ఐవో, ఐసీడీఎస్ పీడీ ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు రాని 1 నుంచి 2 ఏళ్ల చిన్నారులకు ఆశాలు, ఏఎన్ఎంలు ఇంటికి వెళ్లి మాత్రలు మింగించాలని ఆదేశించారు. అనంతరం నులిపురుగుల గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సమీక్షలో కార్పొరేషన్ కమిషనర్ వికాస్ మర్మత్, డీపీవో సుస్మిత, డీఈవో గంగాభవాని, ఆర్ఐవో శ్రీనివాసులు, డీఎంహెచ్‌వో పెంచలయ్య, డీసీహెచ్ఎస్ రమేష్ నాథ్, సీడీపీవో అనూరాధ, వైద్యాధికారి సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

డీఈఓ గంగాభవానికి పదోన్నతి

వయోజన విద్య జేడీగా నియామకం ● కొత్త డీఈవోగా రామారావు



నెల్లూరు (విద్య) : జిల్లా విద్యాశాఖాధికారి ఆర్ఎస్ గంగాభవానికి ఇటీవల ఆర్‌జేడీగా పదోన్నతి లభించడంతో ఆమెను ఫారెన్ సర్వీస్ కింద డిప్యుటేషన్ ప్రాతిపదికన వయోజన విద్య జాయింట్ డైరెక్టర్‌గా, వయోజన విద్య డైరెక్టర్ ఇన్చార్జిగా నియమిస్తూ పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ప్రవీణ్ ప్రకాష్ మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. కొత్త డీఈవోగా పీజేవీ రామారావు నియమితులయ్యారు. గుంటూరు జిల్లాకు చెందిన రామారావు ప్రస్తుతం బాపట్ల జిల్లా ఏడీ-1గా పనిచేస్తూ ఇన్చార్జి డీఈఓగా ఉన్నారు. మరో రెండు రోజుల్లో ఆయన జిల్లాలో బాధ్యతలు స్వీకరించనున్నారు. అలాగే జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో ఏడీ-1గా పనిచేస్తున్న కె.నారాయణరావును జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి(డీఎస్ఈఓ)గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా డీఈఓల బదిలీలతో పాటు నూతనంగా డీఎస్ఈఓ పోస్టుల్లో కూడా నియామకాలు చేపట్టారు.


పోర్టు పనులు జరగకుండా ఆందోళన చేస్తున్న కర్లపాలెం గ్రామస్థులు

ప్యాకేజీ ఇస్తారా.. ఖాళీ చేస్తారా!?

● పోర్టు ప్రతినిధులను నిలదీసిన కర్లపాలెం గ్రామస్థులు

గుడ్లూరు, ఫిబ్రవరి 6 : కర్లపాలెం గ్రామాన్ని వెంటనే ఖాళీ చేయాలని, లేని పక్షంలో వెంటనే ప్యాకేజీ ఇవ్వాలని రామాయపట్నం పోర్టు ప్రతినిధులను ఆ గ్రామస్థులు నిలదీశారు. ఇళ్ల స్థలాల కేటాయింపులో అధికారులు నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తున్నారని మండిపడ్డారు. తమ సమస్యల పరిష్కారం కోసం కర్లపాలెం గ్రామస్థులు రెండవ రోజు మంగళవారం కూడా పోర్టు పనులను అడ్డుకున్నారు. సాయంత్రం 4 గంటల ప్రాంతంలో పోర్టు అధికారులు ఐవీ రెడ్డి, ప్రతాప్‌కుమార్ రెడ్డి ఆందోళనకారులతో చర్చించారు. అయితే, తమ సమస్యల పరిష్కారంపై పూర్తి స్థాయిలో హామీ ఇస్తేనే అక్కడనుంచి కదులుతామని భీష్మించారు. దీంతో చేసేది లేక జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతామనింటూ వెనుదిరిగారు. వీరి ఆందోళనకు సీఐటీయూ జిల్లా కార్యదర్శి గంటెనపల్లి వెంకటేశ్వర్లు మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో కర్లపాలెం సర్పంచ్ చాపల రమణయ్య, చాపల మీరయ్య, బాలాజీ, వెంకట్, శ్రీను, సుబ్బరాయుడు, సుబ్బారావు, సుశీల, సుజాత, మస్తానమ్మ, శ్యామల, దుర్గా, వెంకటేశ్వరమ్మ, నూతలపాటి వెంకటేశ్వర్లు, ఇ. ఉపేంద్ర, ఆవులవారిపాలెం కాపు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో అభివృద్ధి పడకేసింది. కొత్త పనుల మంజూరు దేవుడెరుగు కనీసం పాత పనులనైనా పూర్తి చేయలేని దుస్థితి నెలకొంది. చిన్న ప్యాచ్ వర్కుల నుంచి పెద్ద ప్రాజెక్టుల వరకు ఎక్కడికక్కడ ఆగిపోయాయి. కాంట్రాక్టర్లు సొంత డబ్బులతో పనులు చేసినా బిల్లులు ఇవ్వకపోవడంతో పనులు చేసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. చిన్న కాంట్రాక్టర్ నుంచి బడా కాంట్రాక్టర్ వరకు ప్రతి ఒక్కరూ ఆర్థికంగా చితికిపోయారు. పెండింగ్ బిల్లుల కోసం కాంట్రాక్టర్లు ఆందోళనలు చేస్తున్నా, కోర్టులను ఆశ్రయిస్తున్నా ప్రభుత్వంలో చలనం లేదు. పైగా వైసీపీ ప్రజాప్రతినిధులే సమావేశాల్లో గగ్గోలు పెడుతున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదు. ఈ పరిస్థితుల్లో వైసీపీ ప్రభుత్వం చివరి బడ్జెట్‌ను రాష్ట్ర శాసనసభలో బుధవారం ప్రవేశపెట్టనుంది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌ను రాష్ట్ర ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ప్రవేశపెట్టనున్నారు. ఈసారైనా పెండింగ్ బిల్లులకు బడ్జెట్ కేటాయిస్తారా? అభివృద్ధి పనులకు మోక్షం లభిస్తుందా..? అని జిల్లావాసులు గంపెడు ఆశలతో ఎదురుచూస్తున్నారు.



బుగ్గన వరమిచ్చేనా..

కాసులు కురిసేనా!?

భారీగా బిల్లుల పెండింగ్.. కదలని అభివృద్ధి పనులు ● నేడు ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ ● వేయికళ్లతో ఎదురుచూస్తున్న కాంట్రాక్టర్లు

నెల్లూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : 2020, 2021 సంవత్సరాల్లో వరుసగా సంభవించిన వరదలకు సోమశిల ప్రాజెక్టు ఆప్రాన్ పూర్తిగా దెబ్బతిన్నది. దీనిని పరిశీలించిన నిపుణుల బృందం అత్యవసరంగా ఆప్రాన్ పనులు పూర్తి చేయాలని సూచించింది. దీంతో రూ.117 కోట్లతో రెండేళ్ల క్రితం పనులు మొదలయ్యాయి. కానీ 20 శాతం పనులు జరిగాక ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదు. ఫలితంగా కాంట్రాక్టర్ పనులు ఆపేశారు. దీంతో సోమశిల ప్రాజెక్టు ప్రమాదంలో పడింది. నెల్లూరు నగరంలో రూ.75 కోట్ల అగ్రిమెంట్ విలువతో జాఫర్ సాహెబ్ కెనాల్ ఆధునికీకరణ చేపట్టగా 15 శాతం పనులు పూర్తయ్యాయి. కానీ ఒక్క రూపాయి కూడా కాంట్రాక్టర్‌కు బిల్లు రాకపోవడంతో ఏడాది నుంచి పనులు ఆగిపోయాయి. మలిదేవి డ్రెయిన్ ఆధునికీకరణ పనులు రూ.70 కోట్లతో మొదలవగా 50 శాతం పూర్తయ్యాయి. కానీ మూడేళ్ల నుంచి రూపాయి బిల్లు రాక ఆ తర్వాత పనులు ముందుకు కదలడం లేదు. సోమశిల హైలెవల్ కెనాల్ పనులు రూ.1502 కోట్లతో, ఎస్‌కేఎఫ్ఎఫ్, ఉత్తర కాలువల విస్తరణ పనులు రూ.1300 కోట్లతో మొదలయ్యాయి. ఇక్కడా బిల్లుల సమస్యతో ఒక అడుగు ముందుకు మూడడుగులు వెనక్కు అన్న చందంగా పనులు జరుగుతున్నాయి.


సోమశిల ముందు దెబ్బతిన్న ఆప్రాన్ (ఫైల్)

● 541 రైతు భరోసా కేంద్రాల భవనాల నిర్మాణాన్ని రూ.118 కోట్లతో చేపట్టగా నాలుగేళ్లలో 257 కేంద్రాలు మాత్రమే పూర్తయ్యాయి. అలానే 455 గ్రామ ఆరోగ్య కేంద్రాలను రూ.94 కోట్లతో చేపట్టగా 153 కేంద్రాలు పూర్తయ్యాయి. రూ.15 కోట్లతో 86 పాల శీతలీకరణ కేంద్రాల నిర్మాణం చేపట్టగా 7 మాత్రమే పూర్తయ్యాయి. నాలుగేళ్లుగా ఈ చిన్న భవనాలు కూడా పూర్తికాకపోవడానికి ప్రధాన కారణం బిల్లులు ఇవ్వకపోవడమేనని అధికారులే చెబుతుండడం గమనార్హం.

● ఇక రోడ్ల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. రోడ్డు మొత్తాన్ని అభివృద్ధి చేయడం అటుంచితే కనీసం ప్యాచ్‌లు వేసేందుకు కూడా నిధులు ఇవ్వడం లేదు. ఎన్డీబీ, ఏఐఐబీ వంటి ప్రాజెక్టులు బిల్లులు ఇవ్వకపోవడంతో ముందుకు కదలడం లేదు. ఇటీవల ఐప్యాక్ సర్వే సంస్థ అత్యవసరంగా మరమ్మతులు చేయాలని 28 రోడ్లను సూచించగా వాటిని రూ.86 కోట్ల అంచనాలతో చేపట్టారు. పెండింగ్ బిల్లులు ఇస్తామని హామీ ఇచ్చి ఐప్యాక్ వర్కులకు కాంట్రాక్టర్ల నుంచి టెండర్లు వేయించారు. కానీ ఆ తర్వాత బిల్లులు ఇవ్వకపోవడంతో ఈ వర్కులను అగ్రిమెంట్ చేసుకునేందుకు కూడా కాంట్రాక్టర్లు ఆసక్తి చూపలేదు. ఇప్పుడు బలవంతంగా అగ్రిమెంట్లు చేయిస్తున్నారు. మొత్తంగా చూసుకుంటే ఒక్క ఇరిగేషన్ శాఖలోనే సుమారు రూ.300 కోట్లు, పంచాయతీరాజ్ శాఖలో సుమారు రూ.100 కోట్లు, ఆర్అండ్‌బీ శాఖలో మరో రూ.100 కోట్ల వరకు బిల్లులు పెండింగ్ ఉన్నాయని అంచనా. ఇక అన్ని శాఖల్లో కలుపుకుంటే ఈ మొత్తం భారీగానే ఉంటుంది.

● రెండో విడత నాడు-నేడు పనులు 1376 పాఠశాలల్లో రూ.466 కోట్ల అంచనాలతో చేపట్టారు. కానీ బిల్లుల సమస్యతో చాలా చోట్ల పనులు ఆగిపోయాయి.

● రూ.218 కోట్లతో 544 గ్రామ సచివాలయ భవనాల నిర్మాణం నాలుగేళ్ల క్రితం మొదలవగా ఇప్పటివరకు కేవలం 316 భవనాలు మాత్రమే పూర్తయ్యాయి. బిల్లులు రాక మిగిలిన భవనాల నిర్మాణం ఆగిపోగా, పూర్తయిన పలు భవనాలను కూడా కాంట్రాక్టర్లు అప్పగించడం లేదు.



‘ఖజానా’కు ఆంక్షలు

● సీఎఫ్ఎంఎస్‌లో బిల్లులు కదలకుండా ప్రోగ్రామ్
● బడ్జెట్ బిల్లుల చెల్లింపులకు ఫుల్‌స్టాప్
● ఇప్పటికే వేలల్లో బిల్లుల పెండింగ్
● జీతాలు, పెన్షన్ల చెల్లింపులకు ఓకే

ఖజానాకు ముందుగానే ఆంక్షల సైరన్ మోగింది. ప్రభుత్వం వద్ద నిధులు లేకపోవటంతో బిల్లుల చెల్లింపులు చేయలేని స్థితి ఏర్పడింది. దీంతో రాష్ట్రంలోని అన్ని రకాల బడ్జెట్ బిల్లుల చెల్లింపునకు ఆర్థిక శాఖ ఆంక్షలు విధిస్తూ ఈ నెల 1వ తేదీన సీఎఫ్ఎంఎస్‌కు, ఖజానా శాఖకు ఆదేశాలిచ్చింది. సీఎఫ్ఎంఎస్ (కాంప్రెహెన్సివ్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్)లో బిల్లులు ముందుకు కదలకుండా ఒక ప్రోగ్రాంను రాసి ఉంచినట్లు సమాచారం. దీంతో ట్రెజరీ అధికారులు బిల్లులను పాస్‌అన్‌చేస్తే అవి ముందుకు కదలడం లేదు. అయితే, ఈ విషయాన్ని కూడా బయటకు పొక్కకుండా ఆదేశించినట్లు సమాచారం. ఖజానాలో జీతాలు, పెన్షన్ల చెల్లింపులు తప్ప అన్ని రకాల బిల్లుల చెల్లింపులు ఆగిపోయాయి.

నెల్లూరు (హరనాథపురం), ఫిబ్రవరి 6 : సాధారణంగా ప్రతి ఏడాది మార్చిలో ఖజానాకు ఆంక్షలు విధిస్తుంటారు. కానీ ఈసారి నెల ముందుగానే ఆంక్షలు విధించారు. బడ్జెట్ బిల్లుల చెల్లింపులు జరిగితేనే ప్రభుత్వ కార్యాలయాలు వాటి మనుగడ సాగించగలవు. లేకపోతే కనీసం కరెంటు బిల్లులు చెల్లించలేని స్థితి ప్రభుత్వ కార్యాలయాలకు ఏర్పడుతుంది. జిల్లా ట్రెజరీలో ఉద్యోగ, ఉపాధ్యాయ, విశ్రాంత ఉద్యోగుల బిల్లులకు పాస్ ఆర్డర్ పడి, సీఎఫ్ఎంఎస్ పోర్టల్‌కు వివరాలు వెళ్లినా ప్రభుత్వం నగదును విడుదల చేయకపోవటంతో అవసరానికి డబ్బులు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆంక్షలకు ముందే వేలాదిగా జీపీఎఫ్ బిల్లులు, మెడికల్ రీయింబర్స్‌మెంటు బిల్లులతో పాటు పలురకాల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి.

● అవసరాలకు అందక...

పిల్లల పెళ్లిళ్లు, చదువుల కోసం దాచిపెట్టుకున్న జీపీఎఫ్ డబ్బులను పొందలేక, పెళ్లి ముహూర్తాలు కుదుర్చుకొని రద్దు చేసుకొన్న వారు ఎందరో జిల్లాలో ఉన్నారు. పరువు కోసం బంధువులు, స్నేహితుల వద్ద ఆర్థిక సాయం స్వీకరించి పెళ్లి తంతు ముగించిన ఎందరో ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఉన్నారు. ఆరు నెలలుగా జీపీఎఫ్ డబ్బును పొందటం జిల్లా ఉద్యోగ, ఉపాధ్యాయులకు కష్టతరంగా మారింది. ప్రతి ఉద్యోగి జీపీఎఫ్ ఖాతా తెరిచి అందులో కొంత దాచుకోవటం ఆనవాయితీ. గతం లో జీపీఎఫ్ డబ్బును పొందటం చాలా సులభంగా ఉండేది. ప్రస్తుతం ఆ పరిస్థితిలో చాలా మార్పు వచ్చింది. జీపీఎఫ్‌లో డబ్బు ఎందుకు దాచుకొన్నామనే భావన వేతన జీవుల్లో కలుగు తోంది. జిల్లాలో ఆరు నెలలకు పైబడి జీపీఎఫ్ బిల్లులు చెల్లింపులకు నోచుకోకుండా ఉన్నట్లు సమాచారం.

● ఏపీజీఎల్ఐ : ఉద్యోగ, ఉపాధ్యాయులు ఏపీజీఎల్ఐలో కూడా కొంత మొత్తాన్ని జీతం నుంచి పెట్టుబడి పెట్టుకొంటుం టారు. ఈ మొత్తాన్ని అవసర నిమిత్తం రుణంగా తీసుకొనే వెసులుబాటు ఉంటుంది. అయితే ఎనిమిది నెలలుగా ఏపీజీఎల్ఐ డబ్బులు పొందలేక నరక యాతన పడుతున్నారు.

● సరెండర్ లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్

ప్రతి ఉద్యోగికి సంవత్సరానికి నెల రోజులు సరెండర్ లీవ్ ఇస్తారు. ఈ లీవ్‌కు సంబంధించిన నెల రోజుల మొత్తాన్ని ఉద్యోగులు అమ్ముకొంటుంటారు. చాలా మంది ఉద్యోగులు అవసరాలకు ఉపయోగ పడుతుందని 2, 3 సంవత్సరాల సరెండర్ లీవ్‌లను ఎత్తి పెట్టుకొని ఎన్‌క్యాష్ చేసుకొంటారు. ఉదాహరణకు ఒక నెల జీతం ఉద్యోగికి రూ.లక్ష వస్తుందనుకొంటే, మూడు సంవత్సరాలు అతను ఎత్తి పెట్టుకొని అమ్ముకొంటే రూ.3లక్షలు పొందే వీలుంది. ప్రస్తుతం సరెండర్ లీవ్‌ను ఎన్‌క్యాష్ చేసుకోవడానికి బిల్లులు సమర్పించినా మంజూరు కావటం లేదు. రెండన్నర సంవత్సరాలుగా రూ. వెయ్యి కోట్ల వరకు బిల్లులు పెండింగ్ ఉన్నట్లు సమాచారం.

● మెడికల్ రీయింబర్స్‌మెంటు

ఉద్యోగ, ఉపాధ్యాయ, విశ్రాంత ఉద్యోగులు ముందుగా ఖర్చులు భరించి వైద్యం చేయించుకున్నాక పెట్టిన మెడికల్ రీయింబర్స్‌మెంటు బిల్లులు 8 నెలల నుంచి ఆగిపోయి ఉన్నాయి. జిల్లాలో సుమారు రూ.100 కోట్లు విలువైన 500లకు పైబడిన బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం.



బిల్లులను వెంటనే చెల్లించాలి

విశ్రాంత ఉద్యోగులకు సంబంధించి లీవ్ ఎన్‌క్యాష్‌మెంటు బిల్లులను, మెడికల్ రీయింబర్స్ మెంటు బిల్లులను వెంటనే చెల్లించాలి. పెండింగ్ బిల్లులు చెల్లించకుండా ఖజానాకు ఆంక్షలు విధించడం సరికాదు. సంవత్సరాల తరబడి బిల్లులకు ఆమోదం తెలపక పోవటం వల్ల వృద్ధాప్యంలో ఇబ్బందులు పడుతున్నాం. ఖజానాకు ఆంక్షలు ఎత్తేసి బిల్లులను వెంటనే చెల్లించాలి.

- ఐ. లక్ష్మీనారాయణ, ఆంధ్రప్రదేశ్ గవర్నమెంటు రిటైర్డు ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి


దోమలు బాబోయ్
దోమలు!

నెల్లూరు నగరంలో దోమలు దండయాత్ర చేస్తున్నాయి. పొద్దువాలితే చాలు గుయ్.. మంటూ నివాసాల్లో జొరబడుతు న్నాయి. బయటకు రావాలంటేనే నగరవాసులు హడలిపోయే దాపురించింది. మరోవైపు పట్టపగలు కూడా ఆరుబయట ఉండలేని పరిస్థితి. డ్రైనేజీ కాలువలు, నీటి నిల్వ ప్రాంతాలలో పుట్టలను తెంచుకుని బయటకు వస్తున్న దోమలు ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. పరిస్థితి అదుపుదాటడంతో ప్రజలు పొద్దువాలితే చాలు తలుపులు, కిటికీలు వేసుకుని ఇళ్లలో ఉండిపోతున్నారు. ఆఖరికి వాకిట్లో లైట్లు కూడా వేసుకోలేని దుస్థితి నెలకొంది. మంచినీటిలో పురుడుపోసు కుంటున్న దోమలు కావడంతో డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి విషపూరిత జ్వరాలు వచ్చే అవకాశాలు ఉన్నాయని వైద్యనిపుణులు హెచ్చరిస్తుండటంతో నగరవాసులు హడలిపోతున్నారు. నియంత్రణ చర్యల్లో కార్పొరేషన్ అధికారుల వైఫల్యం చెందుతున్నారని నగరవాసులు మండిపడుతు న్నారు. కనీసం ఫాగింగ్ చేయడం, కాలువల్లో ఆయిల్ బాల్స్ వంటి చర్యలు తీసుకోవడం లేదని వాపోతున్నారు. అయితే రోజుకు పది డివిజన్లను ఎంచుకుని దోమల నియంత్రణ చర్యలు చేపడు తున్నట్లు ఎంహెచ్‌వో వెంకటరమణయ్య తెలిపారు.

- నెల్లూరు (సిటీ)


రాజీవ్ గృహ సముదాయం వద్ద మురుగు

విచ్చలవిడిగా నగరవాసులపై దాడి


ఇరుకళల పరమేశ్వరి ఆలయం వద్ద మురుగులో ఇల్లు


మురుగులో దోమల మంద


పాత కార్పొరేషన్ రోడ్డులో చెత్తతో నిండిన కాలువ

9న జరిగే 'డీ వార్మింగ్'ను విజయవంతం చేయండి



ఉదయగిరి : గోడపత్రికలు ఆవిష్కరిస్తున్న వైద్యాధికారి, సిబ్బంది



సంగం : గోడపత్రికలు ఆవిష్కరిస్తున్న అధికారులు

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 6: మండలంలో ఈనెల 9న నిర్వహించే డీవార్మింగ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గండిపాళెం పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం.శివకల్పన పేర్కొన్నారు. మంగళవారం పాత సీహెచ్‌సీలో సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీసీజీ సర్వేను నూరు శాతం పూర్తి చేయాలన్నారు. డీవార్మింగ్ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఇటీవల రిపబ్లిక్‌డే సందర్భంగా అవార్డు అందుకున్న వైద్యాధికారి శివకల్పన, ఆరోగ్యబోధకుడు, ఏఎన్‌ఎం నూర్జహాన్‌లను సిబ్బంది సన్మానించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో శివకుమారి, మలేరియా సబ్ యూనిట్ అధికారి నౌషాద్‌బాబు, టీబీ ట్రీట్‌మెంట్ ఆర్గనైజర్ భోగ్యం వెంకటేశ్వర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సంగం: తహసీల్దారు కార్యాలయంలో మంగళవారం అధికారులు జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంపై వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ నెల 9న జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. అవగాహన నిమిత్తం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీటీ ప్రవీణ్ కుమార్, ఈవోఆర్డీ అప్పాజీ, ఎంఈవో జానకీరామ్, మల్లయ్య పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే బీఎస్ఆర్‌కు ఘన నివాళి



బీఎస్ఆర్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న కుటుంబ సభ్యులు, వివిధ పార్టీల నేతలు

ఆత్మకూరు, ఫిబ్రవరి 6 : ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బొమ్మిరెడ్డి సుందరరామిరెడ్డి(బీఎస్ఆర్) నాలుగవ వర్ధంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా పట్టణంలోని బీఎస్ఆర్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించిన అనంతరం బీఎస్ఆర్ విగ్రహానికి ప్రముఖ గుండె వైద్యనిపుణులు డాక్టర్ తూమాటి రామకృష్ణారెడ్డి, జడ్పీ మాజీ చైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, కుటుంబసభ్యులు, వివిధ పార్టీల నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. తదనంతరం పట్టణంలోని ప్రభుత్వ జిల్లా వైద్యశాలలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు.

ఓటర్ల జాబితాలో తప్పుల సవరణ : ఆర్వో



మాట్లాడుతున్న ఆర్వో రాజా రమేష్ ప్రేమ్‌కుమార్

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 6: తాజా ఓటర్ల జాబితాలో తప్పుల సవరణకు చర్యలు చేపడతామని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజా రమేష్ ప్రేమ్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారులు, రాజకీయ పార్టీల నాయకులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ జాబితాలో వచ్చిన తప్పులను గుర్తించామని, వాటిని సవరించేందుకు చర్యలు చేపడతామన్నారు. బీఎల్‌వోలు సర్వే సక్రమంగా చేయని కారణంగా తప్పులు దొర్లాయని రాజకీయ పార్టీల నాయకులు ఆర్వో దృష్టికి తీసుకెళ్లారు. వాటన్నింటిని ఎన్నికల నాటికి సరిచేసి సమగ్ర ఓటర్ల జాబితా వచ్చేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో ఏఈఆర్వో నెహ్రూబాబు, రాజకీయ పార్టీ నాయకులు సీహెచ్ బయ్యన్న, కాకు వెంకటయ్య, జీ.ఓబులరెడ్డి, అలీఅహ్మద్, సత్తెనపల్లి బాలయ్య, జీ.వెంకటేశ్వరరావు, రవీంద్ర పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో సత్తా చాటాలి : బీజేపీ నేతలు



మాట్లాడుతున్న మల్లికార్జునరెడ్డి

ఆత్మకూరు, ఫిబ్రవరి 6 : వచ్చే ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలని, ప్రధాని మోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆ పార్టీ సీనియర్ నేతలు పిలుపునిచ్చారు. మంగళవారం ఆత్మకూరులోని త్రికోటేశ్వర కల్యాణ మండలంలో నియోజకవర్గ కన్వీనర్ కంది మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికల సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నేతలు సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, సన్నారెడ్డి దయాకర్ రెడ్డి, కాకు విజయలక్ష్మి, గాజుల వెంకయ్యనాయుడు తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రజలను ఓటు అడిగే హక్కు ఒక బీజేపీకే ఉం దన్నారు. నేతలు, కార్యకర్తలు సమష్టిగా పనిచేసి నియోజకవర్గంలో సత్తా చాటాలని తెలిపా రు. ఈ కార్యక్రమంలో స్థానిక నేతలు కాలం బుజ్జిరెడ్డి, కుడుముల సుధాకర్ రెడ్డి, కరటంపాటి సుధాకర్, చింతపల్లి భరత్‌రెడ్డి, నరసింహులునాయుడు, బత్తల కృష్ణయ్య, చెరుకూరు రమణయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

కావలిలో టీడీపీ జెండా ఎగురవేయడం తథ్యం : కావ్య



అభిమానుల సైకిల్ యాత్రను ప్రారంభిస్తున్న కావ్య క్రిష్ణారెడ్డి

కావలి, ఫిబ్రవరి 6: రానున్న ఎన్నికల్లో కావలి నియోజకవర్గంలో టీడీపీ జెండాను ఎగురవేయడం తథ్యమని ఆ పార్టీ కావలి నియోజకవర్గ ఇన్‌చార్జి కావ్య క్రిష్ణారెడ్డి తెలిపారు. టీడీపీ ఇన్‌చార్జిగా కావ్యను నియమించిన సందర్భంగా మంగళవారం ముసునూరులోని ఆయన నివాసం వద్ద రాజకీయ కోలాహలం కొనసాగింది. కావలి పట్టణ, రూరల్ మండల టీడీపీ కమిటీల బాధ్యులు కావ్య క్రిష్ణారెడ్డిని కలిసి పూలమాలలు, బొకేలు, శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు గుత్తికొండ కిషోర్, ప్రధాన కార్యదర్శి జ్యోతి బాబూరావు, రూరల్ మండల అధ్యక్షుడు ఆవుల రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి ఉప్పాల వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

● **సైకిల్ యాత్ర ప్రారంభం**

కావ్య క్రిష్ణారెడ్డికి టీడీపీ కావలి ఇన్‌చార్జి పదవి వస్తే సైకిల్‌పై కసుమూరు దర్గాకు వస్తామని ఆయన అభిమానులు ఫిరోజ్, లక్ష్మణరావులు మొక్కుకున్నారు. ఈ మేరకు వారు మంగళవారం సైకిల్ యాత్ర చేపట్టగా క్రిష్ణారెడ్డి ప్రారంభించి వారిని అభినందించారు.

● **కావ్య కృష్ణారెడ్డిని కలసిన బోగోలు నేతలు**

బిట్రగుంట : టీడీపీ కావలి ఇన్‌చార్జిగా నియమితులైన కావ్య కృష్ణారెడ్డిని మంగళవారం బోగోలు, విశ్వనాథరావుపేట పంచాయతీలకు చెందిన మాజీ ఉపసర్పంచు దొడ్ల అంజయ్య యాదవ్, నాయకులు సాతుపాటి ఉదయ్‌కుమార్, బచ్చు మధుసూదన్‌రావులు కావలిలో కలసి సన్మానించారు. వారి వెంట రమేష్, సురేష్ తదితరులు ఉన్నారు.

10న మెగా రక్తదాన శిబిరం

కావలి, ఫిబ్రవరి 6: రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా ఈనెల 10న మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు డిపో మేనేజరు శ్రీనివాసులు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆర్టీసీ డిపో ఆవరణలో రక్తదానంపై కార్మికులకు అవగాహన కల్పిస్తూ బ్యానర్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ ఈనెల 10న మెగా రక్తదాన శిబిరాలు నిర్వహిస్తోందని, అందులో భాగంగా కావలి డిపోలో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజరు (ట్రాఫిక్) కేవీఆర్ బాబు, సీనియర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎం.రామకృష్ణ, సీనియర్ అసిస్టెంట్ కే.రవికుమార్, డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ డీ.రవిప్రకాష్, ఎం.మస్తాన్, తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో పన్నులు చెల్లించండి

ఉదయగిరి : ప్రజలు సకాలంలో ఇంటి, కుళాయి పన్నులు చెల్లించి పంచాయతీ అభివృద్ధికి సహకరించాలని శకునాలపల్లి సర్పంచి కల్లూరి వెంకటేశ్వరరెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పారిశుధ్యం మెరుగు, వీధిదీపాల నిర్వహణకు పన్నులు చెల్లించాలని కోరారు.

ఓట్ ఫర్ ఓపీఎస్ పోస్టర్ ఆవిష్కరణ

సీతారామపురం : యూటీఎఫ్ రాష్ట్రశాఖ పిలుపు మేరకు స్థానిక మండల విద్యావనరుల కార్యాలయం వద్ద మంగళవారం 'మన ఓటు- మన భవిష్యత్తు'అనే నినాదంతో ఓట్ ఫర్ ఓపీఎస్ పోస్టర్లను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా మండల యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి జీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం సీపీఎస్‌ను వారంలో రద్దు చేస్తామని చెప్పి నాలుగున్నరేళ్లు అయినా రద్దు చేయకపోగా, జీపీఎస్‌ను ప్రవేశపెట్టి ఉద్యోగులకు తీరని అన్యాయం చేసిందన్నారు. కార్యక్రమంలో నాయకులు తిరుపతయ్య, పేరాల శ్రీనివాసులు, బాలకృష్ణారెడ్డి, అన్నంగి ప్రసాద్,సుబ్బారావు, లక్ష్మయ్య, సురేష్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక రీచ్‌లో ఆగని అక్రమ వసూళ్లు

అనంతసాగరం, ఫిబ్రవరి 6: మండలంలోని పడమటి కంభంపాడు ఇసుకరీచ్‌లో వాహనాల వద్ద అక్రమ వసూళ్ల కొనసాగుతూనే ఉన్నాయి. రీచ్‌లో రహదారుల ఏర్పాటు కోసం సిబ్బంది అక్రమార్జనకు తెరలేపడంతో ఇసుక కొనుగోలుదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏవేవో కారణాలు చెప్పి ట్రాక్టర్‌కు రూ.500, టిప్పర్, లారీలకు రూ. 1500 నుంచి రూ. 2000 వరకు వసూలు చేస్తున్నారు. అడ్డుకోవాల్సిన అధికారులు తమకేమి తెలియనట్లు మౌనం దాల్చడం విమర్శలకు తావిస్తుంది.ఈ అక్రమ వసూళ్లను సీపీఎం నాయకులు తప్పుపట్టారు. వసూళ్ల అపకపోతే ఆందోళన చేస్తామని వారు హెచ్చరించారు.

బెల్టు దుకాణాలు నిర్వహిస్తే కఠిన చర్యలు

అనంతసాగరం, ఫిబ్రవరి 6: గ్రామాల్లో మద్యం బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఆత్మకూరు సీఐ వేణు హెచ్చరించారు. మంగళవారం అనంతసాగరం పోలీసుస్టేషన్‌ను సందర్శించి, రికార్డులు పరిశీలించారు. ఎన్నికలు సమీపిస్తున్న క్రమంలో శాంతిభద్రతలు కాపాడేలా ప్రతేక శ్రద్ధ చూపాలన్నారు. చోరీలు జరగకుండా నిఘా పెంచాలని సిబ్బందిని ఆదేశించారు.

ఓపీఎస్ అమలు చేసేవారికే మా ఓటు

అనంతసాగరం, ఫిబ్రవరి 6: ఓపీఎస్ అమలు చేసేవారికే తమ ఓటు వేస్తామని యూటీఎఫ్ తేల్చి చెప్పింది. మంగళవారం అనంతసాగరంలో మండల అధ్యక్షుడు వీ వెంకటేశ్వర్లురెడ్డి ఆధ్వర్యంలో ఓపీఎస్ అమలు చేసేవారికి మాఓట్లు అనే వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చేసిన మోసాన్ని ఎండగట్టారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు గౌస్‌బాషా, శ్రీలత, అరుణశ్రీ, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

నేడు నందీశ్వరుడికి అభిషేక మహోత్సవం

సంగం, ఫిబ్రవరి 6: బహుళ త్రయోదశి మాసశివరాత్రిని పురస్కరించుకుని సంగమేశ్వరాలయంలోని నందీశ్వరుడికి బుధవారం సాయంత్రం అభిషేక మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. సాయంత్రం 4 నుంచి ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. పాల్గొనే భక్తులు పాలు, పెరుగు తెచ్చుకోవాలని ప్రధానార్చకులు గోపాలకృష్ణమూర్తి తెలిపారు.

సచివాలయాల తనిఖీ

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 6: మండలంలోని జీ. చెరువుపల్లి, బండగానిపల్లి, శకునాలపల్లి సచివాలయాలను మంగళవారం ఎంపీడీవో దేవరకొండ ఈశ్వరమ్మ తనిఖీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రతిరోజు సచివాలయంలో స్పందనను నిర్వహించాలన్నారు. అనంతరం సిబ్బంది మూమెంట్, అటెండెన్స్ రిజిస్టర్లను పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జలసంఘ కమిటీలు ఏర్పాటు చేయాలి

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 6: జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా గ్రామాల్లో జలసంఘ కమిటీలను ఏర్పాటు చేయాలని ఏపీఎం సయ్యద్ ఖాజారంతుల్లా పేర్కొన్నారు. మంగళవారం స్థానిక స్త్రీశక్తి భవనంలో సీసీలు, వీవోఏలతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కమిటీల ఏర్పాటుతోపాటు బ్యాంకు ఖాతాలను ప్రారంభించాలన్నారు.

వెంకటగిరిలో బీసీలకు అవకాశం ఇవ్వండి

కలువాయి, ఫిబ్రవరి 6 : వెంకటగిరి నియోజకవర్గం నుంచి టీడీపీ తరపున బీసీలకు అవకాశం కల్పించాలని పలువురు బీసీ నాయకులు కోరారు. మంగళవారం కలువాయిలో వారు విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలో బీసీల జనాభా ఎక్కువగా ఉందని, బీసీ అభ్యర్థికి అవకాశం ఇస్తే తామంతా ముందుండి గెలిపించుకుంటామని తెలిపారు. టీడీపీ అధినేత చంద్రబాబు ఈ విషయాన్ని పరిశీలించాలని వారు కోరారు. సమావేశంలో టీడీపీ సీనియర్ నేత అల్లంపాటి వేణుగోపాల్‌రెడ్డి బీసీ నాయకులు ఏ.మల్లికార్జునయ్య, నూటేటి నరసింహులు, సంకల రఘురాం, కండే శ్రీనివాసులు, చెంచురామయ్య పాల్గొన్నారు.

వైసీపీ నేతలే భూకబ్జాదారులు

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), ఫిబ్రవరి 6: మండలంలో ప్రభుత్వ భూములను అక్రమిస్తూ వైసీపీ నేతలే కబ్జాదారులుగా మారుతున్నారని క్లస్టర్ ఇన్‌చార్జి కండ్లగుంట వెంకటరెడ్డి, మాజీ జడ్పీటీసీ చీదర్ల మల్లికార్జున్‌లు పేర్కొన్నారు. మంగళవారం టీడీపీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. కొంతమంది అక్రమార్కులు, అధికారులు చేతులు కలిపి దుత్తలూరు రెవెన్యూ పరిధిలోని 448-1 సర్వేనెంబర్‌లో రూ.4 కోట్ల విలువైన 32 ఎకరాల గర్భకండ్రిక భూమిని అక్రమించి యథేచ్ఛగా రిజిస్ట్రేషన్ చేయించారన్నారు. సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు చేపట్టాలన్నారు. లేకుంటే ఆందోళన చేపడతామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు కాకర్ల మధుసూదన్‌రెడ్డి, చప్పిడి హజరత్తయ్యయాదవ్, సింగవరపు సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైద్యసేవలు సద్వినియోగం చేసుకోవాలి

వరికుంటపాడు : ఆరోగ్య సురక్ష వైద్యసేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో శ్రీ దేవి అన్నారు. మంగళవారం రామాపురం సచివాలయం ప్రాంగణంలో నిర్వహించిన శిబిరంలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో సచివాలయాల కన్వీనర్ దారపనేని చెన్నారాయుడు, మాజీ సర్పంచి మేడసాని చెన్నకేశవులు, వైద్యులు కరిష్మా, కోటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి ప్రభుదాస్, సీహెచ్‌వో రాజశేఖర్‌రాజు పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

వరికుంటపాడు, ఫిబ్రవరి 6: స్థానిక జాతీయ రహదారి సమీపంలో పద్మావతి, గోదాదేవి సమేత వెంకటేశ్వరుడి ఆలయానికి ప్రాణప్రతిష్ఠ చేయనున్నట్లు వ్యవస్థాపకుడు పెండ్యాల సూర్యనారాయణ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఈనెల 15 నుంచి ఐదు రోజులపాటు ప్రతిష్ఠా మహోత్సవాలను నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా మహోత్సవాల కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కలిగిరి తహసీల్దారుగా బాలకిషోర్



కలిగిరి, ఫిబ్రవరి 6: కలిగిరి తహసీల్దారుగా బాలకిషోర్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల నేపథ్యంలో జరిగిన బదిలీలలో ఆయన ప్రకాశం జిల్లా సీఎస్ పురం మండలం నుంచి ఇక్కడకు వచ్చారు.

సమన్వయంతో పని చేయాలి

● కందుకూరు సబ్ కలెక్టరు విద్యాధరి



మాట్లాడుతున్న సబ్ కలెక్టరు విద్యాధరి

కందుకూరు, ఫిబ్రవరి 6: రోడ్డు ప్రమాదాలు నానాటికీ పెరుగుతున్న తరుణంలో రహదారి భద్రతపై వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయటం ద్వారా రోడ్డు ప్రమాదాలను తగ్గించవచ్చని కందుకూరు సబ్ కలెక్టరు జీ.విద్యాధరి పేర్కొన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాలలో భాగంగా స్థానిక లారీ ఓనర్స్ అసోసియేషన్ కార్యాలయం వద్ద మంగళవారం లారీ ఓనర్లు, డ్రైవర్లు, ఆటో డ్రైవర్లు, మ్యాక్సీ క్యాబ్, మోటారుక్యాబ్ డ్రైవర్లకు అవగాహనా సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో సబ్ కలెక్టరుతో పాటు రవాణాశాఖ గుంటూరు ప్రాంతీయ సంయుక్త కమిషనర్ బీ. కృష్ణవేణి పాల్గొని రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, పాటించాల్సిన ప్రమాణాలపై అవగాహన కల్పించారు. వైద్యశిబిరం ఏర్పాటు చేసి డ్రైవర్లకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో కావలి ప్రాంతీయ రవాణాశాఖ అధికారి వై.సుధాకరరెడ్డి, నెల్లూరు ఎన్ఫోర్స్‌మెంట్ ఎంవీఐ గోపినాయక్, కావలి, కందుకూరు ఎంవీఐలు, ఆర్. సుందరరావు, ఎస్సై మహమ్మద్ రఫీ, కందుకూరు ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టరు ఎం.శకుంతల, డాక్టరు ప్రశాంతి, డాక్టరు మధుసూదనరాజు, లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు నాగేశ్వరరావు, గోపి, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సర్వే చేశాకే నిర్మాణ పనులు చేయండి

సర్వేచేసి హద్దులు నిర్ణయించకుండా వంకర్లు తిప్పుతూ మురుగు నీటి కాలువ నిర్మించడం ఏమిటని మున్సిపల్ అధికారులపై సబ్ కలెక్టరు జి. విద్యాధరి ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణం సర్వేచేసి హద్దులు నిర్ణయించాక కాలువ నిర్మాణం చేయాలని, అంతవరకు పనులు నిలిపివేయాలని ఆదేశించారు. పట్టణంలోని బండపాలెం, శ్రీరాంనగర్ కాలనీ ప్రాంతాలలో నిర్మిస్తున్న మురుగు కాలువను మంగళవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కొలతలు వేసి ఇంజనీరింగ్ అధికారులు మార్కింగ్ ఇవ్వకుండా పనులు ఎలా ప్రారంభించారని కాంట్రాక్టరును ప్రశ్నించారు. నిబంధనల ప్రకారం నిర్మాణ పనులు జరిగేలా పర్యవేక్షించాలని, లేనిపక్షంలో కఠినచర్యలు తీసుకుంటామని ఇంజనీరింగ్ అధికారులను హెచ్చరించారు. ఆమె వెంట మున్సిపల్ కమిషనర్ కేవీ కృష్ణారెడ్డి, ఇంజనీరింగ్ అధికారులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో గంధమహోత్సవం



ప్రార్థన చేస్తున్న ఎమ్మెల్యే మహీధరరెడ్డి

కందుకూరు, ఫిబ్రవరి 6: పట్టణంలోని శ్రీశ్రీశ్రీ హజరత్ సయ్యద్ జహంగీర్ మలంగ్‌షా అవులియా గంధ మహోత్సవం సోమవారం రాత్రి భక్తిశ్రద్ధలతో జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మానుగుంట మహీధరరెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావులు వేర్వేరుగా పాల్గొన్నారు. మతపెద్దలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.



గంధమహోత్సవంలో ఇంటూరి నాగేశ్వరరావు

పొగాకు బ్యారన్ దగ్ధం : రూ.2 లక్షల నష్టం



మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

లింగసముద్రం, ఫిబ్రవరి 6 : మండలంలోని తిమ్మారెడ్డిపాలెంలో పొగాకు బ్యారన్ దగ్ధమై రూ.2 లక్షల నష్టం వాటిల్లింది. వివరాల మేరకు.. పొగాకు రైతు నలబోలు వెంకటేశ్వర్లుకు చెందిన బ్యారన్‌లో మంగళవారం ఉదయం 6.30 గంటల సమయంలో అల్లుడు కర్ర జారి పొగ గొట్టంపై పడి మంటలు వ్యాపించాయి. ఈ మంటలు కొద్దిసేపటికే బ్యారన్ లోపల చుట్టుముట్టాయి. దీంతో స్థానికులు కందుకూరు అగ్నిమాపక కేంద్రానికి సమాచారమిచ్చారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి బ్యారన్‌లోని మంటలను ఆర్పివేశారు. కానీ అప్పటికే బ్యారన్‌లోని 1300 పొగాకు అల్లుడు కర్ర, టైర్లు, పొగ గొట్టాలు కాలిపోయాయని బాధిత రైతు చెప్పారు. ఈ ఘటనలో సుమారు రూ.2 లక్షలు నష్టం జరిగిందని ఆవేదన చెందారు. పొగాకు బోర్డు అధికారులు తనను ఆదుకోవాలని కోరారు.

భవన నిర్మాణ కార్మికులకు అండగా ఉంటాం



కార్మికులతో జనసేన నాయకులు సిద్ధు

కావలిటౌన్, ఫిబ్రవరి 6: భవన నిర్మాణ కార్మికులకు జనసేన అండగా ఉంటుందని ఆ పార్టీ నాయకులు సిద్ధు పేర్కొన్నారు. మంగళవారం ఉదయం జనంలోకి జనసేన 181వ రోజు కార్యక్రమంలో భాగంగా లత థియేటర్ సెంటర్‌లో కార్మికులతో జనసేన శ్రేణులు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా సిద్ధు మాట్లాడుతూ జగన్ పాలనలో ఇసుక, గ్రావెల్ కొరతతో నిర్మాణ పనులు లేక ఉపాధి కోల్పోయి వేలాదిమంది కార్మికులు హైదరాబాద్, చెన్నైకు వలసలు పోతున్నారని ఆరోపించారు. రాబోయేది జనసేన, టీడీపీ ప్రభుత్వమని, భవన నిర్మాణ కార్మికులకు పవన్‌కల్యాణ్ అండగా నిలబడతారన్నారు. కార్యక్రమంలో జనసేన జిల్లా కార్యదర్శి సమ్మెన వెంకటసుబ్బయ్య, సీనియర్ కాపు నాయకులు తోట శేషయ్య, బెల్లంకొండ వెంకటేశ్వర్లు, రూరల్ అధ్యక్షుడు తిరుపతిస్వామి, పుల్లయ్య, సాయి, లక్ష్మణ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగదారుల సమస్యలు పరిష్కరించండి



మాట్లాడుతున్న విశ్రాంత న్యాయాధికారి శ్రీనివాస ఆంజనేయమూర్తి

కావలిటౌన్, ఫిబ్రవరి 6: విద్యుత్ వినియోగదారుల సమస్యలు పరిష్కరించాలని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక ఛైర్‌పర్సన్ వి శ్రీనివాస ఆంజనేయమూర్తి పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని వెంగళరావునగర్‌లోని విద్యుత్ ఈఈ కార్యాలయం ఆవరణలో ఈఈ బెనర్జీ పర్యవేక్షణలో ప్రత్యేక విద్యుత్ అదాలత్ జరిగింది. ఈ అదాలత్‌కు కేవలం నలుగురే రావడంతో వేదిక బాధ్యులు ఉదయం 11-30 నుంచి మధ్యాహ్నం 1-30 గంటల వరకు ఎదురు చూసి కార్యక్రమాన్ని మమ అనిపించారు. కార్యక్రమంలో కే.రామమోహనరావు, అంజనీకుమార్, జీ.ఈశ్వరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ రిటైరీ సంక్షేమ సంఘం డైరీ ఆవిష్కరణ

కావలిటౌన్, ఫిబ్రవరి 6: కావలి డివిజన్ రెవెన్యూ రిటైరీ సంక్షేమ సంఘం డైరీని ఆర్డీవో శీనానాయక్ మంగళవారం ఆర్డీవో కార్యాయలంలో ఆవిష్కరించారు. సంఘం డివిజన్ అధ్యక్షుడు, విశ్రాంత డిప్యూటీ తహసీల్దారు మొగల్ సిరాజ్‌బేగ్, కార్యదర్శి ఎం.సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమంలో ఆర్డీవో మాట్లాడుతూ విశ్రాంత రెవెన్యూ సిబ్బంది సంక్షేమ సంఘంగా ఏర్పడి సభ్యుల సంక్షేమం కోసం పాటుపడడం అభినందనీయమన్నారు. సంఘానికి తన పూర్తి సహాయ సహకారాలు అందిస్తానన్నారు. అనంతరం ఆర్డీవో, తహసీల్దారు, సబ్ ట్రెజరీ అధికారి జగజ్జీవన్‌రామ్, సభ్యులకు డైరీలు పంపిణీ చేశారు.

జగన్‌ది వైఫల్య పాలన : ఇంటూరి

కందుకూరు, ఫిబ్రవరి 6: రాష్ట్రంలో జగన్మోహన్‌రెడ్డిది పూర్తిగా వైఫల్య పాలన అని, ఆయన అనాలోచిత విధానాలతో యువత నిర్వీర్యం అవుతోందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు విమర్శించారు. రాష్ట్రానికి రాజధాని లేకుండా చేయడమే గాక యువతకు ఉద్యోగాలు లేకుండా చేసి వారిని మత్తు పదార్థాలకు బానిసలను చేశాడని పేర్కొన్నారు. బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా కోవూరు రోడ్డులో మంగళవారం ఆయన పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించి మినీ మేనిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం హామీని ఇచ్చిన ఎమ్మెల్యే మహీధరరెడ్డి విస్మరించారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు దామా మల్లేశ్వరరావు, ముచ్చు శ్రీను, మచ్చా మనోహర్, పువ్వాడి రమేష్, నందనవనం రాము, శేఖర్, నందికనమల లక్ష్మణరావు, పీలా శ్రీనివాసులు, బొట్లగూడూరి శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

సీఎంవో నుంచి 'వంటేరు'కు పిలుపు

జలదంకి, ఫిబ్రవరి 6: కావలి మాజీ ఎమ్మెల్యే, వైసీపీ రాజకీయ సలహాదారుడు వంటేరు వేణుగోపాల్‌రెడ్డికి సీఎంవో కార్యాలయం నుంచి మంగళవారం పిలుపు వచ్చింది. దీంతో ఆయన అమరావతికి వెళ్లారు. బుధవారం సీఎం జగన్‌ను తాడేపల్లిలోని ఆయన నివాసంలో కలవనున్నారు. కొంతకాలంగా సీఎం అపాయింట్‌మెంట్ కోసం ప్రయత్నించిన వంటేరుకు ఎట్టకేలకు పిలుపు వచ్చింది. వంటేరు ఉదయగిరి వైసీపీ టికెట్ ఆశిస్తుండడం, సీఎంవో నుంచి పిలుపు రావడంతో రాజకీయవర్గాల్లో చర్చనీయాంశమైంది.

బస్ షెల్టర్ ప్రారంభం

కొండాపురం, ఫిబ్రవరి 6: మండలంలోని సాయిపేటలో దాతల సహకారంతో నిర్మించిన బస్ షెల్టర్‌ను సర్పంచు కోటేశ్వరమ్మ మంగళవారం ప్రారంభించారు. గ్రామానికి చెందిన చిమట నర్సయ్య, కామ్రేడ్ గంటా లింగయ్యల జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు, గ్రామంలోని యువకులు సంయుక్తంగా ప్రయాణికుల సౌకర్యార్థం బస్ షెల్టర్ నిర్మించారు. ఈ కార్యక్రమంలో నర్సయ్య సతీమణి భూశమ్మ, లింగయ్య సతీమణి అనుసూయమ్మ, చిమట వెంకటేశ్వర్లు, గంటా శ్రీనివాస్ ప్రసాద్, సామాజిక కార్యకర్త ఎమ్.మాలకొండారెడ్డి, బి.వెంకటేశ్వర్లు, జయంపు కనకయ్య పాల్గొన్నారు.

జగన్‌తోనే చిరువ్యాపారుల సంక్షేమం

కావలిటౌన్, ఫిబ్రవరి 6: జగనన్నతోనే చిరువ్యాపారుల సంక్షేమం సాధ్యమని ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ట్రంకురోడ్డు మార్జిన్‌లో వ్యాపారాలు చేసుకునే చిరువ్యాపారుల వద్దకు ఎమ్మెల్యే వెళ్లి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట వైసీపీ నేతలు శివకుమార్ రెడ్డి, కనమర్లపూడి నారాయణ, వడ్లమూడి వెంకటేశ్వర్లు, షేక్ చెన్నయ్య, నున్నా మురళీ పాల్గొన్నారు.

రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలి

కావలి రూరల్, ఫిబ్రవరి 6: ప్రతి ఒక్కరు రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని జూనియర్ రెడ్‌క్రాస్ విభాగం కన్వీనర్ ఏవీ హనుమకుమార్ పేర్కొన్నారు. మండలంలోని మాతినవారిపాలెం ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం రక్తదానంపై అవగాహనంపై అవగాహన కార్యక్రమం జరిగింది. విద్యార్థులకు రక్త గ్రూపు నిర్ధారణ పరీక్షలు చేశారు. అనంతరం విద్యార్థులకు రక్తదానంపై అవగాహన కల్పించేందుకు ఉపాధ్యాయులు రాధాక్రిష్ణ, రామచంద్ర, రమణకుమార్, పూర్వ విద్యార్థులు వంశీక్రిష్ణ, భాస్కర్, శ్రీనివాస్ తదితరులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుచరిత, ప్రభాకర్, జగన్మోహన్ పాల్గొన్నారు.